అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 26-01-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 337
Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar
12 పేజీలు + వేదిక (సోపతి) వెల : 8.00





నవచిత్రం



6 భాషల్లో 'వెంకటలచ్చిమి'

పాయల్ రాజ్‌పుత్ నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'వెంకటలచ్చిమి'. రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మాతలుగా, డైరెక్టర్ ముని దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ఈ మూవీ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ ముని మాట్లాడుతూ.. "వెంకటలచ్చిమి'గా కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ట్రైబల్ గర్ల్ యాక్షన్ రివేంజ్ డ్రామాగా ఇండియన్ ఇండస్ట్రీలో ఈ సినిమా సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు.

హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ,'మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. డైరెక్టర్ ముని ఈ కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ సినిమా తర్వాత నా పేరు 'వెంకటలచ్చిమి'గా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది. నా కెరీర్‌కి నెక్స్ట్ లెవల్‌గా ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నిలిచిపోతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ముని, మ్యూజిక్ డైరెక్టర్: వికాస్ బడిశా, ప్రొడ్యూసర్: రాజా, ఎస్ఎస్ చౌదరి



'ఎల్‌వైఎఫ్' టీజర్ విడుదల

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తూ మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ బ్యానర్లపై కిషోర్ రాఠి, మహేష్ రాఠి, ఏ రామస్వామి రెడ్డి నిర్మాతలుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'ఎల్‌వైఎఫ్'.

ఎస్పీ చరణ్, ప్రవీణ్, భద్రం, నవాబ్ షా, షకలక శంకర్, రవిబాబు, రియా, సంధ్య తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ చిత్ర టీజర్ ని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'మంచి కథతో వస్తున్న ఈ చిత్రం గొప్ప విజయాన్ని సాధించాలి. తీసే సినిమాలు ఎక్కువ బడ్జెట్లో కాకుండా మంచి కంటెంట్ తో తక్కువ బడ్జెట్ తో ఉంటే సినిమాలు బాగుంటాయి. ఎక్కువ బడ్జెట్ పెట్టి తర్వాత టికెట్ రేట్లు పెంచాలని ప్రభుత్వాన్ని అడగడం కంటే తక్కువ బడ్జెట్లో మంచి కంటెంట్ ఉన్న చిత్రాలు ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం మంచిది.

ఈ చిత్రం అలా తక్కువ బడ్జెట్లో, మంచి కంటెంట్ తో వస్తున్న చిత్రం. ఇటువంటి చిత్రాలను ప్రోత్సహించడంలో సినిమాటోగ్రఫీ మినిస్టర్ గా నేను ముందుంటాను. ఓటిటిలో అయినా థియేటర్లో అయినా తక్కువ బడ్జెట్ తో వచ్చే చిన్న సినిమాలు మంచి విజయాన్ని సాధిస్తున్నాయి. కొత్త సినిమాలతో పోటీపడుతూ కలెక్షన్స్ వసూలు చేస్తున్నాయి' అని అన్నారు.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: పవన్ కేతరాజు, సినిమాటోగ్రఫీ : శ్యామ్ కె నాయుడు, సంగీతం : మణిశర్మ, యాక్షన్ : కార్తీక్ క్రౌడర్, ఎడిటర్ : ఆర్. కె, కొరియోగ్రఫీ : మోయిన్, ఆర్ట్ : చిడిపల్లి శంకర్.

కలర్‌ఫుల్‌గా 'మై సౌత్ దివా క్యాలెండర్'



ప్రముఖ ఫొటోగ్రాఫర్ మనోజ్ కుమార్ కటోకర్ రూపొందించిన ప్రతిష్టాత్మక 'మై సౌత్ దివా క్యాలెండర్' ద్వారా ఇప్పటికే పలువురు హీరోయిన్స్ పరిచయమై.. అగ్రశ్రేణిలో ఉన్నారు. తాజాగా 2025 క్యాలెండర్ ను 12 మంది స్టార్స్ తో శుక్రవారం గ్రాండ్ గా లాంచ్ చేశారు.

హీరోయిన్స్ శ్రియా శరన్, కేథరిన్ థెరిస్సా, కాజల్ అగర్వాల్, మాళవికా శర్మ, తాన్య హెూప్, ఐశ్వర్య కృష్ణ, కుషిత కొల్లాపు, వినాలీ భట్నాగర్, రియా సచ్ దేవ్, కనిక మాన్, పలక్ అగర్వాల్ తో ఈ క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఫౌండర్ మనోజ్ కుమార్ కటొకర్, భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డితోపాటు సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్, దర్శకులు కరుణ కుమార్, సుజనా రావు ముఖ్య అతిథులుగా హాజరై తమ విషెస్ తెలియజేశారు.

ఈ సందర్భంగా మై సౌత్ దివా క్యాలెండర్ ఫౌండర్, ఫోటో గ్రాఫర్ మనోజ్ కుమార్ కటొకర్ మాట్లాడుతూ,'మా క్యాలెండర్ ను తొమ్మిది ఏళ్లుగా సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. 12 మంది హీరోయిన్స్ తో కూడిన ఈ క్యాలెండర్ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా. మా క్యాలెండర్ ద్వారా ఇప్పటికే కొత్తవారిని మోడల్స్ గా పరిచయం చేశాం. అలాగే కొంతమంది హీరోయిన్స్ గా మంచి గుర్తింపును అందుకున్నారు. ఈ ఏడాది మరో ఐదుగురిని ఇంట్రడ్యూస్ చేస్తున్నాం. ఈ జర్నీలో నాకు సపోర్ట్ గా నిలిచిన మా పార్ట్నర్స్ భారతి సిమెంట్స్, కియారా జ్యువెలరీ, ఈరా క్లినిక్స్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు' అని చెప్పారు.

భారతి సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, 'సౌత్ దివా క్యాలెండర్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంది. ఒక క్యాలెండర్‌లో చాలా కల్చర్స్ ఉండటం మంచి పరిణామం. స్టార్ హీరోయిన్స్‌తో ఉన్న ఈ క్యాలెండర్ కలర్‌ఫుల్‌గా ఉంది' అని అన్నారు

రాష్ట్ర మహాసభకు 'నవతెలంగాణ' ప్రత్యేక సంచిక

ఆవిష్కరించిన బీవీ.రాఘవులు, తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభ ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డిలో జరుగుతున్నందున 'నవతెలంగాణ' ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది. మహాసభ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహించిన ప్రజా పోరాటాలు, సాధించిన విజయాలకు సంబంధించి ఆర్టికల్స్‌తో పాటు పలువురు ప్రజానాయకుల ఇంటర్వ్యూలతో కూడిన ప్రత్యేక సంచికను శనివారం పీఎస్ఆర్ గ్రౌండ్‌లో జరిగిన సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభ బహిరంగ సభలో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జి.నాగయ్య, బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, టి.జ్యోతి, మల్లు లక్ష్మి, అబ్బాస్, పాలడుగు బాస్కర్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్‌తో కలిసి సభావేదికపై ఆవిష్కరించారు. నవతెలంగాణ మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్‌కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతీ య ప్రతినిధి మేకల కృష్ణయ్య, డెస్క్ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, రిపోర్టర్స్ సుదర్శన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, ఏడివిటి బాధ్యులు మల్లేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు 4 పథకాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేస్తామని వెల్లడించారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా, భూమిలేని నిరుపేద, ఉపాధి హామీ పథకంలో 20 రోజులపాటు పనిచేసిన వారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు తీసుకొని అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. లక్షలాది సంఖ్యలో వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి జనవరి 26న అత్యంత పరమ పవిత్రమైన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు ఈ సంక్షేమ పథకాల అమలును ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని నూరు శాతం ఆ గ్రామంలో ఈ నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. లక్షలాదిగా వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్లలో ఎంట్రీ చేసి అర్హులను గుర్తిస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి ఉదాత్త ఉన్నతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఇందిరమ్మ రాజ్యం సంక్షేమ రాజ్యం అని తెలిపారు.అంతకు ముందు ఆ నాలుగు పథకాలపై సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు.

నేడు నారాయణపేట జిల్లాలో

సీఎం రేవంత్ రెడ్డి నాలుగు పథకాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం, చంద్రవంచ గ్రామంలో మధ్యాహ్నం 1.15 నుంచి 2.15 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఇందు కోసం ఆదివారం మధ్యాహ్నం 12.10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లనున్నారు.

తమ్మినేని సోదరి తోటకూరి సరోజిని మృతి

పలువురి నివాళి

నవతెలంగాణ-చింతకాని

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోదరి, ఖమ్మం జిల్లా చింతకాని మండలం రేపల్లెవాడ గ్రామానికి చెందిన తోటకూరి సరోజిని(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. మృతదేహానికి ఆమె తమ్ముడు తమ్మినేని వీరభద్రం నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపల్లెవాడ గ్రామంలో సీపీఐ(ఎం)కు ఆమె పునాదులు వేసినట్టు చెప్పారు. పార్టీ కార్యకలాపాలలో తమ బావకి చేదోడు వాదోడుగా ఉంటూ, సహకరిస్తూ ఉండేదని, అలాంటి వ్యక్తి ఈరోజు మన మధ్యన లేకపోవడం మా కుటుంబానికి తీరని లోటుగా భావిస్తున్నామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, నాయకులు కృష్ణమూర్తి కిరణ్ బాబు తదితరులు నివాళి అర్పించారు.



ఉద్యోగులను మరోసారి మోసగించేందుకే యూపీఎస్

- ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులను మరోసారి మోసగించడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్)ను ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి తెస్తున్నదని ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ విమర్శించారు. సీపీఎస్, యూపీఎస్ వద్దనీ, ఓపీఎస్ ముద్దని అన్నారు. శనివారం ఎన్ఎంఓపీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న యూపీఎస్‌కు సంబంధించిన గెజిట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిందని పేర్కొన్నారు. దీని ద్వారా ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ వసూలు చేసి పెన్షన్ అమలు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కొత్త విధానం ద్వారా ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ రూపంలో ఎన్‌పీఎస్ ట్రస్ట్ ద్వారా జమ అయిన రూ.10.5 లక్షల కోట్ల నిధులు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్తాయని వివరించారు. మరోసారి ఉద్యోగుల సంక్షేమం, కుటుంబ సామాజిక భద్రత ఆలోచించకుండా కేవలం షేర్ మార్కెట్ ద్వారానే ఉద్యోగి భవితవ్యాన్ని నిర్ణయించే ఈ యూపీఎస్ విధానాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగం ఆర్టికల్ 21 ద్వారా కాంట్రిబ్యూషన్ లేని పెన్షన్ ఒక హక్కుగా ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ల అనుకూల విధానాలను వంతన పాడే కుహనా ఆర్థికవేత్తలు ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు సిఫారసు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్పొరేట్ల కడుపు నింపే విధంగా ఈ పెన్షన్ విధానం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ రిపబ్లిక్‌డే శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏండ్లు కావస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామిక స్వయంపాలనను అమలుల్లోకి తెచ్చి, భారతదేశాన్ని సార్వభౌమాధికార, సర్వసత్తాక, గణతంత్ర దేశంగా నిలిపిన రాజ్యాంగ నిర్మాతలకు ఈ సందర్భంగా కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు. సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక రంగాల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, మహిళలకు సమాన భాగస్వామ్యం దక్కేలా పాలకులు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

వారం రోజుల్లో నలుగురు రైతుల ఆత్మహత్య

- మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అప్పుల బాధలు భరించలేక వారం రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు చనిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. "కాంగ్రెస్‌కు నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచి, నమ్మక ద్రోహం చేస్తున్నది. రుణమాఫీ పూర్తి చేస్తే రైతులు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి. అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

- ములుగులో రోడ్డు భద్రత మాసోత్సవాలు
- టాస్క్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-ములుగు

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమావళిని పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం సాధన స్కూల్ నుంచి సాధన స్కూల్ వరకు 3కే రన్నింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ దివాకర్ టీఎస్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ బానోతు రవిచందర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పైడాకుల అశోక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. నాణ్యమైన ఆహారాన్ని తీసుకుంటూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకంగా ఉండాలని సూచించారు. సహజ సిద్ధమైన కూరగాయలను తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నియంత్రణ అలవర్చుకోవాలని అన్నారు. తప్పుదారుల్లో వాహనాలను నడపటం, అధిక వేగం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు గురై ఎంతోమంది విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యకరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. రోడ్డుపై లభించే తినుబండారాలను విచ్చలవిడిగా తినడం వల్ల చిన్నపిల్లలకు సైతం గుండె జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని, ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో సహజసిద్ధమైన కూరగాయలను సాగు చేసుకోవాలని చెప్పారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. ములుగు జిల్లా గిరిజన ప్రాంతమని, రోడ్డు భద్రత నియమావళిని పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాతే వాహనాలు నడపాలని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ మాట్లాడుతూ.. తాను కళాశాలలో ఉన్నప్పుడే రోడ్డు భద్రత నియమావళిని పూర్తిస్థాయిలో అవగాహన చేసుకున్నానని, జీవితం పోతే తిరిగి రాదని, రోడ్డు ప్రమాదాలలో విలువైన ప్రాణాన్ని తీసుకోవద్దని వికలాంగులుగా మారవద్దని చెప్పారు.

జిల్లాలో టాస్క్ శిక్షణ కేంద్రం ఏర్పాటు గొప్ప వరం

నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు, ప్రతిభ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవడానికి జిల్లాలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప వరమని మంత్రి సీతయ్య అన్నారు. కష్టంలో వచ్చిన విజయం జీవితాంతం సంతోషాన్నిస్తుందని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్‌ను కలెక్టర్ దివాకర్ టి.ఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవి చందర్‌తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టాస్క్ సెంటర్ మారుమూల ప్రాంతాల యువతి, యువకులకు ఎంతగానో దోహదపడుతుందని, ప్రతిభా పరిజ్ఞానం లేకపోతే ఉన్నత చదువులు చదివినా లాభం ఉండదని చెప్పారు.

వక్ఫ్ కమిటీ చైర్మెన్ చర్యను తప్పుబట్టిన సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : వక్ఫ్ బిల్లుపై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మెన్ తీసుకున్న చర్యను సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో తీవ్రంగా విభేదించింది. ప్రభుత్వ అభిప్రాయాలను వ్యతిరేకించినందుకు జేపీసీలోని ప్రతిపక్ష సభ్యులందరినీ సస్పెండ్ చేయడానికి కమిటీ చైర్మెన్ ఎంచుకున్న కారణం చాలా పేలవంగా వుందని విమర్శించింది. కమిటీ వ్యవస్థకు సంబంధించి ఏండ్ల తరబడి స్పష్టంగా రూపొందించుకుని, అనుసరిస్తూ వచ్చిన సాంప్రదాయాలన్నింటినీ తుంగలో తొక్కి చట్టబద్ధమైన పార్లమెంటరీ ప్రక్రియను దెబ్బతీయడం కన్నా మరేదీ దారుణం కాబోదని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్డీఏ ప్రభుత్వం అనుసరించే ఇటువంటి దారుణ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రతిఘటించేందుకు ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్ సార్వభౌమాధికారాన్ని గౌరవించే వారందరూ ఏకతాటిపైకి రావాలని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

ఆటలు

అనికెత్ రెడ్డి మాయజాలం

గెలుపు ముంగిట హైదరాబాద్



నవతెలంగాణ-హైదరాబాద్ : రంజీ ట్రోఫీ గ్రూప్-బి హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ గెలుపు ముంగిట నిలిచింది!. బ్యాటర్లు, బౌలర్లు సత్తా చాటడంతో ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆధిపత్యం చెలాయిస్తోంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ అనికెత్ రెడ్డి (5/72) ఐదు వికెట్ల మాయజాలానికి తోడు స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ (2/62) మెరవటంతో హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 92 ఓవర్లలో 275 పరుగులకే కుప్పకూలింది. హిమాచల్ తరఫున శుభమ్ అరోరా (53), మహజన్ (68), ఆకాశ్ (46) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన హైదరాబాద్.. హిమాచల్ ప్రదేశ్‌ను ఫాలోఆన్ ఆడించింది. ఫాలోఆన్‌లో హిమాచల్ ప్రదేశ్ 5 ఓవర్లలో 21/0తో పోరాడుతోంది. హైదరాబాద్, హిమాచల్ ప్రదేశ్ రంజీ మ్యాచ్‌లో నేడు ఆఖరు రోజు. హిమాచల్ మరో 269 పరుగుల వెనుకంజలో ఉండగా.. నేడు వీలైనంత త్వరగా పది వికెట్లు పడగొట్టి విజయాన్ని అందుకునేందుకు హైదరాబాద్ ఎదురుచూస్తోంది.

చాంపియన్ మడిసన్ కీస్

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025

మెల్‌బోర్న్ : ఎటువంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అమెరికా అండర్ డాగ్, 29 ఏండ్ల మడిసన్ కీస్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రెండు సార్లు చాంపియన్ అరినా సబలెంకపై మడిసన్ కీస్ మూడు సెట్ల సమరంలో పైచేయి సాధించింది. 6-3, 2-6, 7-5తో మడిసన్ కీస్ గెలుపొందింది. మడిసన్ కీస్ కెరీర్‌లో ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ విజయం. ఆరు ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో కీస్ అదరగొట్టింది. పాయింట్ల పరంగా 92-91తో సబలెంకకు గట్టి పోటీ ఇచ్చింది. మడిసన్ 15 గేములు నెగ్గగా, సబలెంక 14 గేములు గెలుపొందింది.

సంపుటి : 10 సంచిక : 337

www.navatelangana.com

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar

ఆదివారం 26-01-2025

12 పేజీలు + వెబ్‌లో (సోపతి)

వెల : 8.00



విభజించు.. పాలించు

ఇదే కాషాయపరివార్ విధానం | జనం మదిలో రాజ్యాంగం..బీజేపీ మనసులో మనువాదం

- ప్రజల విశ్వాసాలకు, ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వకు సంబంధమే లేదు
- మతాన్ని రాజకీయాలకు వాడుకోవడం దేశానికే ప్రమాదకరం
- అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలి
- సామాన్యులపైకి బుల్డోజర్ వస్తే ఎర్రజెండా అడ్డుకుంటుంది
- కార్మికులు, రైతుల హక్కుల కోసం నిలబడేది కమ్యూనిస్టులే
- సమాజమార్పు కోసం పోరాడాలి : సీపీఐ(ఎం) బహిరంగసభలో పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

' మతోన్మాదాన్ని తుదముట్టిస్తాం.. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం.. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసే దాకా పోరాడతాం...' అని సీపీఐ (ఎం) శ్రేణులు ప్రతినబూనాయి. కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుబెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో పోరాట పథాన్ని నిర్దేశిస్తూ, భవిష్యత్ ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తూ సీపీఐ (ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు శనివారం సంగారెడ్డి పట్టణంలో అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సన్నాహకంగా పట్టణంలో నిర్వహించిన భారీ ప్రజా ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు సైతం పాలకుల విధానాలను ఎండగట్టాయి. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ మహాసభల ప్రారంభ సూచికగా స్థానిక పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, బీవీ రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు ప్రసంగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణలో బీజేపీ మత రాజకీయాలను అడ్డుకొంటామని అందుకు కలిసొచ్చే శక్తులన్నింటినీ కలుపుకుని పోతామని వారు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. కులాలు, మతాల ఆధారంగా జనాన్ని విభజించి పాలించాలని చూస్తున్న ఆ పార్టీ కుయుక్తులను ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

వివరాలు 12లో



కార్పొరేట్లే వాళ్ల దోస్తులు : బీవీ రాఘవులు



ట్రంప్, మోడీ, రేవంత్‌రెడ్డిలకు సంపన్నులే దోస్తులని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు విమర్శించారు. వారికి పేదల బాధలు పట్టవన్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేక పార్టీలను, ప్రభుత్వాలను చూశామనీ, ఆ పార్టీల మాదిరిగా సీపీఐ(ఎం) కాదని చెప్పారు. తమ పార్టీ పేదలు, సామాన్యులు, రైతులు, కార్మికుల బతుకుల బాగు కోసం నిరంతరం కొట్లాడుతుందని చెప్పారు. బడుగుల బతుకులు బాగుపడాలంటే ఎర్రజెండా పాలన రావాలని ఆకాంక్షించారు. కమ్యూనిస్టులు ప్రశ్నిస్తారనే పాలకులు భయపడుతున్నారని విమర్శించారు. దున్నేవాడిదే భూమి కావాలని కొట్లాడేది కమ్యూనిస్టులేనని ...12లో

మతోన్మాదులారా.. ఖబడ్దార్ : తమ్మినేని



బీజేపీ దేశానికే కాకుండా తెలంగాణకు కూడా ప్రమాదకరమైన పార్టీ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆ పార్టీని ఫాసిస్టు లక్షణాలున్న ఆర్ఎస్ఎస్ నడుపుతున్నదని విమర్శించారు. ఎక్కడ అవకాశం దొరికినా మతాలు, కులాల మధ్య తగాదాలు పెడుతున్నదని చెప్పారు. ఉట్నూరు, జైనూరులో జరిగిన ఘటనలు అందులో భాగమేనని వివరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, పేదల విముక్తి కోసమే సాగిందన్నారు. కానీ బీజేపీ దాన్ని హిందూముస్లింలకు మధ్య పోరాటం జరిగిందంటూ చరిత్రను వక్రీకరిస్తున్నదని విమర్శించారు. ఏటా సెప్టెంబర్ 17న హిందూ ముస్లింల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నదని అన్నారు. తమ చూపంతా బీజేపీని రాష్ట్రంలోకి రానీయకుండా ...12లో

31న ఉస్మానియా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

ప్రయివేటును తలదన్నేలా నిర్మాణాలు

- వందేండ్ల అవసరాలకు తగినట్టు ఆధునిక సౌకర్యాలు
- పార్కింగ్, ఫైర్‌స్టేషన్, ఎస్టీపీ, హెలీ అంబులెన్స్ ఏర్పాట్లు
- అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజిన్‌ల కోసం ప్రత్యేక ట్రాక్
- మార్చురీ, బాడీ ఫ్రీజింగ్‌లో ఆధునిక పద్ధతులు : సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఈనెల 31వ తేదీ ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఉన్నతాధికారులను ఆదేశించారు. వందేండ్ల భవిష్యత్ అవసరాలకు తగినట్టు పూర్తి ఆధునిక వసతులతో ఆస్పత్రి భవన నిర్మాణం ఉండాలని ఆకాంక్షించారు. దానికోసం ఎక్కడా రాజీపడొద్దని అధికారుల్ని హెచ్చరించారు. శనివారం తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ ప్లాన్‌లో మార్పులు సూచిస్తూ, సీఎం దిశానిర్దేశం చేశారు. ఆస్పత్రితో పాటు వైద్య కళాశాల నిర్మాణం, అక్కడి వైద్య విద్యార్థులు, బోధనా సిబ్బందికి వేర్వేరుగా హాస్టల్ భవనాలు నిర్మించాలని చెప్పారు. పార్కింగ్, ల్యాండ్ స్కేప్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలనీ, రాకపోకల కోసం ...11లో



వైవిధ్యతను ఆచరిస్తేనే సమానత్వం

- ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి
- లక్ష్యసాధన దిశగా సాగాలి : దేశ ప్రజలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వివరాలు 11లో

పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం

- ఏడుగురికి పద్మ విభూషణ్
- 19 మందికి పద్మ భూషణ్..
- 113 మందికి పద్మశ్రీ
- ఏడుగురు తెలుగువారికి పురస్కారాలు
- తెలంగాణ నుంచి ఇద్దరు..
- ఏపీ నుంచి ఐదుగురు
- వైద్య విభాగంలో దువ్వూరి నాగేశ్వర్ రెడ్డికి పద్మ విభూషణ్
- ప్రజా వ్యవహారాలు కేటగిరిలో మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ
- ఏపీ నుంచి నటుడు బాలకృష్ణకు పద్మభూషణ్
- మరో నలుగురికి పద్మశ్రీ

వివరాలు 11లో



(ఫైల్)

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఐలయ్య మృతి

- పేదల పక్షాన అలుపెరగని పోరాటాలు
- పలు రాజకీయ పార్టీల నేతల నివాళి

వివరాలు 11లో

చీనాబ్ బ్రిడ్జిపై వందేభారత్

జమ్మూ కాశ్మీర్ : జమ్మూ కాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన పై వందేభారత్ రైలు తొలి కూత పెట్టింది. ఈ వంతెనపై శనివారం వందేభారత్ రైలు ఫస్ట్ ట్రయల్ రన్స్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా స్టేషన్ నుంచి శ్రీనగర్ స్టేషన్ వరకూ ...11లో



నేడు 4 పథకాలు ప్రారంభం

రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు

- సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి
- వివరాలు వెల్లడించిన మంత్రులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేడు (ఆదివారం) రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు నాలుగు పథకాలు లాంఛనంగా ప్రారంభించబోతున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షల్లో దరఖాస్తులు వచ్చినందున రేపటి నుంచి మార్చి వరకు లబ్దిదారుల గుర్తింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఈ నాలుగు పథకాలను ఆదివారం నుంచి ప్రతి మండలంలో ఒక గ్రామంలో నూరు శాతం ...2లో

నవతెలంగాణ



గణతంత్రం @ 75

ఎన్ని సవాళ్లు, ఒడిదొడుకులు ఉన్నా ఇప్పటివరకూ దేశ ప్రజలను ఐక్యంగా నిలిపే ప్రయత్నంలో రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. అనేక అవాంతరాలనూ అధిగమించింది కూడా. కానీ నేడు మత ప్రాతిపదకన ప్రజలను చీల్చే విధానాలు రాజ్యాంగ స్వభావాన్నే దెబ్బతీస్తున్నాయి. అసలు రాజ్యాంగం మీదనే విశ్వసమూ, అమలు చేయాలన్న నిశ్చయం లేని వారుగా పాలకులు ఉండటం నేడు రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ప్రజల అప్రమత్తత, చైతన్యం మాత్రమే రాజ్యాంగానికి రక్ష.

సంపాదకీయం

"భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ - సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, భావ ప్రకటన, విశ్వాసం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని, అవకాశాల్లో, అంతస్తుల్లోనూ సమానత్వాన్ని చేకూర్చడానికి, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మాకు మేము సమర్పించుకుంటున్నాము". ఇది రాజ్యాంగ పీఠిక సారాంశం. దీని యొక్క సారాంశంగానే రాజ్యాంగం రూపుదిద్దుకున్నది. అలా రూపుదిద్దుకుని అమలులోకి వచ్చి నేటికి 75 ఏండ్లు నిండుతున్నవి. దాదాపు మూడేండ్లపాటు తీవ్రమైన కృషిచేసి అనేక దేశాల పరిపాలనను, రాజ్యాంగాలను పరిశోధించి ఏర్పాటుచేసుకున్న అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మనది. రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా డా. బాబూ రాజేంద్ర ప్రసాద్, డ్రాఫ్టింగ్ కమిటీ అధ్యక్షులుగా డా॥ బి.ఆర్.అంబేద్కర్‌లు, మరికొందరు మేధోసంపన్నులు చర్చించి అందించిన మహత్ ప్రణాళిక ఇది. అయితే ఎంతో శ్రమకోర్చి ఇంత పెద్ద రాజ్యాంగాన్ని ప్రజలందరి హక్కులకు, స్వేచ్ఛకు, ప్రజాస్వామిక విధానానికి హామీ ఇస్తూ సమర్పించిన అంబేద్కర్ ఏమన్నారంటే, ఈ రాజ్యాంగం ఘనమైనది, గొప్పదైనదీ అయినప్పటికీ, దీన్ని అమలు చేసే వాళ్లు చెడ్డవారైతే ఎందుకూ పనికిరాదని సెలవిచ్చాడు. ఆ ప్రమాదం 75 ఏండ్ల తర్వాత మరింత పెరిగింది.

రాజ్యాంగ నిర్మాణం కేవలం మేధావుల సృజనాత్మక అంశంగా రూపెత్త లేదు. రాజ్యాలు, సామ్రాజ్యాలు, రాజులు, సామంతులుపోయి బ్రిటీష్‌వారి ఏకచక్రాధిపత్యంలోకి వచ్చాక రెండు వందలేండ్లు సాగిన దోపిడిపై సమైక్యంగా ప్రజల తిరుగుబాటులోంచి స్వాతంత్ర్య పోరాటం నడిచింది. జాతి, మత, కుల, ప్రాంత భేదాల నొదిలి వీరోచిత త్యాగాల ఫలంగా స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆనాడు ప్రజలలో ఏర్పడిన ఐక్యత, సమానత, సౌభ్రాతృత్వాల కారణంగా వారి ఆశలు, ఆకాంక్షలు, ఆలోచనల ప్రతిబింబమే మన గణతంత్రం. మరి ప్రజల ఆకాంక్షలు ఏ మేరకు నెరవేరాయి! ఏ దిశగా మన పయనం సాగుతున్నది చర్చించుకోవాల్సిన సందర్భం ఇది. ఈ రాజ్యాంగం ఏర్పడిననాడే, ఈ రాజ్యాంగాన్ని మేము అంగీకరించమని, వ్యతిరేకిస్తూ మాట్లాడినవారు, ఇదే రాజ్యాంగం ప్రకారం ఎన్నికయి ఏలుబడిలో ఉన్నారు. వారి వారసులే మొన్నీమధ్య ఆగస్టు 15ను నిజమైన స్వాతంత్ర్య దినం కాదని, అయోధ్యలో రాముని ప్రతిష్ఠాపన రోజే స్వాతంత్ర్యదినోత్సవమని ప్రకటించాడు. మనుధర్మమే రాజ్యాంగ ధర్మమనీ ఆలోచించేవారి చేతిలో రాజ్యాంగం అమలుకొనసాగటం నేటి విషాదం! 2015లో గణతంత్ర ఉత్సవాలను జరుపుతున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ముద్రించిన రాజ్యాంగ ప్రతుల పీఠికలో 'సామ్యవాద', 'లౌకిక' పదాలను తొలగించి అందించారు. అదేమంటే, ఆరంభాన అవిలేవని, మధ్యలో 1976లో 42వ సవరణ ద్వారా చేర్చారని చెప్పారు. కానీ సామ్యవాద, లౌకిక విధానాలతో సాగాలని రాజ్యాంగంలో సారభూతంగా ఆది నుండీ ఉంది. 1973లోనే సుప్రీంకోర్టు ఒక తీర్పులో రాజ్యాంగ స్వరూపాన్ని చెబుతూ లౌకిక ప్రజాస్వామిక, సమానత, స్వేచ్ఛ, సమాఖ్య సమన్యాయాలతో కూడినదని తెలిపారు.

సమన్యాయం సాధించబడలేదు, సామాజిక న్యాయమూలేదు, ఆర్థిక అసమానత పెరిగిపోతున్నది. ఇప్పటికీ ఒక్క శాతం ప్రజల దగ్గర 23శాతం దేశ సంపద ఉంది. 10శాతం ప్రజల దగ్గర 55 శాతం సంపద పోగుబడి ఉందని ప్రభుత్వ రిపోర్టులే చెబుతున్నాయి. ప్రజలందరూ స్వేచ్ఛగా మాట్లాడే హక్కునూ లాగేస్తున్నారు. అధికారానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశ ద్రోహులుగా చిత్రిస్తున్నారు. తినే తిండి, కట్టుకునేబట్ట, పెళ్లి, ఉత్సవం ఏదీ కూడా పౌరులు స్వేచ్ఛగా ఆచరించే వీలు లేకుండా పోయింది. ఇక లౌకికత్వం అనే మాట హేళన చేయబడుతున్నది. మెజారిటీ మతానికి మైనారిటీ మతాల ప్రజలు లోబడి ఉండాలని, లేదంటే చంపుతామని, తరుముతామని బహిరంగంగానే బెదిరిస్తున్నారు. ఇక ప్రజాస్వామ్యమూ పలుచనపడిపోయింది. ఒక ఓటుకు ఒకే విలువ అన్నప్పటికీ ఒక మనిషికి ఒకే విలువ లేదు. ఓటూ సరుకై కొనుగోలుకు గురవుతున్నది. రాజకీయాలు ధనకీయాలయిపోయాయి. అందుకే కుబేరుల బొజ్జలు నింపుతూ, అన్నం పెట్టే రైతన్నలపై కండ్లెర్రజేస్తూ హింసిస్తున్నారు. న్యాయం కావాలన్న గొంతులపై ఉక్కుపాదం మోపుతున్నారు. నిర్బంధాలతో అణచివేతలు చేస్తున్నారు. ఇక సామ్యవాద సమసమాజ భావన తుడిచివేసారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అంగలేస్తున్నది. రాజ్యాంగం కల్పించిన హక్కులు అథఃపాతాళానికి తొక్కి వేయబడుతున్నాయి. కొత్త నేర చట్టాలతో ప్రాథమిక హక్కులే మృగ్యమవుతున్నాయి.

ఎన్ని సవాళ్లు, ఒడిదొడుకులు ఉన్నా ఇప్పటివరకూ దేశ ప్రజలను ఐక్యంగా నిలిపే ప్రయత్నంలో రాజ్యాంగం నిర్వహించిన పాత్ర ఘనమైనది. అనేక అవాంతరాలనూ అధిగమించింది కూడా. కానీ నేడు మత ప్రాతిపదకన ప్రజలను చీల్చే విధానాలు రాజ్యాంగ స్వభావాన్నే దెబ్బతీస్తున్నాయి. అసలు రాజ్యాంగం మీదనే విశ్వసమూ, అమలు చేయాలన్న నిశ్చయం లేని వారుగా పాలకులు ఉండటం నేడు రాజ్యాంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు. ప్రజల అప్రమత్తత, చైతన్యం మాత్రమే రాజ్యాంగానికి రక్ష.

దేశానికి రిపబ్లిక్ డే సంకేతాలు


తెలకపల్లి రవి

ఇప్పుడు ఒక అధికార పార్టీ లేదా కూటమి సభలో విశ్వాసం కోల్పోతే, కాదంటే బలాబలాలు మారితే దిగిపోవలసి వుంటుంది.మరెవరూ ముందుకు రాకపోతే సభ రద్దయిపోతుంది. కానీ జమిలి బిల్లు వస్తే ఇదీ వుం డదు. కేంద్రం, రాష్ట్రం, గవర్నర్, రాష్ట్రపతి మధ్య ఏ ప్రభుత్వం, ఏ సభ రద్దవుతుందో, కొనసాగుతుందో తెలియని స్థితి. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా వెంటనే ఎన్నికలు జరపాల్సిన పనిలేదు.కొత్తగా వచ్చే ప్రభుత్వం మిగిలిన కాలానికి మాత్రమే పనిచేస్తుంది.(ఉప ఎన్నికల్లో మిగిలిన కాలమే వున్నట్టు) అంటే జవాబుదారీతనం ఎటుపోతుంది? కొత్తగా ఎన్నికైనవారి పదవీ కాలం తగ్గించడమంటే ఎవరి తప్పుకు ఎవరిని శిక్షిస్తున్నట్టు?

ఈ రోజు దేశవ్యాపితంగా రిపబ్లిక్ డే.అంటే గణతంత్ర దినోత్సవం.దేశ రాజధానిలో భారత దేశ సైనిక పాటవాన్ని ప్రదర్శించడంతో పాటు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన శకటాలను కూడా ప్రదర్శిస్తారు.75 ఏండ్ల కిందట భారత రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకొచ్చిన రోజు. వివిధ పత్రికల్లో రాజ్యాంగ రూపకల్పన చరిత్ర, ప్రాథమిక హక్కులు మౌలిక స్వభావం సుప్రీంకోర్టు తీర్పులు తదితర విషయాలపై జాతీయ పత్రికల్లోనూ తెలుగులోనూ చాలా వ్యాసాలు వెలువడ్డాయి. ఈ సందర్భంలో టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రధాన వ్యాసం ఏడున్నర దశబ్దాల తర్వాత కూడా ముమ్ముందుకు..అనే శీర్షికతో వ్యాసం వెలువడింది. బీజేపీ జాతీయ కార్యదర్శి రాసిన వ్యాసం తెలుగులో వచ్చింది.రాజ్యాంగాన్ని వలసవాద పత్రమని కొంతమంది పేర్కొనడం సరికాదని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలో భారతీయమేదీ లేదని ఆరోపించిన సంస్థ సాక్షాత్తూ ఆరెస్సెస్ మాత్రమేనని ఆ కుదురు నుంచే వచ్చిన నేతలకు తెలియకపోవడం ఆశ్చర్యమే.అప్పట్లో రాజ్యాంగ నిర్మాతలు అమెరికా, బ్రిటన్, కెనడా, స్విడ్జర్లాండ్ వంటి దేశాల రాజ్యాంగాలను కూలంకషంగా అధ్యయనం చేస్తే దానికి మింగుడు పడలేదు. రాజ్యాంగంలో భారతీయతే లేదని దాన్ని ఆమోదించిన రోజునే వారి అధికార పత్రిక 'ఆర్గనైజర్'లో రాశారు. ఆగష్టు 15స్వాతంత్ర దినోత్సవం, జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం రెండే జాతీయ పర్వదినాలుగా జరు గుతూ వచ్చాయి. మోడీ నవంబరు 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్తు ఆమోదించిన రోజు అంటూ దానికి రాజ్యాం గ దినోత్సవం పేరు పెట్టారు. 2015లో అధికారికంగా తీసుకున్న ఈ నిర్ణయం జనవరి 26 రిపబ్లిక్ డే ప్రాధాన్యత తగ్గించేందుకే.

జనవరి 26 ఎందుకు?

1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి తీసుకురావడం స్పష్టమైన అవగాహనతో జరిగింది. 1930జనవరి 26న పూర్ణస్వరాజ్ దినోత్సవం జరపాలని కాంగ్రెస్ జాతీయోద్యమకాలంలో ఇచ్చిన పిలుపును గుర్తు చేసుకోవడానికి ఈ తేదీని తీసుకున్నారు. కాని కాంగ్రెస్ పూర్ణస్వరాజ్ పిలుపునివ్వడానికి రంగం సిద్ధం చేసింది కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం. కాంగ్రెస్‌తో విభేదించి స్వరాజ్య పార్టీ పెట్టుకున్న మోతీలాల్ నెహ్రూ ప్రభృతులు పరిమిత ప్రతిపత్తితో అధికారం పంచుకోవడానికి సిద్ధమవుతున్నారు. దేశ ప్రజలకు సమ్మతించదగిన రాజ్యాంగం ఇవ్వాలని 1924లో స్వరాజ్ పార్టీ తీర్మానం చేసింది. 1920లో తాష్కెంట్‌లో భారత కమ్యూనిస్టు పార్టీకి అంకురార్పణ జరిగిననాటి నుంచి సంపూర్ణ స్వరాజ్యం కోరుతూ వచ్చారు. 1921 అహ్మదాబాద్ కాంగ్రెస్ మహాసభలో వారే పూర్తి స్వాతంత్రం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు, మళ్లీ 1927లో మద్రాసు కాంగ్రెస్ మహాసభలో జవహర్‌లాల్ నెహ్రూ పైన చెప్పినట్లు పూర్ణస్వరాజ్ కోసం 1930జనవరి26న పతాకావిష్కరణలు చేయాలని తీర్మానం ప్రవేశపెట్టి నపుడు బలపర్చిన ప్రతినిధి జోగ్లేకర్ కమ్యూనిస్టు నాయకుడే. 1947లో దేశానికి స్వాతంత్ర్యం కూడా ఆ తేదీనే ప్రకటించవచ్చునని మొదట భావించారు.అయితే ఘోరమైన మతకలహాల కల్లోలం రీత్యా కాస్తముందుకు జరిపి ఆగష్టు 15నే ప్రకటించారు. 1948 జనవరి 26న ఈ విషయాలు సభల్లో చెప్పారు కూడా. నిజంగానే 1948 జనవరి 30న గాంధీజీని మతశక్తులు హత్య చేయడంతో ఆ భయాలు నిజమయ్యాయి.

గాంధీజీ హత్య,అంబేద్కర్‌కు అవమానం

1950 జనవరి 26న రాజ్యాంగాన్ని అమలు మొదలు పెట్టేనాటికి దేశం మతకలహాల ముప్పునూ సామ రస్యత లౌకికతత్వం ఆవశ్యకతనూ గుర్తించగలిగింది. గాంధీజీ హత్యకు శిక్ష విధించబడిన గాడ్సేను దేశ భక్తుడుగా చెప్పేవారు. ఆయన గురువైన వీరసావర్కార్‌ను పార్ల మెంటులో ప్రతిష్టించినవారు దేశాధిపత్యం చేపట్టిన ఫలితమిది. రాజ్యాంగస్ఫూర్తిపై దాడికి నవంబరు 26 నిర్ణయం తొలిఅడుగు మాత్రమేనని తర్వాత వరుసగా జరుగుతున్న మార్పులు,చర్యలు, తాజాగా తీసుకొచ్చిన జమిలి ఎన్నికల బిల్లులు వంటివన్నీ స్పష్టం చేస్తున్నాయి.

లిఖిత రూపంలో ప్రపంచంలో మరేదేశానికి లేనంత పెద్దది భారత రాజ్యాంగం. దానికోసం జరిగిన లోతైన చర్చల్లో 36 లక్షల పదాలు వున్నాయని రికార్డులు చెబుతున్నాయి.7635 సవరణలను లేదా ప్రతిపాదనల్లో 2473 వివరంగా చర్చించి నిర్ధారణలకు వచ్చారు. 395 అధికరణలు, 8 షెడ్యూళ్లలో వీటిని పొందుపర్చారు. ఆరోగ్యం అంత బాగాలేనప్పటికీ భీమ్‌రావ్ రాంజీ అంబేద్కర్ దానికి తుదిరూపమివ్వడానికి అంకితమయ్యారని రాజ్యాంగ పరిషత్ చైర్మన్ తొలిరాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ అభినందించారు. దాదాపు 300 మంది రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఇంచుమించు మూడేండ్లపాటు శ్రమించి, చర్చించి, తర్కించి, వాదించి, శోధించి దాన్ని జాతికి అందించారు. మొదట ఇందుకు సంబంధించిన ఎజెండా ప్రతిపాదిస్తూ జవహర్‌లాల్ నెహ్రూ ఇది మన సంకల్పం అని ప్రతిజ్ఞ అనీ ప్రకటించారు. ఆయనే మళ్లీ తొలి ప్రధానిగా అధికారం స్వీకరిస్తూ ప్రపంచమంతా నిద్రలో వున్న ఈ సమయంలో భారతదేశం స్వాతంత్ర్య యుగోదయంలోకి ప్రవేశిస్తున్నదని ప్రకటించారు. నిరంతర అప్రమత్తతే స్వాతంత్ర్యానికి మూలం అన్నది శాశ్వత సూక్తి. రాజ్యాంగ రూపకల్పనలోనూ ఆమోదించి అమలుకు తేవడంలోనూ స్వాతంత్ర్య యోధులు, న్యాయ కోవిదులు, దేశభక్తులు ఆదర్శంగా పెట్టుకున్న లక్ష్యాలకూ ఈనాటి పరిస్థితికి పొంతన ఏమైనా వున్నదా అని బేరీజూ వేసుకోవాలి.ఎందుకంటే రాజ్యాంగం అమలు తీరు నిజమైన కొలబద్ద అని చెప్పిన అంబేద్కర్ బొమ్మ పెట్టుకోవడం కన్నా దేవుడిబొమ్మ పెట్టుకుంటే పుణ్యం వచ్చేదని హోంమంత్రి అమిత్ షా రాజ్యాంగ వార్షికోత్సవ చర్చలోనే అనడం ఇందుకు నిదర్శనం.

స్ఫూర్తికి ఎసరు

'దేశమంటే మనుషులోయ్' అన్నట్టే, రాజ్యాంగమంటే దాని మౌలిక స్వభావమే, ఇచ్చే నిర్దేశమే తప్ప నిర్జీవ నిబంధనలు కాదు. రాజ్యాంగం 368వ అధికరణం పరిస్థితులకు తగినట్టు దాన్ని మార్చుకునే అధికారం ఇస్తున్నదని మొదట పేర్కొన్న 'టైమ్స్' వ్యాసం చెబుతుంది. రాజ్యాంగం మౌలిక స్వభావం సిద్ధాంతం కూడా తర్వాత కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిందే తప్ప అందులోది కాదని ఆ వ్యాసకర్త అంటారు.రాజ్యాంగంలో ఏదీ పరమ పవిత్రం కాదని స్వయంగా రెండోస్థానంలో వున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధంకర్ ఇటీవల వాక్రుచ్చారు. ఏది ఎలాగైనా మార్చే యోచన ఉన్నట్టయితే ఇక దేశాలకు రాజ్యాంగాల అవసరమే వుండదు.



ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది.జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నికవ్వడం,లౌకిక తత్వం,సమాఖ్య తత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరా టాలు గమనిస్తే 75 ఏండ్ల రిపబ్లిక్ సన్నివేశం కండ్లకు కడుతుంది.

ఒక విధాన చట్రంగా మూలసూత్రాలుగా వాటి పరిధిలోనే వ్యవహరించాలన్నది ఇక్కడ కీలకం. 368 ప్రకారం పార్లమెంటులో బలం వుంది గనక ఏది ఎలాగైనా తలకిందులు చేస్తామంటే చెల్లుబాటు కాదు, కాకూడదు.

స్వభావరీత్యా ప్రజాస్వామికం, రాజరికం రెండు రకాలు (డెమోక్రసీ, మోనార్కీ).పాలనాపరంగా అధ్యక్ష తరహా, పార్లమెంటరీ తరహా(ప్రెసిడెన్సియల్ పార్లమెంటరీ) అధ్యక్ష తరహా,అధ్యక్ష తరహా పార్లమెంటరీ మిశ్రమం, పూర్తి పార్లమెంటరీ తరహా అనే మూడు విధానాలు ప్రపంచంలో వున్నాయి. అధ్యక్ష తరహాలో అన్నీ అధ్యక్షులే శాసిస్తారు. మిశ్రమ తరహాలో ప్రధాని అధ్యక్షుడు(రాష్ట్రపతి) ఉభయులూ పార్లమెంటుకు బాధ్యత వహిస్తారు. మరికొన్ని చోట్ల అధ్యక్షుడే ప్రధానిని ఎంపిక చేస్తూ పాలన చేస్తాడు. మిశ్రమ పద్ధతిలో కొన్నిచోట్ల అధ్యక్షుడు కొన్ని చోట్ల ప్రధాని కీలక పాత్ర వహిస్తారు. మన దేశంలో రాష్ట్రపతి నామమాత్రం కాగా ప్రధాని సలహాపైనే నిర్ణయాలు తీసుకుంటాడు. ఈ విధానాన్ని కూడా ఇష్టప్రకారం మార్చేసే వీలుండదు. మన చుట్టుపక్కల శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ వంటి చోట్ల వీటిని అటూ ఇటూ మార్చిన ఉదాహరణలున్నాయి. వాటిని కోర్టులు కొట్టివేసిన సందర్భాలూ వున్నాయి, రాజకీయ వ్యవస్థ బలహీనంగా వున్నచోట్ల సైనికబలంతో అమలు చేసిన హెచ్చరికలూ వున్నాయి. ఇప్పుడు ప్రధాని చేతుల్లో విపరీతాధికారాలు పోగుపడుతున్న ప్రస్తుత పరిస్థితి పరోక్ష అధ్యక్ష తరహాకు దారితీస్తున్నదనే విమర్శలు వింటూనే వున్నాం. ఇది రిపబ్లిక్ డే నాడు శకటాలను ఇష్టానుసారం తిరస్కరించడంలోనూ కేంద్ర పెత్తనమే గోచరిస్తుంది.జమిలి ఎన్నికల బిల్లు దాన్నే ప్రతిబింబిస్తుంది. పౌరులందరికీ సమాన హక్కులు, ప్రజలచే ఎన్నికవ్వడం,లౌకిక తత్వం,సమాఖ్య తత్వం అన్నవి మన రాజ్యాంగానికి మౌలిక లక్షణాలు. వీటిపై జరుగుతున్న దాడులు అందుకు వ్యతిరేకంగా పోరా టాలు గమనిస్తే 75 ఏండ్ల రిపబ్లిక్ సన్నివేశం కండ్లకు కడుతుంది.

జవాబుదారీతనం మాయం

'రాజ్యాంగాన్ని భారత ప్రజలమైన మేము మాకు ఇచ్చుకుంటున్నాము' అని పేర్కొంటున్నాం. అంటే వ్యవస్థలో జరిగిన దానికి చేసిన దానికి ఎవరో ఒకరు అందరికీ జవాబుదారీగా వుండాలి.అధ్యక్ష తరహా పార్లమెంటరీ తరహా ఏదైనా సరే. మనం తీసుకున్న పార్లమెంటరీ వ్యవస్థలో అందరూ రాజ్యాంగానికి జవాబుదారి. కేంద్రంలో వారు పార్ల మెంటుకు రాష్ట్రాల్లో పాలకులు శాసన సభలకూ జవాబుదారీ. ఓటర్ల ఆమోదంతో ఎన్నికై అధికారం చేపట్టి విధానాలు చట్టాలు రూపొందించేవారు సుప్రీంకోర్టుకు జవాబు దారీ.అంటే వారు చేసిన చట్టాలు రాజ్యాంగ నిబంధనలకు లో బడి వున్నాయా లేదా అని సుప్రీంకోర్టు, హైకోర్టు చెబుతాయి. న్యాయవ్యవస్థ కూడా రాజ్యాంగ పరిధిలో పనిచేయ వలసిందే. ఏ వ్యవస్థ రాజ్యాం గానికి అతీతం కాదు. అయితే జవాబుదారీ తనం సమిష్టిగానూ వ్యక్తిగతం గానూ వుం టుంది. ఉదాహరణకు సభల్లో బలాన్ని బట్టి ప్రధాని, ముఖ్యమంత్రి నియామకం జరిగాక మంత్రివర్గం దాని తరపున నాయకులుగా వున్న ప్రధాని లేదా ముఖ్యమంత్రి సభకు బాధ్యత వహించాలి. అంతర్గతంగా ఆయా శాఖలు లేదా విభాగాలు చూసేవారు ముఖ్యమంత్రికి, ప్రధానికి, ప్రభుత్వాలకు బాధ్యత వహించాలి.ఇది విస్తృతమైన విభజన. కానీ రాజధానుల నుంచి ప్రాజెక్టుల వరకూ దేశమంతటా కొనుగోళ్ల నుంచి నిధుల వరకూ ఎన్ని తప్పులు జరిగినా, ఎన్ని కేసులు నడిచినా పూర్తి బాధ్యత ఎవరిదనేది తేల్చడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా అస్మదీయులు తస్మదీయులనే ప్రాతిపదికన వెళ్లడం కోర్టుల్లోనూ రకరకాల తీర్పులు రావడం జరిగిపోతుంది. అదానీ విద్యుత్ కొనుగోళ్లు,కాళేశ్వరం, పోలవరం, అమరావతి, బీహార్‌లో గుజరాత్‌లో బ్రిడ్జిలు పతనం ఎన్ని సంచలనాత్మక తప్పిదాల్లో బాధ్యత తేల్చారా?గుజరాత్ మారణకాండతో సహా ఎన్నో జరిగిపోయాయి. కానీ పాలకులు ఎవరిపైనా ఏదైనా చర్య చూశామా?

ఇప్పుడు ఒక అధికార పార్టీ లేదా కూటమి సభలో విశ్వాసం కోల్పోతే, కాదంటే బలాబలాలు మారితే దిగిపోవలసి వుంటుంది.మరెవరూ ముందుకు రాకపోతే సభ రద్దయిపోతుంది. కానీ జమిలి బిల్లు వస్తే ఇదీ వుం డదు. కేంద్రం, రాష్ట్రం, గవర్నర్, రాష్ట్రపతి మధ్య ఏ ప్రభుత్వం, ఏ సభ రద్దవుతుందో, కొనసాగుతుందో తెలియని స్థితి. ఎందుకంటే ప్రభుత్వం పడిపోయినా వెంటనే ఎన్నికలు జరపాల్సిన పనిలేదు.కొత్తగా వచ్చే ప్రభుత్వం మిగిలిన కాలానికి మాత్రమే పనిచేస్తుంది.(ఉప ఎన్నికల్లో మిగిలిన కాలమే వున్నట్టు) అంటే జవాబుదారీతనం ఎటుపోతుంది? కొత్తగా ఎన్నికైనవారి పదవీ కాలం తగ్గించడమంటే ఎవరి తప్పుకు ఎవరిని శిక్షిస్తున్నట్టు? పెద్దనోట్ల రద్దు వంటి నిర్ణయాలు, భారీ కుంభకోణాలు,లక్షల కోట్ల ఎగవేతలు, ప్రజల ఆస్తులు కట్టబెట్టడాలు - వీటికి పాలకుల బాధ్యత ఏమై పోతున్నట్టు? సార్వభౌమత్వాన్ని కాపాడవలసిన కేంద్రపాలకులు అమెరికా వంటి దేశాల ఒత్తిడికి లోబడిపోతే పార్లమెంటుకు కూడా జవాబుదారీతనం ఎక్కడ మిగిలేట్టు? తమ రాజకీయ అవసరాల కోసం దుస్సాహస నిర్ణయాలు తీసుకుంటే ఎక్కడ చర్చ జరిగేట్టు? అలాగే అధికారాన్ని నిరంకుశంగా వినియోగించి ప్రజల హక్కులు హరిస్తే ఎక్కడ విచారించేట్టు? ఇవన్నీ 75ఏండ్ల అనుభవం ముందుకు తెస్తున్న కీలక సవాళ్లు. వాటికి జవాబులు వెతకాల్సింది పోయి, ఉన్న హక్కులను కూడా తొలగించడం, వ్యవస్థలను తలకిందులు చేసి వ్యక్తుల పెత్త నాలు రుద్దడం అనుమతించ రానిది. ట్రంప్ ప్రమాణ స్వీకారంలో ఎలన్‌మస్క్ చక్రం తిప్పినట్టే ఇక్కడ పాలకుల నీడన అదానీలు, అంబానీలు, ఇంకా రాష్ట్రాల కుబేరులు ధనాన్ని, మతాన్ని జోడించి స్వారీ చేస్తుంటే ఇక జవాబుదారీ తనం, రాజ్యాంగ విలువలు ఎటుపోయేట్టు? ఆగష్టు 15న జెండా ఎగరేస్తారు.అంటే ఒక ఎత్తుకు చేరుస్తారు. జనవరి 26న పైనకట్టి వున్న జెండా ఆవిష్కరిస్తారు. అంటే స్వేచ్ఛగా ఎగిరేలా చేస్తారు. తెచ్చుకున్న స్వాతంత్ర్యాన్ని సరిగ్గా కాపాడుకోవడమే ఇందులో సందేశం. ■

ట్రంప: ట్రంపస్య.. ట్రంపోభ్య:


ట్రంపు భలే ఇంపు అన్నాడొక మిత్రుడు. వెంటనే, కాదు కాదు ట్రంపు ఓ కంపు అన్నది ఓ స్నేహితురాలు. కానే కాదు ట్రంపు మాట వినసొంపు అన్నాడో పెద్దమనిషి.. లేదు లేదు ట్రంపు ఏమంత ఇంపైన పదం కాదని మరో పండితురాలు అన్నది. ఈ డైలాగులన్నీ పక్కనే ఉన్నా మాట్లాడుకునేవాళ్లకు తెలియకుండా వింటోంది పిపీలకం అనే మాడ్రన్ చీమ. సహజంగానే దానికి ఎన్నో అనుమానా లొచ్చాయి. రావిశాస్త్రి గారి కథలోలాగ తానూ బయలుదేరి మాంచి తెలివి గలవారిని కలిసి ఇంతకీ ఈ ట్రంపు నిజంగా ఇంపు, కంపు, సొంపునా లేక ఇవేవీ కాని మరో మనిషా అని తెలుసుకోడానికి అక్కడినుండి జనంపై, ప్రపంచంపై పడింది చీమ.


జంధ్యాల రఘుబాబు
9849753298

మొదట దువ్వాడ జగన్నాథం సినిమా డైలాగులు రాసినతని దగ్గరికి పోయింది పిపీలకం. ఆయన వెంటనే తన డైలాగు ట్రంప: ట్రంపస్య ట్రంపోభ్య:... అన్నాడు. ఈ పదాలకు అర్థమేమిటన్నది పిపీలకం. నేను బిజీగా ఉన్నాను మళ్లీ రమ్మన్నాడాయన. డ్రీం రియలిజంలో లాగ కలనో, నిజమో తెలియకుండానే చీమ తనకిష్టమైన వాళ్లదగ్గరికి అలవోకగా పోతోంది. అలా ఇంగ్లీషు రచయిత, నాటకకర్త షేక్స్పియర్ దగ్గరికి పోయింది. ట్రంపు గురించి అడిగింది, మీకేమైనా తెలిస్తే చెప్పమంది. ఆయనొక్కటే మాట చెప్పాడు. ట్రంపు మిత్రులెవరో చెప్పు నేను ట్రంపు గురించి చెబుతాను అన్నాడు. ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరై వచ్చిన వాళ్లెవరో ముందు కనుక్కో అన్నాడు. చీమ వెంటనే ట్రంపు మిత్రులెవరు అని కనుక్కోవడానికి బయలుదేరింది. ఆయన మిత్రుల్ని వరుసగా కలుస్తోంది. ఒక మిత్రుడేమో ట్రంపంటే అమెరికా ప్రెసిడెంటు అంటే ప్రపంచంలో బాగా ప్రాచుర్యమున్న, బలవంతుడైన వ్యక్తి అన్నాడు.

ప్రపంచంలో బలవంతుడైన వ్యక్తి ఎలాగవుతాడు? ఒక్క బాక్సింగు క్రీడాకారిణిని లేదా క్రీడాకారుణ్ణి కొట్టగలడా అని ఆరా తీసింది.కొట్టలేడని చెప్పారు చాలామంది. మరి ప్రపంచంలో అందరికంటే ఎలా బలవంతుడవుతాడు అమెరికా ప్రెసిడెంటు, అది ట్రంపు కావచ్చు ఇంకెవరైనా కావచ్చు అనేసరికి అసలు అమెరికా అధ్యక్షుడంటే ప్రపంచ పోలీసు నీకేం తెలుసు?అని ఇంకొకరన్నారు. మరి మామూలు సూటు బూటు వేసుకున్నాడు కదా పోలీసెలా అవుతాడు వాళ్ల యూనిఫాం కూడా వేసుకోలేదు కదా అంది పిపీలకం. ఓసి పిచ్చి పిపీలకమా అదంతే! ప్రపంచ పోలీసు అలాగే ఉంటాడు మరి. చేతిలో లాఠీ పెట్టుకొని ఉంటాడా ఏమన్నా? అవసరమొచ్చినప్పుడు తన లాఠీ లాంటి ఆధిపత్యం చూపిస్తాడు అదే అందులో ఉన్న తమాషా అన్నారింకొకరు.

అసలు ఈ రాష్ట్రంలో, ఈదేశంలో కాదు నేను సీదా అమెరికాకే పోయి ట్రంపుగారి ఆఫీసులో ఏమేమి జరుగుతాయో చూసిరావడం మేలు అనుకొని పిపీలకం రాజీవ్‌గాంధీ ఎయిర్‌పోర్టుకు బయలుదేరింది. ఎటువంటి పాసుపోర్టు, వీసా కనీసం టికెట్టు కూడా లేకుండానే విమానమెక్కేసింది. విమానంలో పోతున్న భారతీయులు అక్కడ పౌరసత్వం ఉన్నోళ్లు, ఇప్పుడు తీసుకుందామని ప్రయత్నాలు చేస్తున్నవాళ్లు మాట్లాడుకునే మాటలు మన పిపీలకం గారి చెవిలో పడ్డాయి. తన దేశ పౌరల క్షేమమే తనకు ముఖ్యం అని ట్రంపు మాటలున్న వీడియో చూస్తున్నాడు ఒక యువకుడు. పక్కనే ఇంకో యువతి, ఇద్దరూ భార్యాభర్తలు అక్కడ ఒకరికి ఉద్యోగముంది ఇంకొకరికి ప్రయత్నం చేద్దామని పోతున్నారు. తెలుగులో మాట్లాడుతుండడం విని పిపీలకానికి ఆశ్చర్యమేసింది, అరే వీళ్ళు తెలుగోళ్ళు కదా ఇంగ్లీషులో కదా మాట్లాడాల్సింది అనుకుంది కూడా. పక్కనోళ్లకు వినబడకుండా అలా తెలుగులో మాట్లాడుతున్నారని తరువాత అర్థమయింది. ఇప్పుడు ట్రంపు చేస్తున్న పనులకు, మాట్లాడుతున్న మాటలకు ఎక్కువగా భయపడు తున్నది భారతీయులే అని అర్థమయింది. ఇంతలో దానికి ఆకలిగా అనిపించింది. విమానంలో పిల్లలు తింటూ పడేసిన కేకుపొడి, ఇంకా అలాంటివే దొరికితే తిని పడుకుంది పిపీలకం. వాషింగ్టన్ వచ్చిందని అందరూ దిగిపోతున్నారు.





మెల్లగా అందరూ దిగిపోయినాక తానూ దిగింది పిపీలకం. తననెవరైనా చూస్తున్నారేమోనని మొదట అనుమానపడింది. ఎవరిపనుల్లో వాళ్లున్నారు. అక్కడి చీమలు కూడా తనని చూసినట్టు అనిపించింది కాని అవి పెద్దగా పట్టించుకోలేదు. ట్రంపు పాలనలో తమకేమైనా మేలు జరుగుతుందని అనుకుంటున్నారా అని వాటిని అడిగింది పిపీలకం వచ్చీరాని ఇంగ్లీషులో. ఎవరొస్తే ఏమన్నట్టు మాట్లాడాయి అవికూడా. సరేననుకుని మెల్లగా ప్రెసిడెంటు ఉండే శ్వేతసౌధం వైపు పోయింది. అక్కడ చీమలతో ఇంటర్వ్యూ చేసి కొన్ని వివరాలు రాబట్టింది. విలేకరులతో ట్రంపుగారు ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టి అది. అందరికీ వాళ్ళ టిఫిన్లు ఇచ్చారు. వాళ్లు తినేలోపు వైట్‌హవుస్ వంటశాలలో తనకు నచ్చినవి తినొచ్చింది పిపీలకం. విలేకరులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలిస్తున్నాడు ట్రంపు. ఈదేశంలో పుట్టినంత మాత్రాన ఇక్కడి పౌరసత్వం రాదని ఖరాకండిగా చెబుతున్నాడు. అలా చేస్తే మన దేశానికి నష్టం కదా అన్న ఒక ప్రశ్నకు ముందు నాదేశ పౌరుల్ని కాపాడుకోవడం నా విధి అంటున్నాడు. ఫలానా తేదీ తరువాత పుట్టేటోళ్లకు పౌరసత్వం రాదంటున్నాడు. మొదట సరైన పత్రాల్లేని ఐదువందల విదేశీ పౌరుల్ని వాళ్ల వాళ్ల దేశాలకు పంపేశానన్నాడు. ఇలా చేస్తే వాళ్లు చేసే పనులు అంత తక్కువ జీతాలకు ఇతరులు చేయరు కదా అని ఒక విలేకరి అడిగాడు. నువ్వు బైడెన్ మనిషివా? అన్నాడు ట్రంపు. ఆ నోటి కంపు భరించలేక ఊరకున్నాడు ఆ విలేకరి. దానికీ మార్గం చూపు తానన్నాడు. ఆ సమావేశం తరువాత పెద్ద పెద్ద కంపెనీల సీయీవోలతో సమావేశమయ్యాడు అధ్యక్షుడు. అక్కడికీ పోయింది మన పిపీలకం. అక్కడ వాళ్లూ నిర్దేశించినవి తన సహాయకుడు అన్నీ రాసుకుంటున్నాడు. త్వరలో ఇవన్నీ చేస్తానని చెబుతున్నాడు వాళ్లకి. అమెరికాలో కొన్ని రాష్ట్రాలకు కూడా పోయింది పిపీలకం. అన్నిదేశాల వాళ్ల ఇండ్లకూ పిలవని పేరంటంలా పోయి అక్కడక్కడ కొన్ని విషయాలు కనుక్కుంది. అయినా తృప్తి కలుగలేదు దానికి.

ఓరోజు ట్యాంకుబండు దగ్గర ఓ పెద్దాయన కూచొని ఉన్నాడు. ఆయన్నడిగితే ఏమైనా తెలుస్తుందేమోనని మెల్లగా కదిలించింది. నువ్వు రావి శాస్త్రి పిపీలకానివా అన్నాడాయన. నేను కొత్త తరం పిపీలకాన్ని, ఐనా నాకూ కొన్ని అనుమానాలున్నాయి అని అమెరికా అధ్యక్షుడి గురించిన విషయం అడిగింది. చూడూ సీదా ఉస్మానియా యూనివర్సిటీకి పో. అక్కడ అపర్ణ అనే విద్యార్థిని అమెరికా అధ్యక్షులపై పరిశోధన చేస్తోంది.ఆమెనే తీరుస్తుంది నీ అనుమానాలు అన్నాడు. సరేనని అపర్ణను కలిసింది పిపీలకం. తనకున్న అనుమానాలన్నీ అడిగింది. ఇంతలేవు నీవు అనుకోకుండా పిపీలకం గారూ అని మొదలు పెట్టింది అపర్ణ.

సూటు బూట్లు, మంచి తిండి, వైట్ హవుస్ నివాసం, మంచి గుర్తింపు, ప్రథమ పౌరుడు భార్యకు ప్రథమ పౌరురాలు, చార్టరుడు విమానాలు, మంచి కార్లు ఇలా అన్నీ ఉంటాయి అధ్యక్షుల వారికి. పెద్ద బుష్షును ఒకరు ఎదిరిస్తే చిన్న బుష్షు తరువాత చంపుతాడు. ఏ అధ్యక్షుడైనా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా రీగన్ కాదు, ఒబామా కాదు ఇంకెవరైనా తమ దేశంలో ఉన్న పెట్టుబడిదారులే ఆ దేశాన్ని, తద్వారా ప్రపంచాన్ని కంట్రోలు చేసేది. అంతెందుకు ఏయే అధ్యక్షుడు ఉండంగా ఏయే యుద్ధాలు చేశాడు, చేయించాడు లేకుంటే ఆయుధాలందించాడు? ఒక్క అధ్యక్షుడైనా ఒక యుద్ధాన్ని ఆపాడా? ఇప్పుడు జరుగుతున్న హమాస్-ఇజ్రాయిల్ యుద్ధమే తీసుకో అధ్యక్షుడు ఏవైపున్నాడు. ఇప్పుడు కొత్త ప్రెసిడెంటు వచ్చాడు కదా అంతకుముందాయన మొదలుపెట్టిన వాటిని ఆపుతాడా? కాబట్టి పిపీలకం గారూ, తోలుబొమ్మలాట చూశారా అలాగే ఈ అధ్యక్షుడి ఆట ఆడించేది వేరే వాళ్లు. ముందు అది తెలుసుకోండి.

పిపీలకానికి మనసు తేలికపడిందిప్పుడు. హాయిగా తన చిన్ని చిన్ని ఊపిరితిత్తులతో గాలి తీసుకుంది. అమెరికా అధ్యక్షుడంటే ఓ మిలిటరీ ఉద్యోగం అనుకుంటూ ఇంటికి పోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు వాళ్లకు విషయాలు చెప్పాలని కూడా అనుకుంది. ■



షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన జడ్పీ సీఈవో

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం షటిల్ (డబుల్) టోర్నమెంట్‌ను జిల్లా పరిషత్ సీఈవో దీక్షిత్ రైనా ప్రారంభించారు. శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జడ్పీ ఎంఎస్‌పిఎల్, మోమినస్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌ను ఆధ్వర్యంలో ఖమ్మం నగర స్థాయి షటిల్ డబుల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శుక్రవారం నుండి 26 వరకు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటలు మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని, ఆటల వల్ల మంచి ఆరోగ్యం, స్నేహభావం కలుగుతుందని, ముఖ్యంగా యువత ఆటలలో మక్కువ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేష్, ఎం.రవీంద్ర ప్రసాద్, వెంకటపతి రాజు, టోర్నమెంట్ చైర్మెన్, ఎండి అబ్దుల్ హకీం, ఎస్.కె నాగోల్ మీరా, ఎస్ కే షరీఫ్, ఎస్ కే జానీ, ఎండి దౌలత్, ఎండి రజబ్ అలీ, ఎండి ఆసిఫ్, ఎండి సాజిద్, ఎండి షబ్బీర్, దేకాసు కాజా, ఇలియాస్, అజీజ్, జుబేర్ పాషా పాల్గొన్నారు.

కాసాని ఐలయ్య మృతికి సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ-బోనకల్

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని ఐలయ్య మృతి పట్ల సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరావు సీనియర్ జిల్లా నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు మండల కార్యదర్శి కిలారి సురేష్ తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాసాని ఐలయ్య కొత్తగూడెంలో పార్టీని నిర్మించడంలో కీలక పాత్ర పోషించాడని కొనియాడారు. గొర్రెల మేకల పెంపకదారుల సంఘంలో యాదవుల కోసం వారి సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. అనేక విజయాలు సాధించారన్నారు. వారి మృతి పట్ల సిపిఎం పార్టీ బోనకల్ మండల కమిటీ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పార్టీ మండల కమిటీ సభ్యులు గుగులోతు నరేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, దొండపాటి సత్యనారాయణ, గుగులోత్ పంతు, మంద వీరభద్రం, తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ సభ్యులు జోనిబోయిన గురవయ్య, మాజీ ఎంపీటీసీ గండు సైదులు, ఎర్రగాని నాగరాజు తదితరులు ఉన్నారు.



బాల భారతి విద్యాలయంలో మాక్ అసెంబ్లీ

నవతెలంగాణ-తల్లాడ

స్థానిక బాల భారతి విద్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని, మాక్ అసెంబ్లీని నిర్వహించారు. విద్యార్థులు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులుగా వ్యవహరించారు. అసెంబ్లీ సమావేశాలను కళ్ళకు కట్టినట్లుగా ప్రదర్శించారు, రాష్ట్ర ప్రభుత్వంలో బిల్లులు ఎలా ఆమోదం పొందుతాయో, పరిపాలన ఎలా సాగుతుందో అని, శాసనసభ సమావేశం ద్వారా వారి వారి నియోజకవర్గాలలో సమస్యలను పరిష్కరించుకునే విధానం, వాదనలు, ప్రతి వాదనలు ప్రదర్శించారు, విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపల్ తాళ్ల రామారావు, ఇన్చార్జ్ యాచమనేని శశాంక్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

- ఎస్బీఐ చీఫ్ మేనేజర్ లింగాల ప్రశాంత్

నవతెలంగాణ-ఖమ్మం

సైబర్ నేరగాళ్లు అనేక రకాల జిత్తులు ఉపయోగిస్తున్నారని, మధ్య వయస్కులు, యువత మోసగాళ్లు పన్నిన ఉచ్చులో పడుతున్నారని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ప్రజలు పడొద్దని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వైరా రోడ్డు మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ లింగాల ప్రశాంత్, చర్చ్ రోడ్ బ్రాంచి మేనేజర్ మురళీ కృష్ణ తెలిపారు. శనివారం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ లో ప్రజలకు సైబర్ నేరగాళ్ల నుండి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

మాధవిని హత్య చేసిన వాడిని కఠినంగా శిక్షించాలి

- ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



మాజీ జవాన్ భార్య మాధవిని హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు నాగ సులోచన డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ మెంబర్ ఎస్కే మెహర్ ఉన్నీసా బేగం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ మీర్‌పేట జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వర కాలనీకి చెందిన గురుమూర్తి అనే మాజీ జవాన్ భార్య మాధవిని అతి క్రూరంగా చంపిన అతనిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా వన్ టౌన్ కార్యదర్శి భాగం అజిత, జిల్లా నాయకులు బేబీ, త్రీ, టూ టౌన్ కార్యదర్శులు సునీత, కుమారి పద్మ, మంగమ్మ, పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య నిర్మూలన పనులు

కల్లూరు : కల్లూరు ఎన్‌ఎస్పీ తిరువూరు క్రాస్ రోడ్డు నుండి మార్కెట్ కమిటీ వరకు శనివారం ఈవో నందిసెట్టి నాగేశ్వర ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య నిర్మూలన పనులు చేపట్టారు. ప్రమాదాలు నివారణకై జాతీయ రహదారికి ఇరువైపులా గుంతలు పూడ్చి, డివైడర్ పై ఉన్న చెత్తాచెదారం తొలగించి, పైప్ లైన్ లీకులకు మరమ్మతులు చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైరాలో హైదరాబాద్ తరహా హైడ్రా ఏర్పాటు చేయాలి

- చెరువులు, ప్రభుత్వ భూములు కాపాడాలి : తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా పరిధిలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు కాపాడేందుకు హైదరాబాద్ తరహా హైడ్రా ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలో కబ్జాలకు గురి అయిన చెరువులు, ప్రభుత్వ భూములు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ తోపాటు వందల ఎకరాల ప్రభుత్వ భూములు, చెరువులు భూములు కబ్జా చేసి నీటి నిల్వ సామర్థ్యం తగ్గి చివరి భూముల పంటలకు నీరు అందడం లేదు అన్నారు. కోట్ల రూపాయలు విలువచేసే భూములు కబ్జా చేసి విక్రయం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, సంక్రాంతి నర్సయ్య, వడ్లమూడి మధు, పాసంగులపాటి రవి, మోదుగు వెంకట్, ఖాసిం పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్‌పై ఆయిల్ 'ఫార్మర్స్' వేదన

నాసిరకం విత్తనాలను అంటగట్టిన ఆయిల్‌ఫెడ్

- ఉపయోగంలేని మొక్కలతో నష్టపోతున్న రైతులు
- ఎకరానికి 250కేజీలకు గాను 50శాతం రాని దిగుబడి
- హైకోర్టును ఆశ్రయించిన రైతు.. పరిహారానికి ఆయిల్‌ఫెడ్ విముఖత
- పట్టించుకోని ప్రభుత్వాలు..
- మంత్రి తుమ్మల సైతం అదేతీరు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మంజిల్లా సత్తుపల్లి ప్రాంతంలోని ఆయిల్‌పామ్ నర్సరీల నిర్వహణలో లోటుపాట్లు వెలుగు చూస్తున్నాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత ప్రాంతంలోనే ఇటువంటి పరిస్థితి ఉండటం.. ఆయన దాన్ని పట్టించుకోకపోవడంతో రైతుల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పుచ్చకాయల సోమిరెడ్డి అనే రైతు తనకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆయిల్‌ఫెడ్ నర్సరీల నిర్వహణపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాం నుంచి ఈ పరిస్థితి ఉన్నా నాటి సర్కారు కూడా పట్టించుకోకపోవడం రైతుల తీరని వేదనకు కారణమైంది. మొత్తం పన్నెండు కంపెనీలు నర్సరీలు నిర్వహిస్తున్నా ఏ ఒక్క ప్రయివేటు కంపెనీలో ఇలాంటి వంధత్వ మొక్కలు కనిపించిన దాఖలాలు లేవు. దాదాపు 90శాతం దిగుబడిని ప్రయివేటు కంపెనీల చెట్లు ఇస్తున్నా, ఆయిల్‌ఫెడ్ నుంచి ఇచ్చిన మొక్కల్లో ఆఫ్‌టైప్ అధికంగా ఉండటంతో 50శాతానికి మించి దిగుబడి రావడం లేదని కొన్నిరోజులుగా కొందరు రైతుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధంగా ఉంది.



హైకోర్టును ఆశ్రయించిన రైతు..

కోస్టారికా నుంచి ఆయిల్‌పామ్ విత్తనాలను దిగుమతి చేసుకుంటారు. దీనిలో నాసిరకం విత్తనాలు ఎక్కువగా రావడంతో కొందరు రైతులు నష్టపోయారు. తనకు రూ. 60లక్షల నష్టం వాటిల్లిందని పుచ్చకాయల సోమిరెడ్డి అనే రైతు హైకోర్టును ఆశ్రయించారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు ఆయిల్‌పామ్ నర్సరీ నుంచి సరఫరా చేసిన మొక్కల్లో సుమారు నాలుగు లక్షలు గొడ్డు రకంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్ (ఐవోపీఆర్) తేల్చింది. దీనిలో ఎకరానికి 57మొక్కల చొప్పున 12ఎకరాలకు సరిపడా మొక్కలను సోమిరెడ్డి కొనుగోలు చేశారు. వీటిలో సగానికి పైగా మొక్కలు ఉపయోగం లేనివిగా తేల్చారు. అప్పటి హార్టికల్చర్ అధికారి రమణ సైతం విచారణ జరిపి 40శాతం ఆఫ్‌టైప్ అని రిపోర్టు ఇచ్చినట్టు సదరు రైతు తెలిపారు. దీనిపై ఆ రైతు హైకోర్టును ఆశ్రయించడంతో పరిహారం ఇవ్వాల్సిందిగా కోర్టు సూచించింది. కానీ ఎంతకూ పరిహారం ఇవ్వకపోవడంతో మరోసారి ఆ రైతు కోర్టును ఆశ్రయించారు. దీనిపై ఆయిల్‌ఫెడ్ రిటైర్డ్ అధికారి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పరిశీలన జరిపి సంబంధిత రైతు సస్యరక్షణ చర్యలు సరిగ్గా చేపట్టకపోవడం వల్లనే నష్టం చేకూరింది తప్ప తాము సరఫరా చేసిన మొక్కల్లో ఎలాంటి లోపాలు లేవని రిపోర్టు ఇచ్చారు. సంబంధిత రైతు మొక్కలను పల్లం, దిబ్బల మీద నాటడంతో చీడపీడలు వ్యాప్తి చెందాయని పేర్కొన్నారు. రైనోసర్స్ బాటిల్ పురుగు, స్టెమ్‌రాట్, బడ్రాట్ చీడ పీడలు వ్యాప్తి చెంది మొక్కలు దెబ్బతిన్నాయని చెప్పుకొచ్చారు. దీనిపై సోమిరెడ్డి మరోసారి కోర్టును ఆశ్రయించారు. దాంతో ఆయిల్‌ఫెడ్ అధికారులు అతనిపై కక్ష సాధింపు చర్యలకు దిగినట్టు తోటి రైతులు ఆరోపిస్తున్నారు. సోమిరెడ్డి మొత్తం పన్నెండు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుచేయగా దానిలో కుమారుడు, భార్య తనపేరిట నాలుగు ఎకరాల చొప్పున సాగు చేశాడు. అయితే ఇటీవల సోమిరెడ్డి భార్య క్యాన్సర్‌తో మృతిచెందింది. అయినప్పటికీ ఆయిల్‌ఫెడ్ అధికారులు ఆమె పేరిట నోటీసులు జారీచేయడం సంచలనంగా మారింది. తమ లోపాలను కప్పిపుచ్చుకునేందుకు సోమిరెడ్డి కుటుంబాన్ని మొత్తం కోర్టుల చుట్టూ తిప్పుతుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేండ్ల క్రితమే గొడ్డు మొక్కల బాగోతం..

దాదాపు 2016-17 నుంచి సరఫరా అవుతున్న రేగళ్లపాడు నర్సరీ మొక్కల్లో గొడ్డు రకం మొక్కలు వెలుగు చూస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. నాలుగేండ్లు అయినా కాపు రాకపోవడంతో రైతులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఈ నర్సరీ నుంచి మొత్తం కోటి మొక్కలకు పైగా రైతులకు ఇవ్వగా దీనిలో ఇప్పటికే నాలుగు లక్షల మొక్కలు గొడ్డు రకంగా అధికారులు తేల్చారు. రాష్ట్రంలో 20లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యమని మంత్రి తుమ్మల చెబుతున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా ఇలాంటి ఆఫ్‌టైప్ మొక్కలతో రైతులకు జరిగే నష్టంపై మాత్రం ప్రభుత్వం పెదవి విప్పకపోవడం శోచనీయం. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండున్నర కోట్లు ఆయిల్‌ఫెడ్ సంస్థకు నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. సత్తుపల్లి ప్రాంతంలోనే 30మంది రైతులకు చెందిన వెయ్యి ఎకరాల్లో నాటిన 2019 బ్యాచ్ మొక్కలు గొడ్డు రకంగా తేలాయి. నాలుగేండ్లు దాటినా ఆయిల్‌పామ్ గెలలు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.



సామర్థ్యం లేని కంపెనీలకు మొక్కల ఆర్డర్స్ ఇవ్వడమే కారణమా..?

రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ పరిణామాలు చోటుచేసుకున్న క్రమంలో 2001లో టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ. 23,486 పలికింది. దాంతో ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ 2022-23లో కోటి ఆయిల్‌పామ్ విత్తన మొక్కలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంది. అయితే ఆయిల్‌ఫెడ్ సంస్థ దిగుమతి చేసుకున్న కంపెనీలు సరైన సామర్థ్యం లేని కారణంగానే ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్టు రైతులు ఆరోపిస్తున్నారు. 5వేల విత్తన మొక్కలను సరఫరా చేసే కంపెనీకి 5 లక్షల మొక్కలను ఆర్డర్ ఇచ్చినట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఫలితంగానే 30 నుంచి 40శాతం మొక్కలు ఆఫ్‌టైప్‌గా బయటపడుతున్నాయి. 2022-23లో మహబూబ్‌నగర్, మహబూబాబాద్, సిద్ధిపేట, మెదక్ తదితర జిల్లాలకు ఈ కంపెనీలు మొక్కలను సరఫరా చేయడంతో సంబంధిత రైతుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టిసారించాల్సిందిగా రైతాంగం కోరుతోంది.

మహిళా హక్కులపై సంఘటితం కావాలి

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ

నవతెలంగాణ-ముదిగొండ

హక్కులకై ఐక్యమై మహిళలు సంఘటిత పోరాటాలు నిర్వహించాలని ఐద్వా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ పిలుపునిచ్చారు. సంక్రాంతి సందర్భంగా మండల పరిధిలో చిరుమర్రిలో రైతు సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు ఆమె శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుమర్రి గ్రామంలో అనేక సంవత్సరాలు నుండి కులమతాలకతీతంగా మహిళలకు ముగ్గులు పోటోలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించడం వల్ల మహిళల్లో మానసిక వికాసంతోపాటు, ఐక్యత పెరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి రాగానే పట్టించుకోవటం లేదని ఆమె విమర్శించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందున్న నేటికి హింస కొనసాగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు పోరాటాల్లోకి రావాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండి రమేష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి రైతు సంఘం పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని ఉద్యమిస్తున్న కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కాలయాపన చేయకుండా కచ్చితమైన ధర ఇవ్వాలని రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లే వాల్ 50 రోజుల నుండి అమరణ నిరాహార దీక్ష చేసిన, ప్రభుత్వం 50 రోజుల తర్వాత ఫిబ్రవరి 14న చర్చలకు ఆహ్వానించిందన్నారు. రైతు నేత సింగ్‌ను చర్చలకు ఆహ్వానించిన ప్రభుత్వం ఎంతవరకు అంగీకారం తెలుపుతుందో చూడాలన్నారు. ప్రాణ త్యాగానికి సిద్ధపడి దీక్ష చేసిన రైతు నేతకు రైతుల అండగా నిలవాలని చెప్పారు. రైతులందరూ రైతు నాయకుల అడుగుజాడల్లో నడిచి పోరాటం చేసినప్పుడే ప్రభుత్వం దిగివచ్చి సమస్యలను పరిష్కరించిందని, రైతు నేత చేసిన దీక్ష వృథా కాదని బండి రమేష్ చెప్పారు. ఈకార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, మండల కార్యదర్శి కోలేటి అరుణ, రైతు సంఘం మండల కార్యదర్శి కోలేటి ఉపేందర్ రావు, నాయకులు బండి శేఖర్, నున్నా వీరేష్, గండు ఉపేందర్, చావగాని మాధవరావు, మోర రామకృష్ణ, వేలూరి సూర్య, వినుకొండ రాణి, కత్రం గురవయ్య, పల్లపాటి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



పలు కుటుంబాలకు మట్టా పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

పట్టణానికి చెందిన మైనార్టీ నాయకులు షేక్ ఇబ్రహీం కుమార్తె ఈశ్రతో వివాహ వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొని ఆశీర్వదించారు. శనివారం మండల పరిధిలోని కోరుకొండ గ్రామానికి చెందిన పెద్దలు జాష్టి చిన్న నరసింహ మనవడు గగన్ విహాన్స్ పుట్టినరోజు సందర్భంగా బాబును ఆశీర్వదించారు. చిన్న కోరుకొండకు చెందిన కటిక నాగమ్మ దశదిన కర్మకు హాజరై నివాళులర్పించారు. అదేవిధంగా నామ వెంకటేశ్వరరావు సతీమణి రాధమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులు సానుభూతి తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దింటి సత్యం అనారోగ్యంతో బాధపడుతుంటే వారిని పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, సత్యం బాబు, భాగం ప్రభాకర్ చౌదరి, కె.వి.ఆర్, మచ్చా వెంకటేశ్వర రావు, వెంకట్ రెడ్డి యూత్ నాయకులు అల్లాకుంట నరసింహ రావు, శివా నాయక్, పంతులు, మట్టా రామకృష్ణ, కల్లూరు మండలం, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



'స్వచ్ఛ' ఆటో కార్మికుల ధర్నా

- కార్పొరేషన్ ఎదుట నిరసన
- మంత్రి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన
- గత అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి తమ పొట్టగొట్టారని ఆరోపణ
- తమ స్థానంలో పెట్టిన కాంట్రాక్టర్ ను తొలగించి పనులివ్వాలని డిమాండ్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్:

ఖమ్మం కార్పొరేషన్ ఎదుట స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికులు సుమారు 80 మంది శనివారం ఆందోళన నిర్వహించారు. ఖానాపురం గ్రామపంచాయతీ గా ఉన్నప్పటి నుండి రిక్షాల సహాయంతో తాము చెత్త తీస్తున్నామని, అటువంటి తమను కాదని గత అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి ఆ పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్ కు అప్పగించారని ఆరోపిస్తూ ధర్నా చేపట్టారు. తిరిగి ఆ పనులను తమకు అప్పగించాలని కోరుతూ దాదాపు ఏడాది క్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి తమ గోడు విన్నవించుకున్నామని, దీనిపై ఆయన స్పందిస్తూ తమకు న్యాయం చేయాల్సిందిగా సూచిస్తూ కమిషనర్ కు ఆ బాధ్యతను అప్పగించినా... ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే...

సుమారు 80 కుటుంబాలకు చెందిన స్వచ్ఛ ఆటో రిక్షా కార్మికులు గత 25 ఏళ్లకు పైబడి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుండి రిక్షా బండ్లతో చెత్త తీసేవారు. ఖమ్మం కార్పొరేషన్ గా ఏర్పాటైన తర్వాత 19 స్వచ్ఛ భారత్ ఆటోలు వీరికి ఇచ్చారు. ఇందుకు గాను ఒక్కో ఆటోకు రూ.50,000 డీడీలు తీసుకున్నారు. ఆ తరువాత కూడా మూడుసార్లు రూ.25,000 చొప్పున చెల్లించారు. అస్టెంట్ కమిషనర్ గా మల్లేశ్వరి కొనసాగినప్పుడు.. మెయిన్ రోడ్లు, కమర్షియల్ కాంప్లెక్స్ లలో చెత్త తీసే కాంట్రాక్టును ఎకోటెక్ ఎన్విరో సొల్యూషన్స్ కంపెనీకి అప్పగించారు. చెత్త తీసినందుకు ఈ కంపెనీ ఓనర్ నాగరాజుకు నెలకు రూ.10.50 లక్షలు చెల్లిస్తున్నారు. దీనివల్ల 25 ఏళ్లకు పైబడి పారిశుద్ధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న సుమారు 50కి పైగా మందికి తీరని అన్యాయం జరిగింది. దీనిపై వారు సరిగ్గా ఏడాది క్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి తమ సమస్య విన్నవించుకున్నారు. ఈ మేరకు మంత్రి కమిషనర్ కు ఎండార్స్ లెటర్ ఇచ్చినా ఏడాది కాలంగా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై కార్మికులు శనివారం ఆందోళన నిర్వహించారు. ఇకనైనా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, రవి, రమేష్, నవీన్ పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా 'గార్లపాడు' ఎంపిక

- నేడు లబ్దిదారులకు మంజూరు ఉత్తర్వులు పంపిణీ

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని పైలట్ ప్రాజెక్టు గ్రామంగా గార్లపాడును ఎంపిక చేసినట్లు మండల స్పెషల్ ఆఫీసర్ కడారు విజయభాస్కర్ రెడ్డి, తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో రురావత్ రమాదేవి శనివారం విలేకరులకు తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు సంబంధించి గణతంత్ర దినోత్సవ సందర్భంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే తొలుత మండలంలోని గార్లపాడు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఎంపికైన అర్హులకు మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఆ తర్వాత మిగతా గ్రామాలకు ఈ కార్యక్రమాలను విస్తరించనున్నట్లు వారు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గార్లపాడుకు 16 మందికి రేషన్ కార్డులు, 20 మందికి ఇందిరమ్మ ఇల్లు, 27 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద మంజూరి పత్రాలను అందజేయనున్నట్లు వారు తెలిపారు. రైతు భరోసాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాలో నిధులు జామ చేయనున్నారు. గార్లపాడులో ఆదివారం గ్రామ సభ నిర్వహించి లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభకు తమతోపాటు ఎంపీవో వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, మండల

ఓటు.. ఆయుధంతో సమానం

- ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్నికలలో ఓటు హక్కుని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ఎన్నికల కమీషన్ సీఈఓ అందించిన సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాత కలెక్టరేట్ నుంచి పాత బస్టాండ్ వరకు ఓటర్ చైతన్య ర్యాలీ

జిల్లాలో జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల (పాత కలెక్టరేట్) నుంచి పాత బస్టాండ్ వరకు ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ ఓటర్ చైతన్య ర్యాలీ విజయవంతంగా జరిగింది. ర్యాలీ ముగింపు సందర్భంగా పాత బస్టాండ్ ఏరియాలో మానవ హారం నిర్వహించి ఓటు హక్కు గొప్పతనాన్ని అధికారులు వివరించారు. అనంతరం శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో జాతీయ ఓటర్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో సీనియర్ సిటిజెన్ల కు సన్మానం చేశారు. ఓటుహక్కు ప్రాముఖ్యతపై పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి జిల్లా అధికారులు మెమెంటో, సర్టిఫికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా క్రీడలు, యువజన సంక్షేమ అధికారి సునీల్ రెడ్డి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైరాలో జాతీయ ఓటర్ దినోత్సవ ర్యాలీ

వైరా : వైరాలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ అధికారులు



విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైరా రింగ్ రోడ్ సెంటర్లో మానవహారం చేపట్టి ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కే.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 సంవత్సరాల నిండిన యువతి యువకులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సూతకాని జైపాల్, కమీషనర్ సిహెచ్ వేణు, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ, ప్రతిజ్ఞ

కల్లూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం



సందర్భంగా శనివారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్రాస్ రోడ్ దగ్గర నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు అధికారులు, విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఆర్డీవో ఎల్.రాజేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పైన మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎండిఓ డి.చంద్రశేఖర్, ఆర్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి డి.చంద్రశేఖర్, ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతజ్ఞ చేశారు.

తహసీల్దార్ ఎంఏ రాజు

వేంసూరు : రాజ్యాంగం కల్పించిన ఓటు ఆయుధంతో సమానమని ప్రతి ఒక్కరూ, దానిని వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎంఏ రాజు అన్నారు. ఓటర్ దినోత్సవ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులచే ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



ఘనంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం

బోనకల్ : మండల కేంద్రంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం అధికారులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్ వరకు మండల అధికారులు, ఉపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు, బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో అధికారులు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మండల తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్, ఎంపీడీవో రురావత్ రమాదేవి, ఎస్సై కడగండ్ల మధుబాబు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిని ఇస్లావత్ సక్కుబాయి, బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లింగం జ్యోతిర్మాయి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్, ఉపాధ్యాయులు విద్యార్థులు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధా, జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కాజా శరత్‌ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శనివారం సాయంత్రం నగరంలోని ఎన్‌ఎస్పీ గెస్ట్ హౌస్ చేరుకున్న న్యాయమూర్తులు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.



భద్రాచలం రామయ్యకు రూ.1లక్ష విరాళం

నవతెలంగాణ-మధిర

భద్రాచలం రామాలయంలో నిర్వహించే నిత్యాన్నదానానికి రూ.1లక్షా 116 విరాళంను శనివారం రామాలయం సిబ్బందికి మధిరకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రంగా వెంకటేశ్వర్లు సుగుణవతి దంపతులు, కుమారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మెన్ రంగా హనుమంతరావు మధులతలు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేసిన చేబ్రోలు ఆగ్రో ఏజెన్సీస్

నవతెలంగాణ-బోనకల్

కేంద్ర ఎన్నికల సంఘం 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిధిలోని రావినూతల ఉన్నత పాఠశాలలో రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు ఆగ్రో ఏజెన్సీస్ అధినేత కాంగ్రెస్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, మహిళా కాంగ్రెస్ మధిర డివిజన్ అధ్యక్షురాలు చేబ్రోలు రమ శనివారం బాలికలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. అనంతరం బహుమతుల ప్రదాన ఉత్సవ సభ నిర్వహించారు. విజేతలకు చేబ్రోలు ఆగ్రో ఏజెన్సీస్ అధినేత సీనియర్ కాంగ్రెస్ నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు మహిళ కాంగ్రెస్ మధిర నియోజకవర్గ అధ్యక్షురాలు చేబ్రోలు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య క్రతువు సజావుగా సాగేలా చూసే గురుతర బాధ్యతను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలను అందుకుటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దామాల పుల్లయ్య, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బస్సు పథకాలలో సవరణ చేయాలి

నవతెలంగాణ-మధిర



కేంద్ర ప్రభుత్వం విద్యుత్తు బస్సు పథకాలలో సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌డబ్ల్యూఎఫ్ సిఐటియు, ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో మధిర డిపో వద్ద శనివారం ఆర్టీసీ కార్మికులు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆర్టీసీలే నేరుగా విద్యుత్ బస్సులు కొని నడిపేలా విధానంలో సవరణ చేసి నిధులు సమకూర్చాలని, కార్పోరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలు, ఇన్సెంటివులు ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జె.పద్మావతి, ఎస్‌డబ్ల్యూయు డిపో కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేలల్లో దరఖాస్తులు..వందల్లో లబ్దిదారులు

రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం అభ్యర్థనలు

- ఆత్మీయ భరోసాకు అర్హత లేని పేదలు
- రసాభాసగా గ్రామసభలు...
- స్థానిక పోరుకోసమే సభలు అంటున్న ప్రతిపక్షాలు



గ్రామసభ ఫైల్ ఫోటో

నవతెలంగాణ-కొణిజర్ల

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పథకాల లబ్దిదారుల ఎంపికలు గ్రామ సభల ద్వారా లబ్దిదారుల పేర్లు చదివి వినిపించి అభ్యంతరాలు తెలుసుకునేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేసింది. ఈనెల21 నుంచి 23 వరకు గ్రామ పంచాయతీ కార్యలయాల ఎదుట గ్రామ సభలు నిర్వహించారు. వివిధ శాఖల సమన్వయం అధికారుల ఉరుకుల పరుగులతో జరిగిన గ్రామ సభలు ప్రశాంతంగా 27 గ్రామ పంచాయతీలలో ముగిసాయి. సమగ్ర సర్వేలో వచ్చిన దరఖాస్తులకు మించి గ్రామసభలలో లక్షలలో ప్రజల నుండి వినతులు వచ్చాయి. పేద ప్రజల కోసం చేపట్టిన ఈ నాలుగు పథకాలు అర్హులైన పేదలకు అందుతాయా లేదా అనేది చూడాలి.

గణతంత్ర దినోత్సవం రోజు ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డు పథకాలలో లబ్దిదారుల వివరాలు ప్రకటిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పేద ప్రజల కోసం చేపట్టిన ఈ నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందుతాయా లేదా అనేది చూడాలి. ఇదే ప్రభుత్వ అధికారులు నెల రోజులపాటు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించినప్పుడు ప్రతి ఇంటి దగ్గర ఉన్నవి లేనివి వివరాలను ప్రభుత్వ వెబ్సైట్లో నమోదు చేశారు. ఆవే విషయాలను గ్రామ సభలో ప్రకటించాలని ముందుగా ప్రభుత్వం అనుకున్న ప్రజల నుండి వస్తున్న వినతులు డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని కొత్తగా దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి సభలో వందల సంఖ్యలలో రేషన్ కార్డులు దరఖాస్తులు ప్రజల నుంచి వచ్చాయి. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులకు లబ్దిదారుల ఎంపిక కష్టంగా ఉందని సరైన వ్యవస్థ ఇప్పటికీ స్థానికంగా లేకపోవడం, సిబ్బంది కొరత, రాజకీయ ఒత్తిళ్ల అధికారులకు తలకు మించిన భారంగా మారిందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని పేదల కోసం ఏడాదికి 12,000 చొప్పున ప్రతి కుటుంబానికి అందించే లక్ష్యంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ముందుకు తెచ్చింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో 2023 నుంచి 24 సంవత్సరంలో కనీసం 20 రోజుల పని దినం చేసిన వారిని ఎంపిక చేయమని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో లబ్దిదారులు గ్రామసభలలో ఈ పథకానికి దరఖాస్తు చేస్తుండటంతో ఈ పథకంలో అర్హులను ఎంపిక చేయడం కష్టంగా మారే ఆవకాశం ఉందని అధికారులు వాపోతున్నారు. ఈ పథకానికి వచ్చే ఏడాది నాటికి లబ్దిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రామసభలలో లబ్దిదారుల ఎంపిక అధికార ప్రతిపక్ష రాజకీయ పార్టీల నుండి అధికారులకు ప్రశంసలు అందుతున్నా.. అక్కడక్కడ అధికారులకు, అధికార పార్టీ నాయకులకు ప్రతిపక్ష పార్టీల నాయకులతో వాగ్వాదాలు జరిగిన సంఘటనలు నెలకొన్నాయి. మండలంలో ప్రధానమైన శాఖలను సమన్వయం చేసుకొని గ్రామ సభలకు ప్రజలను రప్పించి ప్రభుత్వం ముందుకు తెచ్చిన నాలుగు పథకాల లక్ష్యాలను వివరించడంలో అధికారులు సఫలీకృతం అయ్యారని చెప్పుకోవచ్చు. గ్రామ సభలు ఏర్పాటు చేయడంతో గ్రామాల్లో మూడు రోజులపాటు పండుగ వాతావరణం కనిపించింది. ప్రతిపక్ష పార్టీలు మాత్రం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది పొందేందుకు ఈ సభలు ఉపయోగించుకుంటుందని విమర్శలు చేస్తున్నారు.

అర్హులకే ఆరు గ్యారంటీలు అందిస్తాం...
మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య



రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తామని మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అన్నారు. లబ్దిదారులు ఆధైర్య పడవద్దన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు నిరంతరం ప్రభుత్వం దరఖాస్తుదారుల నుంచి స్వీకరంచడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణం ఐదు వందలకే గ్యాస్ ఇస్తున్నామని ఉచిత విద్యుత్ సైతం అందిస్తున్నామని ఆమె తెలిపారు.

రాజకీయాలకుతీతంగా సంక్షేమ పథకాలు ఇవ్వాలి
సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ



రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాజకీయాలకుతీతంగా ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపిక పేరుతో గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి లబ్దిదారుల మధ్య గ్రామాల్లో ఘర్షణలు జరిగాయని ఆరోపించారు. దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఎంపికలు చేయాలన్నారు.

కాసాని ఐలయ్య అకాల మరణం సీపీఐ(ఎం)కు తీరని లోటు

నవతెలంగాణ-సత్తుపల్లి



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, జీఎంపీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కాసాని అయిలయ్య అకాల మరణం పార్టీకి తీరని లోటని సత్తుపల్లి డివిజన్, పట్టణ కమిటీల బాధ్యులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కొత్తగూడెం ప్రాంతంలో పార్టీ బలోపేతానికి అయిలయ్య విశేషకృషి జరిపారన్నారు. ఈ సందర్భంగా అయిలయ్య కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ(ఎం) సత్తుపల్లి డివిజన్, జిల్లా, పట్టణ కమిటీల నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండురంగారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, రైతుసంఘ నాయకులు రావుల రాజబాబు, పార్టీ పట్టణ నాయకులు చావా రమేశ్, సప్పిడి భాస్కరరావు, ఐద్వా నాయకురాళ్లు పాకలపాటి ఝాన్సీ, చెరుకు రత్నకుమారి, ప్రభావతి సంతాపం తెలిపారు.

పెనుబల్లి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఐలయ్య ఆకస్మిక మృతికి శనివారం పార్టీ పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. విఎం బంజరలోని చలమాల సూర్యనారాయణ భవన్లో ఐలయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మామిళ్ళ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కండే సత్యం తడికమళ్ళ చిరంజీవి చలమాల నరసింహారావు నల్లమల ప్రతాప్ చిలక రామచంద్రుడు కొప్పుల వెంకటేశ్వరరావు జువ్వ వెంకటేశ్వర్లు నాగ బాలకృష్ణ పాల్గొన్నారు.

కొణిజర్ల : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రజా పోరాటాల ఉద్యమాల నాయకులు కాసాని ఐలయ్య గుండెపోటుతో శనివారం మరణించిన విషయం విధితమే.. సీపీఐ(ఎం) మండల కమిటీ ఐలయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్ల కుటుంబరావు, మోత్కూరు వెంకటేశ్వరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, తాత పద్మ, అన్నారపు వెంకటేశ్వర్లు, జోనబోయిన అంజయ్య, దొడ్డపనేని కృష్ణార్జునరావ్, కట్టా రాంబాబు, చింతపల్లి ప్రసాద్, హరిచందు, పుల్లారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్ : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని ఐలయ్య మృతి పట్ల పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరావు, సీనియర్ జిల్లా నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారి సురేష్ తీవ్ర సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాసాని ఐలయ్య కొత్తగూడెంలో పార్టీని నిర్మించడంలో కీలక పాత్ర పోషించాడని కొనియాడారు. వారి మృతి పట్ల సీపీఐ(ఎం) బోనకల్ మండల కమిటీ పగాడ సానుభూతిని తెలుపుతున్నట్లు తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు గుగులోతు నరేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, దొండపాటి సత్యనారాయణ, గుగులోత్ పంతు, మంద వీరభద్రం, తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ సభ్యులు జోనిబోయిన గురవయ్య, మాజీ ఎంపీటీసీ గండు సైదులు, ఎర్రగాని నాగరాజు తదితరులు ఉన్నారు.

ఖమ్మం : సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, నిబద్ధత గల కమ్యూనిస్టు నేత, పేదల పక్షపాతి కాసాని ఐలయ్య మరణం అత్యంత బాధాకరమని, వారి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని బీఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ అన్నారు. వారికి విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతామని తెలిపారు.

ప్రజారంజక పాలన అందిస్తున్న ప్రభుత్వం

- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజా రంజక పాలన అందిస్తున్న ప్రభుత్వంపై కొంతమంది బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు పరిచిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు చేసి కష్టాన్ని దివాలా పరిస్థితి తీసుకెళ్లి ఈరోజు రాష్ట్రాన్ని పదేళ్ల పరిపాలనలో పూర్తిగా ధ్వంసం చేశారని ఆరోపించారు. ఆ ధ్వంసకాండ నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలకు సంక్షేమ పథకాలు ఇచ్చుకుంటూ మీరు అప్పులకు ప్రతినెల వడ్డీలు చెల్లిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుకుంటూ ప్రజలకు పథకాలు అందించుకుంటూ ముందుకు నడుస్తుందని, అలాంటి ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ద్వంద వైఖరితో మాట్లాడడం, గ్రామసభల్లో ప్రజలను రెచ్చగొట్టడం, ప్రజలకు సంక్షేమ పథకాలు అందకొండ చేయడం అనేక గందరగోళాలని సృష్టిస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసి కట్టుగా రెండు కళ్ళలాగా పనిచేస్తూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధిని మొదటి స్థానంలో ఉంచారన్నారు. ఆర్థిక లోటు ఉన్న కానీ వాటిని అధిగమించి ముందుకు సాగుతున్న రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర పరిస్థితిని పదేళ్ల పరిపాలనలో అతలాకుతలం చేసే ఆర్థికంగా దెబ్బతీసే రాష్ట్రాన్ని దోచుకు తిన్న బీఆర్ఎస్ నాయకులు ఈరోజు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర అభివృద్ధిని చూసి మింగుడు పడక కారు కూతలు కూస్తున్నారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో టిపిసిసి సభ్యులు, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు, కామేపల్లి పిఏసిఎస్ చైర్మెన్ పుచ్చకాయల వీరభద్రం, ఐఎన్టీయుసీ, మహిళా, సేవాదళ్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలి

- రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి
- విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలి
- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం విస్తృత కార్యవర్గ సమావేశం డిమాండ్

నవతెలంగాణ-వైరాటౌన్

రాష్ట్ర ప్రభుత్వం గత దశాబ్ద కాలంగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పట్ల ఉదాసీనంగా ఉంటుందని, ప్రభుత్వాలు మారినా నేటికి సమస్యలు పరిష్కారం కాలేదని, వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కారించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే, విస్తృత కార్యవర్గ సమావేశం పి.సత్యనారాయణ అధ్యక్షత నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, సూరి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఆర్థిక నివేదికను యస్.పెంటయ్య ప్రవేశ పెట్టగా సభ్యులు చర్చించి ఆమోదించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి మేదరమెట్ల సుబ్బయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు 2023 జనవరి నుండి నేటి వరకు పెండింగ్ పెట్టిన ఐదు డీఆర్‌లు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వేణు మాట్లాడుతూ గత మార్చి నుండి రిటైర్ అయిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు మాట్లాడుతూ 2023 జూలై నుండి అమలు కావాలసిన పీ.ఆర్ సి నివేదికను వెంటనే తెప్పించి అమలు చేయాలని, 2023 జనవరి నుండి అమలు కావాలసిన డీ.ఆర్ లు వెంటనే విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల భాగస్వామ్యంతో రాష్ట్ర స్థాయిలో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథిలుగా హాజరైన రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ ఉపాధ్యక్షులు బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు అవసరమైన అన్నిరకాల సహకారం తను అందిస్తానని, రాష్ట్ర మంత్రులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర, తల్లాడ, నేలకొండపల్లి యూనిట్ అధ్యక్షులు వేంకటేశ్వరరావు, శేషభూషణం, రంగారావు, మున్సిపల్ చైర్మెన్ సూతకాని జయపాల్, జిల్లా కౌన్సిల్ చల్లా కృష్ణారావు, అసోసియేట్ అధ్యక్షులు వాస్‌దాస్, సుబ్బయ్య, శారద, ప్రసాద్, సామినేని వెంకటేశ్వర్లు, బోడ పంతులు, వైరా ఏటీఓ, ఎస్‌టిఓ ప్రసన్నకుమార్, ఎల్లయ్య, ఖమ్మం ఏస్‌టీఓ వేలాద్రి, టిఎన్‌జిఓ ఖమ్మం జిల్లా అధ్యక్షులు అదుర్గా ప్రసాద్, యస్‌బిఐ మేనేజర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



28న జేవీఆర్ కళాశాలలో నాలెడ్జ్ ఎక్స్‌పో

నవతెలంగాణ-సత్తుపల్లి

ఈనెల 28వ తేదీన సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలెడ్జ్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీ తెలిపారు. శనివారం నాలెడ్జ్ ఎక్స్‌పో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపీ మాట్లాడుతూ ఈ ఎక్స్‌పో కార్యక్రమానికి సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులను ఆహ్వానిస్తున్నామన్నారు. నేటి కాలంలో యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా విజ్ఞానం వైపు అడుగులు వేసేలా కొత్త జ్ఞాన సముపార్జన పొందేలా వివిధ రకాల క్రీడలను ఈ కార్యక్రమంలో నిర్వహించి బహుమతులను అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో... 'సాయిస్ఫూర్తి' పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-సత్తుపల్లి

మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈనెల 22, 23 తేదీల్లో కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో అత్యంత ప్రతిభను కనబర్చినట్లు ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ దేశిరెడ్డి రఘుపతిరెడ్డి తెలిపారు. గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఉమ్మడి జిల్లాలోని 8 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వివిధ రకాల ఈవెంట్స్‌లో సాయిస్ఫూర్తి విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు రఘుపతిరెడ్డి తెలిపారు. బాలుర విభాగం వాటీబాల్ పోటీల్లో వరుసగా 3సార్లు ప్రథమస్థానం సాధించారన్నారు. బాలికల విభాగం వాలీబాల్ పోటీల్లో ప్రథమంలో నిలిచారన్నారు. లాంగ్‌జంప్, బ్యాడ్మింటన్ సింగిల్, డబుల్స్‌లో ప్రథమస్థానం, చెస్‌లో ద్వితీయస్థానం, బ్యాడ్మింటన్ సింగిల్ అండ్ డబుల్స్‌లో రన్నర్స్‌గా నిలిచారని పీడీ తెలిపారు. ఫిబ్రవరిలో 3, 4 తేదీల్లో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సాయిస్ఫూర్తి విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని కోరుతూ విజేతలను అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో డిప్లొమో డీన్ తొమ్మండ్రు రాంబాబు, డిపార్టుమెంట్ హెచ్‌ఓడీఎస్‌లు విద్యార్థులను అభినందించిన వారిలో ఉన్నారు.

నేడు ఎంపీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జాతీయ పతాక ఆవిష్కరణ వేడుక నిర్వహించనున్నారు. ఉదయం 8:15 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

శ్రీ చైతన్యలో ముగిసిన ఉడాన్ క్రీడోత్సవాలు

- క్రీడలతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు
- ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిని, అర్జున అవార్డు గ్రహీత సిక్కిరెడ్డి







నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

శ్రీ చైతన్య వార్షిక ముగింపు క్రీడా ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్థానిక పుట్టకోట రోడ్డున గల శ్రీ చైతన్య గ్లోబల్విస్తా స్కూల్‌లో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అవార్డు గ్రహీత సిక్కిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సాహ వాతావరణంలో విద్యార్థులు ఉపాధ్యాయులు క్రీడల్లో పాల్గొని మానసిక ఆనందాన్ని పొందారని తెలిపారు. ఆమె విద్యార్థులతో తన అనుభవాల్ని పంచుకోవడంతో పాటు, ఈ స్థాయికి రావడానికి దోహదబడ్డ అంశాలు సవివరంగా వివరించి వారిని ప్రభావితం చేశారు. ఇలాంటి వాతావరణంలో విద్యాభ్యాసం జరగటం పిల్లలు చేసుకున్న అదృష్టమని, ఇలాంటి కోర్టులు, సదుపాయాలు నిజంగా అనందదాయకం అని పాఠశాలల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రీడా కార్యక్రమంలో సీనియర్ జూనియర్ విభాగాలలో బాలురు బాలికలకు విరివిడిగా టెన్నిస్, బాస్కెట్బాల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్ మరియు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మెన్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివిధ విభాగాలలో క్రీడలను నిర్వహిస్తూ విద్యార్థులతో విద్యతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొంచడందించడం మా విద్యాసంస్థల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ విద్యార్థులు సర్వతో అభివృద్ధిని పొందుతారని వివరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కరుణ సైదుబాబు, ఏజీఎంలు చేతన్ మాధుర్, జయప్రకాష్, ప్రిన్సిపల్స్, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-అశ్వాపురం



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిర ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మణుగూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ప్రధానంగా గతంలో పూరిల్లు కాలిపోయిన వారికి అలాగే వికలాంగులు, వితంతువులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. లబ్దిదారుల ఎంపికలో ఎటువంటి అవకతవకలు జరగకుండా అధికారులు చూడాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ ఇండ్ల ఎంపికలో అర్హులకు అన్యాయం జరగకుండా పారదర్శకంగా ఇండ్ల ఎంపిక జరిగేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరిగంటి బిక్షమయ్య, తుక్కాని మధుసూదన్ రెడ్డి, భూ రెడ్డి వెంకట్ రెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, కొండా బత్తుల ఉపేందర్ బచ్చు వెంకటరమణ, గొల్లపల్లి నరేష్ ఉన్నారు.

అధిక విద్యుత్ ఉత్పత్తికి కార్మికులు సమిష్టిగా కృషి చేయాలి

- కేటీపీఎస్ ఏడవ దశ సీఈ పాలకుర్తి వెంకటేశ్వరరావు
- (హెచ్-142) యూనియన్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ



విద్యుత్ ఉత్పత్తి చేయడంలో కార్మికులు ముఖ్య భూమిక పోషించాలని కేటీపీఎస్ ఏడవ దశ చీఫ్ ఇంజనీర్ పాలకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-142) ఆధ్వర్యంలో నూతన సంవత్సర 2025 విద్యుత్ కార్మిక డైరీను, క్యాలెండర్‌ను, టేబుల్ టాప్ క్యాలెండర్‌ను చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కెవి రామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకట్ రెడ్డి, నాయకులు ఎస్.శ్రీనివాసాచారి, డి.సత్యరాజ్, స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, సయ్యద్, శ్రీహరి, నాగభూషణం, టి.కోటేశ్వరరావు, ఎం.శివరాం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విజయభేరీ



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మండలం గుట్ట మల్లారం నందు శ్రీ చైతన్య పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రిషిక అనే విద్యార్థికి రేజింగ్ స్టార్ పురష్కారం గెలుపొందింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్ మాట్లాడుతూ పిల్లలు అన్ని విద్యలలో ముందు ఉండాలని ఈ బహుమతి కాకుండా ఇంకెన్నో బహుమతులు గెలుపొందాలని కొనియాడారు. ఈ కార్యక్రమానికి శ్రీ చైతన్య పాఠశాల ఎక్కడమిక్ డీన్ భాస్కర్ రెడ్డి సీ బ్యాచ్ కొమరయ్య ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఐలయ్య మృతి ప్రజా పోరాటాలకు తీరని లోటు

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు
- పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య మృతి ప్రజా పోరాటాలకు, పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు అన్నారు. శనివారం గుండెపోటుతో మృతి చెందిన కాసాని ఐలయ్య మృతికి సంతాపంగా స్థానిక బండారు చంద్రరావు భవనంలో ఐలయ్య చిత్రపటానికి పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ సుజాతనగర్ పంచాయతీ సర్పంచ్‌గా, పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకుడిగా అనేక పోరాటాలు ఉద్యమాలు చేసిన ఘనత కాసాని ఐలయ్యకు దక్కుతుందని అన్నారు. ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురైన పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ రాష్ట్ర మహాసభలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో గుండెపోటుతో ఐలయ్య మృతి చెందటం విచారకరమని, రాష్ట్ర మహాసభలో సైతం ఐలయ్యకు నివాళులు అర్పిస్తున్నామని శరత్ బాబు స్పష్టం చేశారు. ఈ సంతాప సభకి పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు, అధ్యక్షత వహించగా సంతోష్ కుమార్, లీలావతి, జీవనజ్యోతి, కుంజా శీను, అజయ్ కుమార్, ఎంవిఎస్ నారాయణ, కొరడా శ్రీనివాసరావు, రాయల రాములు, బిజిఎల్ పిదాసు, మురళీకృష్ణ, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు పాయం ఆర్థిక భరోసా

నవతెలంగాణ -గుండాల



వికలాంగులకు అండగా నిలిచి వారి స్వశక్తితో వారు బతకాలనే గొప్ప ఉదేశ్యంతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆర్థిక భరోసా కల్పించారు. శనివారం మణుగూరులో గుండాల మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన వాగబోయిన నరసింహారావుకి, కొడవటంచ గ్రామానికి చెందిన అనంత కుమార్‌కి, ఆళ్ళపల్లి మండలం రాయపాడు గ్రామానికి చెందిన తుమ్మ లక్ష్మికి ఒక్కరికి రూ.50,000 అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులు ఎవరూ మనో ధైర్యం కోల్పోగూడదని వారి సొంత వ్యాపారాల కోసం గాని, ఉపాధి కోసం గాని వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ అండగా నిలపడుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఆర్-పీటీఆర్ యువసేన కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఖదీర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసం శ్రీకాంత్, పల్లపు రాజేష్, బొంగు చంద్రశేఖర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట

అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం మండలంలో పర్యటించి పలు కుటుంబాల వారిని పరామర్శించారు. మండలంలోని అల్లిపల్లిలో విజయరామరాజు (రాంబాబు), చెన్నువారిగూడెంకు చెందిన కట్టం ఎర్రప్ప తండ్రి కట్టం రాములు, అదే విధంగా వెంకమ్మలు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను మెచ్చా పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, అల్లిపల్లి మాజీ సర్పంచ్ రెడ్డిమళ్ళ నాగయ్య, శ్రీరాముల చక్రధర్‌రావు, రత్నాకర్, కోర్స వెంకటేష్, మాటూరి రాజశేఖర్, శ్రీను, బెల్లం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించుకోవడం మనందరి బాధ్యత

- డీఎఫ్ఓ కృష్ణ గౌడ్

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



అడవులను రక్షించుకోవడం మనందరి జిల్లా ఫారెస్ట్ అధికారి (డీఎఫ్ఓ) కృష్ణ గౌడ్ అన్నారు. ఈ మేరకు యానంబైల్, రేగళ్ల, చాతకొండ, ఆళ్ళపల్లిలకు సంబంధించి అటవీశాఖ నాలుగు రేంజ్‌ల పరిధిలోని ఫారెస్ట్ అధికారులతో డీఎఫ్ఓ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల పునరుద్ధరణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సమీపంలోని అడవులను సందర్శించి, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఎఫ్‌డీఓ బాబు నాయక్, రేగళ్ల ఫారెస్ట్ రేంజర్ వి.జశ్వంత్, ఆళ్ళపల్లి ఫారెస్ట్ రేంజర్ కిరణ్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా ముద్దుబిడ్డ ఇకలేరు

గుండెపోటుతో కాసాని ఐలయ్య మృతి

- నివాళి అర్పించిన నున్నా, మచ్చా, అన్నవరపు, ఏజే
- నాలుగు దశాబ్దాలపాటు పార్టీకి సేవలు
- నేడు అంత్యక్రియలు
- పోరాట కెరటం మృతి బాధాకరం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు





నవతెలంగాణ-కొత్తగూడెం

పేదల పక్షన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ కెరటం, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, జీఎంపీఎస్ రాష్ట్ర నాయకులు కాసాని అయిలయ్య (75) మృతి చెందారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న సందర్భంలో ఒక్కసారిగా బీపీ తగ్గి, గుండెపోటు రావడంతో ప్రాణాలు వదిలారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో సందర్శనార్థం ఉంచారు. అనంతరం ఆయన నివాసగృహం సుజాతనగర్ మండల కేంద్రానికి తరలించారు. నేడు సుజాతనగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మృతి బాధాకరమని అన్నారు.పార్టీకి ఆయన కుటుంబానికి తీరని లోటని అన్నారు.

సీపీఐ(ఎం) నేత కాసాని ఐలయ్యకు కాంగ్రెస్ నేతల ఘన నివాళి

ఐలయ్య పార్థివ దేహాన్ని కొత్తగూడెం సీపీఐ(ఎం) కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాసాని ఐలయ్య మృతి ప్రజా ఉద్యమాలకు, సీపీఐ(ఎం)కి తీరనిలోటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జెడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కోనేరు సత్యనారాయణ, ఆళ్ల మురళి, నాగ సీతారాములు, జేవిఎస్ చౌదరి తెలిపారు. సొసైటీ చైర్మెన్ మండే వీర హనుమంతరావు, కొత్తగూడెం క్లబ్ చైర్మెన్ కోనేరు పూర్ణచంద్రరావు, మున్సిపల్ కౌన్సిలర్ సెంటర్ రైల్వే బోర్డు మెంబర్ వై.శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూనెం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంబాబు తదితరులు నివాళులర్పించారు. మంచిగంటి భవన్ నుండి బస్టాండ్ పోస్ట్ ఆఫీస్ వరకు జరిగిన అంతిమ యాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కూనంనేని సంతాపం

కాసాని ఐలయ్య మృతిపట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపాన్ని ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యకర్తల సందర్శనార్థం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఉంచిన ఐలయ్య మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాసాని ఐలయ్య నిబద్ధతగల కమ్యూనిస్టు నేత అని, కొత్తగూడెం ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించారని, ప్రజలను పోరాటాలవైపు నడిపించారన్నారు.

పోరు బిడ్డ కాసానికి ఘన నివాళి : బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

ఎర్రజెండా పోరాట యోధుడు సుదీర్ఘకాలం పేదల పక్షాన పోరాటం చేసిన కాసాని అయిలయ్య అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరం. కాసాని అయిలయ్య మృతదేహానికి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసాని మృతి పేద, పీడిత, కార్మిక, కర్షక ప్రజలకు తీవ్ర నష్టమని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాసాని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. అదేవిధంగా సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ కూడా అయిలయ్య మృతికి నివాళులర్పించారు.



కాసాని మృతదేహానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, ఏజే.రమేష్, తదితరులు

కామ్రేడ్ కాసాని ఐలయ్యకు సంతాపం

ఐలయ్య పార్థివదేహానికి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా బృందం సందర్శించి నివాళులర్పించింది. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ గౌని నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్యలు కాసాని ఐలయ్య కుటుంబానికి, సానుభూతిపరులకు ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేశారు. ఐఎన్‌టియుసి కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు రజాక్‌తో పాటు ఎస్‌కె.గౌస్, బూటిక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య అబ్రహం, దేవదానం, కమల్, హనుమంతు, తదితరులు నివాళిఅర్పించారు.











కాసాని జీవన ప్రస్థానం...

కాసాని అయిలయ్య వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లి గ్రామంలో 1950 జూలై 8న కాసాని భూమమ్మ, మల్లయ్య దంపతులకు జన్మించారు. అనంతరం గంగాదేవి పల్లి సంఘం గ్రామాల్లో ప్రాథమిక విద్యను అభ్యసించి కాజీపేటలో మేనమామ ఇంటి వద్ద నుండి పీయూసీ అభ్యసించారు. అనంతరం 1970లో వరంగల్ జిల్లాలో ఓంకార్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాల్లో పాల్గొని సీపీఐ(ఎం) సభ్యత్వం తీసుకున్నారు. 1971లో తన మేనమామ కూతురు లక్ష్మితో వివాహం జరిగింది. అనంతరం ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూనే 1974 మార్చి 31వ తేదీన ప్రస్తుత కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం రెడ్డిపాలెం గ్రామానికి బతుకు తెరువు కోసం వచ్చారు. గంగదేవిపల్లిలో అమ్ముకున్న భూమికి ఇక్కడ పదిహేను ఎకరాలు కొనుగోలు చేసి వ్యవసాయం చేసుకున్నారు. ఐలయ్య తండ్రి మల్లయ్య, వారి కుటుంబ సభ్యులందరూ ఇక్కడే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని కొనసాగించుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో ఇక్కడ జరుగుతున్న వడ్డీ వసూళ్ల , దోపిడీలు ప్రజల ఇబ్బందులు, కూలీ ఇవకుండా వెట్టి చాకిరీతో ఇబ్బంది పడుతున్న ప్రజల్ని ఆదుకోవడానికి కుటుంబం నుండి బయటకు వచ్చి ఆర్ఎంపీ వైద్యులుగా ప్రజలకు పనిచేస్తూ, ప్రజల్ని చైతన్యం చేసే క్రమం 1978 దాకా కొనసాగించారు. 1978లో పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా వచ్చి ఒకవైపు తన భార్య లక్ష్మిని, పిల్లల్ని తన సైకిల్ పై ఎక్కించుకొని ఊరూరు తిరుగుతూ ప్రజల్ని ఐక్యం చేస్తూ, చైతన్యాన్ని నింపుతూ వర్గ, కూలి పోరాటాలు పెద్ద ఎత్తున కొనసాగించి విజయం సాధించారు. భూస్వాములపై కూలి పోరాటాలు చేస్తున్న క్రమంలో ఆయనపై పెద్దఎత్తున హత్యాప్రయత్నాలు జరిగాయి. సుజాతనగర్ పరిసర ప్రాంతాల్లో కూలీ రేట్ల పెంపుకోసం అనే పోరాటాలు చేసిన అనంతరం పంచాయతీ ఎన్నికల్లో 1981లో సుజాతనగర్ పంచాయతీకి పోటీ చేసి సర్పంచ్‌గా విజయం సాధించారు. అనంతరం అప్పటి నుండి 2001 వరకు 20 సంవత్సరాలు పాటు సర్పంచిగా గెలుపొందుతూనే వచ్చారు. ఈ క్రమంలో సీపీఐ(ఎం) నిర్వహించిన కూలి, రైతాంగ పోరాటాలకు ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పాల్వంచ నుంచి ఏన్కూర్ వరకు చేశారు. సుమారు 8000 ఇళ్ల స్థలాలు పేదలకు ఇప్పించిన చరిత్ర ఉంది. అదేవిధంగా తునికాకు కట్ట రేటు పెద్ద పోరాటాన్ని కొనసాగించిన చరిత్ర ఉంది. ఈ క్రమంలో 23 సార్లు జైలుకి వెళ్లారు. ఒకవైపు ప్రజా ఉద్యమంలో కొనసాగుతూనే తన కుటుంబాన్ని సైతం ప్రజా ఉద్యమానికి అంకితం ఇచ్చిన మహానేత. కాసాని ఐలయ్య భార్య లక్ష్మి 2017లో మే4వ తేదీన సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలందిస్తూ అకాల మరణం చెందారు. వారికి కుమారుడు లెనిన్, కోడలు పావని, కుమార్తె జ్యోతి అల్లుడు కృష్ణ ఉన్నారు. ఇద్దరు సంతానానికి ఆదర్శ వివాహాలు చేశారు. గత 10 సంవత్సరాల నుండి అనారోగ్యానికి గురైనప్పటికీ నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ అన్ని వర్గాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారు. చివరి వరకు సీపీఐ(ఎం) ఎర్రజెండా విడవకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి మహోన్నత నాయకుడు కామ్రేడ్ కాసాని అయిలయ్య.

టీఎన్‌టీయూసీకి మాల మహానాడు ఎంప్లాయిస్ బదిలీస్ మద్దతు

నవతెలంగాణ-బూర్గంపాడు



సారపాకలోని ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారంలో ఈ నెల 31న జరగనున్న గుర్తింపు కార్మికుల సంఘం ఎన్నికలలో టీఎన్‌టీయూసీ, మిత్రపక్షాల యూనియన్‌కు మాల మహానాడు ఎంప్లాయిస్, బదిలీస్ యూనియన్ మద్దతు తెలిపింది. శనివారం టీఎన్‌టీయూసీ ఎన్నికల కార్యాలయంలో ఈ మేరకు సమావేశమై మద్దతును ప్రకటించారు. మంచి వేతన ఒప్పందం చేసి సమర్థవంతంగా పనిచేస్తూ మళ్లీ గెలుపు దిశగా వెళుతున్న టిఎన్టియుసి మిత్రపక్షాలకే రాబోయే వేతన ఒప్పందం చేయగల సత్తా ఉందని విశ్వసిస్తూ తమ పూర్తి మద్దతు టీఎన్‌టీయుసి మిత్ర పక్షాలకు ఉంటుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ టిఎన్టియుసి అధ్యక్షులు కనక మేడల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాల మహానాడు గౌరవ అధ్యక్షులు బల్లెం మధు, అధ్యక్షులు తుమ్మల సంగీత రావు, ప్రధాన కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావు, సామేలు, కట్ట ఆదం, బొప్పన ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పొదెం వీరయ్య

నవతెలంగాణ-దుమ్ముగూడెం



త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా సత్తా చాటాలని తెలంగాణ అటవీశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్, డీసీసీ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం లక్ష్మీ నగరం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆరు గ్యారంటీలలో భాగంగా గ్రామసభలలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులైన నిరుపేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించే విధంగా, పనిచేయాలని కాంగ్రెస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చింతిర్యాల రవికుమార్, పూజారి సూర్యచంద్రరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధి ప్రవీణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులుబోడపట్ల శివాజీ, మద్దికూరి కుమారి, నర్సాపురం మాజీ సర్పంచ్ వర్షా శివరామకృష్ణ, నాయకులు డింగి సందీప్ రెడ్డి, వర్ష ప్రసాద్, వాసం రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 4 నూతన పథకాలు ప్రారంభం

- ప్రారంభించు గ్రామాలలో ముందస్తుగా సీఎం సందేశం

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాల్లో రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 గణతంత్ర దినోత్సవ నుంచి 4 నూతన పథకాల అమలు నేటి నుంచి ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, నూతన రేషన్ కార్డుల జారీ పథకాలను లాంఛనంగా ప్రతి మండలంలో ఒక గ్రామంలో ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి మండలంలో 250 నుంచి 400 వరకు ఇండ్లు ఉన్న గ్రామాలను స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఈ గ్రామాలను ఎంపిక చేయనున్నారు. జనవరి 26న ఎంపిక చేసిన గ్రామాలలో మధ్యాహ్నం ఒంటి గంటకు 4 పథకాలను అధికారికంగా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగాలని, 4 పథకాలకు సంబంధించి సదురు గ్రామాల్లో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరేలా చూస్తారు. 4 నూతన పథకాల లాంచింగ్‌లో అర్హులు మాత్రమే జాబితాలో ఉండనున్నాయి. గ్రామ సభలలో స్వీకరించిన నూతన దరఖాస్తులను సైతం పరిశీలించి అర్హులు ఉంటే రేపటి జాబితాలో యాడ్ చేస్తారు. నూతన రేషన్ కార్డుల జారీను తహసీల్దార్ బృందం, ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ఎంపీడీవో బృందం, రైతు భరోసా జాబితాను మండల వ్యవసాయ అధికారి బృందం, ఇందిరమ్మ రైతు భరోసా జాబితాను ఏపీఓ అండ్ నరేగా బృందం పరిశీలించి, ఆ జాబితాలో అర్హులు మాత్రమే ఉండేలా పథకాలు పటిష్ట చర్యలు తీసుకుంటారు. నూతన పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలని, 4 పథకాలకు సంబంధించి లబ్దిదారులు ప్రారంభ కార్యక్రమానికి వచ్చేలా చూడాలని, లబ్దిదారుల వివరాలను గ్రామాలలో ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రారంభ కార్యక్రమానికి ప్రతి గ్రామంలో మంచి ఆడియో వీడియో ఏర్పాట్లు చేయాలని, ముందస్తుగా ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రతి గ్రామంలో ప్రదర్శించాలని కలెక్టర్ తెలిపారు. 4 పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రజలకు మరో సారి వివరించాలని, ఎంపిక కాబడిన లబ్దిదారులకు మంజూరు పత్రాలు జారీ చేయాలని, అనంతరం ప్రజా ప్రతినిధులు తమ సందేశాలు అందించాలని, లాంచ్ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ అడ్వైజర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్‌లను ఆహ్వానించాలని పేర్కొన్నారు. 4 పథకాల లాంచింగ్ కోసం ఎంపిక చేసిన గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపి, నేడు క్షేత్రస్థాయి విచారణ చేయాలని, ఆ దరఖాస్తులలో అర్హులు ఉంటే పేర్లు నమోదు చేసి రేపటి లాంచింగ్ కార్యక్రమంలో పథకాలను సంబంధిత లబ్దిదారులకు వర్తింపజేయాలని అన్నారు. ప్రతి మండలంలో 4 పథకాల లాంచింగ్ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎక్కడ ఎటువంటి గందరగోళం జరిగేందుకు వీలు లేదని, ప్రభుత్వ పథకాలు అర్హులైన చివరి లబ్ది దారుడు వరకు చేరుతాయనే విశ్వా సాన్ని ప్రజలలో కల్పించాలని అన్నా రు. జిల్లాలో గ్రామసభలు విజయ వంతంగా నిర్వహించారు. నూత నంగా 45 వేల 332 రేషన్ కార్డు దరఖాస్తులు, 38 వేల 369 ఇంది రమ్మ ఇండ్ల దరఖాస్తులు, 1121 రైతు భరోసా దరఖాస్తులు, 15672 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తులు మొత్తం 1,00,494 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 4 నూతన పథకాల లాంచింగ్‌కు ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

ప్రతి గ్రామానికి రహదారులు ఏర్పాటు చేస్తాం

- అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-పినపాక

పినపాక నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రతి గ్రామంలో రహదారులు ఏర్పాటు చేస్తున్నామని, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పినపాక మండలం గొట్టెల్లా బీటీ రోడ్ నుండి రాజుపేట గ్రామం వరకు 5,00,000 అంచనాతో గ్రావెల్ రోడ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారి సౌకర్యం లేక గత ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని రహదారుల అనుసంధానంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. నియోజకవర్గ కోసం మరిన్ని నిధులు తీసుకొస్తామని తెలియజేశారు. ప్రతిపక్షాలు పని పెట్టుకొని కావాలని ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఆనంద్, మాజీ సర్పంచులు కళ్యాణి, ఈ.సంభవతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మీరెడ్డి, ఎల్లం బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

రక్తదానం ప్రాణ దానంతో సమానం అని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పాల్వంచ పట్టణం అంబేద్కర్ సెంటర్‌లో ప్రముఖ వ్యాపార సంస్థ రిలయన్స్ స్మార్ట్ సహకారంతో మేనేజర్ పెద్దపల్లి మహేష్, ఉలవపూడి వెంకట గౌతమ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని కొత్వాల ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్వాలను కాంగ్రెస్ నాయకులు, రిలయన్స్ స్మార్ట్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎర్రం శెట్టి ముత్తయ్య, పెద్దమ్మ తల్లి దేవాలయం మాజీ చైర్మెన్ మహిపతి రామలింగం, కాల్వ దేవదాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, రాము, నవీన్, రాము, రిలయన్స్ స్మార్ట్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ టోర్నీ కరపత్రాలను ఆవిష్కరించిన అధికారులు



నవతెలంగాణ-పినపాక

మండల జర్నలిస్టు కప్ క్రికెట్ టోర్నీ త్వరలో ప్రారంభం కానుంది. ప్రతి ఏటా అధికారులను ఒక్కటి చేస్తూ ఎంతో ఉత్సాహభరితంగా ఉల్లాసంగా ప్రతి ఒక్క అధికారి వారి అమూల్యమైన సమయాన్ని కేటాయించి వినోదంలో పూర్తిక నిమగ్నం అయ్యే క్రీడలు ఏమైన ఉన్నాయి అంటే అవి పినపాక ప్రెస్ క్లబ్ అండ్ పోలీస్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు అనడంలో సందేహం లేదు. ఈ ఏడాది 2024-25 గానూ సంబంధించిన కరపత్రాలను మండల అధికారులైన తహసీల్దార్ అద్దంకి నరేష్, సీఐ వెంకటేశ్వరరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా క్రికెట్ టోర్నీకి సంబంధిత కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యోగరీత్యా బిజీగా ఉండే మండలాధికారులకు ఇలాంటి క్రీడలు నిర్వహించడం చాలా గొప్ప విషయం అని పినపాక ప్రెస్ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. అంతేకాకుండా ఈ సంవత్సరం షీల్డ్స్‌తో పాటు ఆకర్షణీయమైన బహుమతులను అందించడం పోటీ తత్వాన్ని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ టోర్నీ గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నటువంటి పాత్రికేయులు బిల్లా నాగేంద్రబాబు, తోట గంగాధర్, సీనియర్ పాత్రికేయులు బూర శంకర్, సాక్షి మహేష్, అక్షరం సంతోష్, సాయి, శ్రీరామ్ బృహస్పతి, కట్ట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలలో మాంటిస్సోరి విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-మణుగూరు

జాతీయస్థాయి చెస్ పోటీలలో మణుగూరు (సత్యభాస్కర) మాంటిసోరి నాలుగవ తరగతి విద్యార్థి టీవీ సాత్విక్ సత్తా చాటాడని ప్రిన్సిపాల్ ఐజాక్ థామస్ శనివారం తెలిపారు. ఏపీలోని పెద్దాపురంలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జనవరి 17 నుంచి 21 వరకు జరిగిన అండర్ 9 క్యాటగిరిలో 13వ జాతీయ స్థాయి స్కూల్స్ చెస్ ఛాంపియన్షిప్‌లో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. పూణేలో జరిగిన 37వ నేషనల్ చెస్ చాంపియన్షిప్‌లో జాతీయ స్థాయిలో 28వ స్థానం కైవసం చేసుకున్నాడని తెలిపారు. విజయవాడలో జరిగిన భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ కార్యక్రమంలో అండర్ 9 క్యాటగిరీలో 2వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. హైదరాబాద్ ఎల్ బీ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి ఎంపికకు జరిగిన స్టేట్ సెలక్షన్స్‌లో ప్రథమ స్థానంలో ఉన్నాడని తెలిపారు. కో-కరికులం, పాటల పోటీలను తమ విద్యార్థులు ముందుంటారని తెలిపారు.

ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటన శనివారం నడికుడి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... నడికుడి గ్రామానికి చెందిన కాక వెంకటేశ్వరరావు అనే రైతుకు చెందిన ట్రాక్టర్ సీతారాంపురం వెళుతున్న సమయంలో నడికుడి గ్రామం వద్ద ప్రమాదవశాత్తు చర్ల-భద్రాచలం రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ మూడు ముక్కలు కాగా డ్రైవర్ రహదారి పక్కనే పడిపోయాడు. ఈ సంఘటనలో ఎటువంటి తీవ్ర ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో రహదారిపై రాకపోకలు సాగించే ప్రయాణికులతో పాటు ట్రాక్టర్ యజమాని సైతం ఊపిరి పీల్చుకున్నాడు.

పథకాల లాంచింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

నూతన పథకాల లాంచింగ్‌కు ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి టెలికాన్ఫరెన్స్ అనంతరం మాట్లాడుతూ జిల్లాలో గ్రామసభలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. నూతనంగా 45 వేల 332 రేషన్ కార్డు దరఖాస్తులు, 38 వేల 369 ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు, 1121 రైతు భరోసా దరఖాస్తులు, 15672 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తులు మొత్తం 1,00,494 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 4 నూతన పథకాల లాంచింగ్‌కు ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్యదర్శి, మత్స్యశాఖ డైరెక్టర్ ప్రియాంక అలా
- పాల్వంచలో విస్తృత పర్యటన
- వసతి గృహాల్లో తనిఖీలు



నవతెలంగాణ-పాల్వంచ

వసతి గృహాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర పౌరసరఫరాల కార్యదర్శి, మత్స్యశాఖ డైరెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోషల్, మైనారిటీ, బీసీ, గిరిజన సంక్షేమ హాస్టల్లో రాత్రి తనిఖీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పాల్వంచలో బొల్లోరి గూడెంలో ఉన్నటువంటి టీజీ ఎంఆర్ఎఫ్ వసతి గృహం, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను తనిఖీ చేశారు. వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వసతి గృహాల గదులను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం ఆహార పరిశీలించారు. కిచెన్ షెడ్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారిని పరిశీలించి వంటకు పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విద్యార్థులతో మమేకమై ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఆమె సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం, అల్పాహారం కలుషితం కాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భోజనం వండడానికి ముందే ప్రతీ రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యతా లేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించకూడదని ఆదేశించారు. సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేస్తే తహసీల్దార్‌కు సమాచారం అందించాలని, వాటి స్థానంలో నాణ్యమైన సరుకులు కేటాయించేలా చర్యలు తీసుకుంటారని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజూ ఉపాధ్యాయులు వంతుల వారీగా ఆహార పదార్థాల నాణ్యతను తప్పనిసరి పరిశీలించాలని ఆదేశించారు. కాగా, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో నీటి వసతి, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలలో మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, పాల్వంచ ఎంఆర్ఓ వివేక్ మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ఏపీవో డేవిడ్ రాజ్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో నిర్వహించే వేడుకలను సంబంధిత అధికారులు వారికి అప్పగించిన పనులను ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించి విజయవంతం అయ్యేలా చూడాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పీఓ రాహుల్ ఆదేశాల మేరకు సంబంధిత యూనిట్ అధికారులతో కలిసి అధికారులు, సిబ్బంది చేయవలసిన పనుల గురించి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి వచ్చే అధికారులకు విద్యార్థినీ, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, టీఏ శ్రీనివాస్, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఏపీఓ పవర్ వేణు, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ, ఐటీడీఏ కార్యాలయంలోని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యదర్శిగా జానంపేట సెక్రటరీ

నవతెలంగాణ-పినపాక

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నేడు ఉత్తమ సెక్రటరీ అవార్డును జానంపేట సెక్రెటరీ రహీం అందుకోనున్నారు. సెక్రటరీగా గ్రామపంచాయతీ నిర్వహించే పనుల్లో బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న సెక్రటరీ రహీం అవార్డుకి ఎంపిక కావడం పట్ల జానంపేట గ్రామపంచాయతీ ప్రజల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామపంచాయతీకి వచ్చే సిబ్బంది సమస్యలు పరిష్కారమయ్యే దిశగా ప్రయత్నం చేస్తున్న ఆయనకు ఈ అవార్డు పట్ల పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

మెరుగైన వేతన ఒప్పందం ఐఎన్‌టీయూసీ గెలుపుతోనే సాధ్యం

- సారపాకలో ఐటీసీ ఐఎన్‌టీయూసీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం
- హాజరైన డీసీసీ అధ్యక్షులు పొదెం, ఎమ్మెల్యే పాయం



నవతెలంగాణ-బూర్గంపాడు

కార్మిక సంక్షేమం, ఉద్యోగ భద్రత, మెరుగైన వేతన ఒప్పందం ఐఎన్టీయూసీ గెలుపుతోనే సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మెన్ పొదెం వీరయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లులు అన్నారు. బూర్గంపాడు మండలం సారపాకలో ఐఎన్టీయూసీ, మిత్రపక్షాల ఎన్నికల కార్యాలయాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ కర్మాగారంలో ఏడుసార్లు గెలిచి, ఏడు మెరుగైన వేతన ఒప్పందాలు చేసిన ఘన చరిత్ర ఐఎన్‌టీయూసీ యూనియన్ కే ఉందని పేర్కొన్నారు. కర్మాగారంలో ఈ నెల 31న జరుగుతున్న ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, మిత్ర పక్షాల యూనియన్ గెలుపు తథ్యమని ఆయన అన్నారు.

కార్మికులకు మెరుగైన వైద్యానికి ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

జిల్లాలో ఉన్న కేటీపీఎస్, పేపర్ కర్మాగారం, సింగరేణి, భారజల కేంద్రం, బీటీపీఎస్ పలు పరిశ్రమలో పని చేస్తున్నటు వంటి కార్మికులకు వైద్యం కోసం ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు త్వరలో జరుగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి పునాదులు వేసి నిర్మాణం పూర్తి చేసి వైద్య సేవలకు అందుబాటులో తెచ్చేందుకు కలెక్టర్‌తో మాట్లాడటం జరిగిందని ఆయన అన్నారు. త్వరలో ఆ కార్యచరణ రూపు దాల్చుతుందని ఆయన అన్నారు. ప్రసిద్ధిగాంచిన ఐటీసీ కర్మాగారంలో జరగబోయే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలుపు ఖాయమని, కార్మికులందరూ విజయోత్సవానికి సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు.

భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ

ఎన్నికల కార్యాలయం ప్రారంభం సందర్భంగా సారపాక పురవీధుల్లో ఐఎన్‌టీయూసీ, మిత్రపక్షల యూనియన్ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. సారపాక ప్రధాన సెంటర్లోని రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జలగం వెంగళరావుల విగ్రహా లకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పిం చారు. అదేవిధంగా ప్రారంభ వేదిక వద్ద ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు స్వర్గీయ సీతయ్య చిత్రప టాని కి పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు ఎండి జలీల్, రాష్ట్ర నాయకులు త్యాగరాజన్, ఐటీసీ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు గోనె రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మెన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పినపాక బి-బ్లాక్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బర్ల నాగమణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు గోని రేణుక, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చెన్నం సూర్య ప్రసాద్, భజన సతీష్, మంద నాగరాజు, పోతిరెడ్డి వెంకటేష్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు, మిత్ర పక్షాలు తదితరులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన పెంచుకొని హక్కులను కాపాడుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్, సెక్రటరీ భానుమతి
- సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తుల బృందం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విచారణ ఖైదీలకు కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు ఉంటాయని, చట్టాలపై అవగాహన పెంచుకొని తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్, సెక్రటరీ భానుమతిలు స్పష్టం చేశారు. శనివారం భద్రాచలం మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ శివం నాయక్ నేతృత్వంలో న్యాయమూర్తుల బృందం సబ్ జైల్ని సందర్శించి విచారణ ఖైదీలతో మాట్లాడి అనంతరం వారికి న్యాయ అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్షణికావేశంలో తప్పులు చేసి జీవితాలను పాడు చేసుకోవద్దని కోరారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ వాయువుని పీల్చుకుంటూ తోటి వారికి సహాయ, సహకారాలు అందిస్తూ సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని, అసాంఘిక కార్యక్రమాలు చట్ట వ్యతిరేక కార్యక్రమాల జోలికి వెళ్లకుండా కుటుంబాలను చక్కబెట్టుకుంటూ మంచి జీవితాన్ని పొందాలని అన్నారు. సబ్‌జైల్ సందర్శనకు వచ్చిన న్యాయమూర్తుల బృందం భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ నేతృత్వంలో గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటా దేవదానం, న్యాయవాదులు నవీన్, సతీష్, దాట్ల సంధ్య, డి.శారద, పి.వెంకటేశ్వర్లు, జైలు సూపర్నెంట్ ఉపేందర్ పాల్గొనగా సబ్ జైల్లో ఖైదీలకు అందుతున్న వసతులు పట్ల న్యాయమూర్తుల బృందం సంతృప్తిని వ్యక్తం చేశారు.



పీవోకు స్పెషల్ అవార్డ్

- గవర్నర్ చేతులమీదుగా స్వీకరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ స్పెషల్ అవార్డును అందుకున్నారు. హైదరాబాదులో శనివారం జరిగిన 15వ నేషనల్ ఓటర్ల దినోత్సవ వేడుకలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా పీఓ అవార్డు స్వీకరించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో బెల్లంపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా బి.రాహుల విజయవంతంగా నిర్వహించిన విధులకు గాను ఈ ప్రత్యేక అవార్డును గవర్నర్ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ నుంచి ప్రత్యేక అవార్డును అందుకున్న భద్రాచలం పీఓని ఐటీడీఏ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన అభివృద్ధికి భద్రాచలం ఐటీడీఏ ద్వారా ఎంతగానో కృషి చేస్తున్న పీఓ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

ఓటర్ల దినోత్సవ వేడుకల్లో మండల విద్యార్థుల ప్రతిభ

- కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు స్వీకరణ



నవతెలంగాణ-అశ్వారావుపేట

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో అశ్వారావుపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 22న మండల స్థాయిలో "నా ఓటు విధిగా వినియోగించు కుంటాను" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 23న కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగిన పోటీల్లో జవహర్ విద్యాలయంకు చెందిన ఎల్.ఏశ్విత సాయి రోషిణి శ్రీ డ్రాయింగ్‌లో మొదటిస్థానం, వ్యాస రచనలో మూడవ స్థానం సాధించగా, నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన డింపుల్ అనే విద్యార్థి ఉపన్యాస పోటీల్లో రెండోస్థానంలో నిలిచారు. విజేతలకు శనివారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఓటర్ల దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బహుమతులు అందించారు. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ఏశ్విత సాయి రోషిణి శ్రీ జూనియర్ విభాగంలో డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో మొదటిస్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. బహుమతులు అందుకున్న చిన్నారులను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

క్రికెట్ పోటీల్లో రాధికా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-మణుగూరు

జిల్లా స్థాయి అండర్-17 క్రికెట్ పోటీల్లో రాధిక కాన్సెప్ట్ పాఠశాల విద్యార్థి వి.రావుల నాయక్ ప్రతిభను చాటాడు. శనివారం పాఠశాలలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థి వి.రాహుల్ నాయక్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో (టీడీసీఏ) (తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్) అండర్-17 ఇంటర్ టీ 20 టోర్నమెంట్‌లో 17లో ఎంపిక చేయబడ్డాడు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపల్, ఎకడమిక్ డీన్, పీఈటీ అభినందనలు తెలియజేశారు.

అశ్వారావుపేట వాసులకు గవర్నర్ అవార్డులు ప్రదానం



నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని రెడ్డిగూడెంకు చెందిన ఉమ్మల సరోజిని, యాట్ల సందీప్ రెడ్డిలను రాజభవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శనివారం అభినందించి, బహుమతులు అందజేసారు. సమాజంలో వెనుకబడిన కొండ రెడ్ల కులస్తులకు ఓటు ప్రాధాన్యత, యువతకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశాల మేరకు రెడ్డిగూడెం నుండి ఇద్దరిని పంపడం జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమానికి ఎంపిక చేసి పంపారు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఉమ్మల చిన్న వెంకటరెడ్డి-పద్మ దంపతుల కూతురు సరోజినీ, యాట్ల పోతురెడ్డి-ధనలక్ష్మి దంపతుల తనయుడు సందీప్ రెడ్డిలు వివరించిన తీరుకు రాజ్ భవన్లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా వారికి అవార్డు ప్రదానం చేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

యువత మంచి అలవాట్లు అలవరచుకోవాలి

- ఇల్లందు డీఎస్పీ చంద్రభాను
- మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

యువత మంచి అలవాట్లను అలవర్చుకోవాలని ఇల్లందు డీఎస్పీ చంద్రభాను సూచించారు. ఈ మేరకు మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన సింగారం గ్రామంలో స్థానిక పోలీస్ శాఖ, వైద్యశాఖ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చుట్టూ కొండలు కోనలు దట్టమైన అడవుల మధ్యలో మండల కేంద్రానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఎటువంటి రవాణా సౌకర్యానికి అందుబాటులో లేని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన బూసరాయి గ్రామంలో వ్యయ, ప్రయాసలతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సింగారం గ్రామంలోని గుత్తి కోయ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వి.సంఘమిత్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామంలోని గుత్తికోయ ప్రజలకు డీఎస్పీ ఉచితంగా రగ్గులు, వంట సామగ్రి, మందులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా యువతకు వాలీబాల్ కిట్‌ను డీఎస్పీ అందజేసి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఈ.రతీష్, మొబైల్ టీమ్ డాక్టర్ కె.శరత్, హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి, స్టాఫ్ నర్స్ సరిత, ల్యాబ్ టెక్నీషియన్ పార్వతి, ఏఎన్ఎం వి.సుగుణ, హెల్త్ అసిస్టెంట్లు శ్రీధర్ బాబు, ఎం.నరేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయం

- ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



చర్ల

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఎమ్మెల్యేగా గెలిచి సంవత్సరం కాలంలోనే భద్రాచలం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అభినందనీయుడని పవర్ బాయ్స్ నాయకులు వల్లపు ప్రేమ్ కుమార్ అన్నారు. శనివారం తెల్లం జన్మదినాని పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పవర్ బాయ్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి కేకును కట్ చేసి మిఠాయిలు పంచారు. తనను అభినం దించడానికి వచ్చిన యువకులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేటి రాజకీయాలకు యువతే కీలకమని దేశ సమగ్రతను కాపాడేందుకు యువకులు రాజకీయాలలోకి రావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు కోరారు. ఈ కార్యక్ర మంలో పవర్ బాయ్స్ సభ్యులు సందీప్, శతకీర్తి సతీష్, సంతోష్, సాయి, వర్మ రేవంత్, తదితరులు పాల్గొన్నారు.

చర్ల : మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ జన్మదిన వేడుకలను టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, పోలిన లంక రాజు నేతృత్వంలో జరిపారు. మండల నాయకులు కార్యకర్తలు తెల్లం వెంకట్రావు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బూరుగడ్డ బసవయ్య, కుమార్ రాజా, మడకం పద్మ, ఇందల బుచ్చిబాబు, తడికల లాలయ్య, ఇర్ప శ్రీనివాస్, ముమ్మినేని అరవిందు, బ్రహ్మానంద రెడ్డి, పటేల్ వెంకటేశ్వర్లు, ఇర్ప వసంతు, ఈశ్వర్, సిరి పురపు శివ లక్ష్మీనారాయణ, గుండెపుడి భాస్కరరావు, తాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
9
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం | జనవరి 26, 2025 | www.navatelangana.com

ఐఎల్‌పీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఆవిష్కరించారు. మహాత్మ పూలే బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనతో ఈ సంఘం నడవడం గొప్ప విషయమని కలెక్టర్ అన్నారు. సమాజంలో సమానత్వమే ప్రతిపాదికగా ఎప్పటికీ ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్, సీనియర్ న్యాయవాదులు జే గోపికృష్ణ, వివి సుధాకర్ రావు, బండ్ల రాజశేఖర్, నరసింహరాజు నరసింహచారి మహిళా న్యాయవాదులు భానుప్రియ, ఎర్రపాటి కృష్ణ, మహిళా న్యాయవాది లక్కినేని వెంకట దుర్గారావు, మారపాక రమేష్ శ్రీరాముల రవి, రామారావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఓటు ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్

- పట్టణ ప్రాంతాల్లో తగ్గుతున్న ఓటింగ్ శాతం
- డీఎస్పీ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-మణుగూరు

ఓటు ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటిదని డీఎస్పీ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. అనంతరం ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం వలస ఆదివాసీ యువకులకు ఓటర్ ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు బీఎల్వోలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో 20 లక్షల ఖర్చుతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లో మామిడి చెట్ల గుంపు, ఎంపీపీ స్కూల్ నందు 10 లక్షల అంచనాతో నిర్మించిన కాంపౌండ్ వాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆదివాసీ నగర్ లో 5 లక్షల ఖర్చుతో సీసీ రోడ్ ప్రారంభోత్సవం ఆదర్శనగర్‌లో ఐదు లక్షల ఖర్చుతో సిసి రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రాఘవ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ యాదగిరి గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ, సైదులు, మహిళ మండల అధ్యక్షులు సౌజన్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం

- తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్

నవతెలంగాణ - అశ్వారావుపేట

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ఆయుధం అని తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్ అన్నారు. ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి జన్మహక్కు అని అనానరు. ఓటు ప్రాదాన్యతను తెలుపుతూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన కూడలి లో మానవహారం నిర్వహించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను తహసీల్దార్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాదరావు, ఎస్సై రామ్మూర్తి, హెచ్‌ఎం పి.హరితతో పాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ పాల్వంచ

పాల్వంచ ముత్తూట్ మినీ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఆధ్వర్యంలో శుక్రవారం రంగాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముత్తూట్ మినీ ఫైనాన్స్ ఆర్‌ఎం వేంకటాద్రి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని అన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ముత్తూట్ మినీ ఫైనాన్స్ గోల్డ్ లోన్ మేనేజర్ ఎస్.రమేష్, కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ సిబ్బంది నజీమ్, పాఠశాల ఉపాధ్యాయులు శశికుమార్, అంగన్వాడీ టీచర్ ఉమ, స్థానికులు వీరన్న, రమేష్, బాలాజీ, రఘురామ్ , విజయ్, వినోద్, భద్రియా తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సత్తుపల్లి

సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండరును సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రహ్లాద్ ప్రాజెక్టు ఇంజినీరు శ్రీనివాసరావు, సీనియర్ పీవో కె. దేవదాస్, సర్వే అధికారి నరేశ్‌తో కలిసి శనివారం ఆవిష్కరించారు. పీవో ఛాంబరులో జరిగిన ఈ ఆవిష్కరణ ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దారా భీమయ్య, పిట్ కార్యదర్శి భాస్కర్‌లాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎన్. రమేశ్, మోతీలాల్, వీరభద్రు, సురేశ్, వినయ్, మంగీలాల్, బాలు, రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు గార్లపాడులో నాలుగు పథకాలు ప్రారంభం

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోనే గార్లపాడు గ్రామంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు పథకాలను లాంచనంగా లబ్ధిదారులకు పంపిణీ చేసి అధికారుల ప్రారంభిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 26 నుంచి మార్చి చివరి వరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ నాలుగు పథకాలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి మండలంలో ఒక గ్రామంలో నూరు శాతం అమలు చేసే దానిలో భాగంగా మండల పరిధిలోని గార్లపాడు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పీహెచ్సీని సందర్శించిన చెన్నై పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ బృందం

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కేంద్ర ప్రభుత్వంలోని చెన్నై పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ బృందం ఆకస్మికంగా సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి ఆసుపత్రులో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించి రోజువారి ఓపితోపాటు డాక్టర్లు చేస్తున్న ఆపరేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల పట్ల చెన్నై బృందం సంతృప్తిని వ్యక్తం చేసినట్లు వైద్యులు తెలిపారు. ఆస్పత్రిని సందర్శించిన బృందంలో రీసెర్చ్ ఆఫీసర్లు మురుగేషన్, చందన్ కుమార్, జిల్లా ఎన్హెచ్‌ఎం నోడల్ అధికారి శ్రీమతి దుర్గ, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ సిహెచ్ రఘురాం, వైద్యాధికారి డాక్టర్ మంగళ, వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగమణి డాక్టర్ అర్జున్ సీనియర్ నర్సింగ్ అధికారులు, నర్సింగ్ అధికారులు, ఫార్మసిస్ట్ లాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ-కూసుమంచి

ముత్యాలగూడెంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ హిందీ మేడం జీవీ కృష్ణకుమారి, చిన్ననాటి మిత్రుడు రాయల కృపాలుడు ఆర్థిక సహకారంతో ముత్యాలగూడెం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ శనివారం ఎంఈఓ వీరాస్వామి పాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. వీటితో పాటు అవసరమైన వస్తువులు పెన్సిల్లు, ఎరేజర్లు, షార్ప్‌నర్లు, పలకలు అందజేయడం జరిగింది. వారి ఉదార స్వభావానికి పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మం జలవనరులశాఖ సీఈగా రమేష్ బాబు





నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జలవనరులశాఖ సీఈగా సూర్యాపేట సీఈ (చీఫ్‌ఇంజనీర్)గా వి.రమేష్ బాబుకు అదనపు బాధ్యలు ఇస్తూ శనివారం జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 31న ఖమ్మం సీఈగా ఉన్న విద్యాసాగర్ పదవీ విరమణ పొందారు. అప్పటి నుండి ఖమ్మం సీఈగా ఎవరిని నియమించకుండా ఖాళీగానే ఉంది. జిల్లాలో జలవనరుల శాఖలో పెద్ద ఎత్తున పనులు జరుగుతున్న నేపథ్యంలో సీఈ పోస్టు కోసం తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలిసింది. పనుల పర్యవేక్షణలో ఇబ్బందులు నెలకొనడంతో తాజాగా గత 26 రోజులుగా ఖాళీగా ఉన్న సీఈ పోస్టులో సూర్యాపేట సీఈకి ఇన్ చార్జీ బాధ్యలు అప్పగించారు.

ఖమ్మం ఏమైంది..?

శనివారం ఉదయం 6 నుంచి 9 వరకూ దాదాపు మూడు గంటల పాటు ఖమ్మం అదృశ్యమైంది. దట్టమైన పొగ మంచు ఆవరించి పెద్ద పెద్ద బిల్డింగులు, అపార్ట్మెంట్లు సైతం కనిపించలేదు. రోడ్లపై వాహనాలను లైట్లు వేసుకొని నడపాల్సి వచ్చింది. ఖమ్మం మున్నేరు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల మీద నుంచి మంచు కురిసే వేళలో తీసిన రమణీయ దృశ్యాలు 'నవతెలంగాణ' పాఠకుల కోసం...







మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జికి వినతి

నవతెలంగాణ-కూసుమంచి



మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. శనివారం కూసుమంచి మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబురు దయాకర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్రం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) కూసుమంచి మండల కమిటీ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వంట కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షురాలు నెల్లూరు కోటమ్మ మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాలుగా వంటలు చేస్తున్న ఉద్యోగ భద్రత లేదనీ, ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని అన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచి పెండింగ్ లో ఉన్న 9, 10 తరగతిలో అల్పాహార బిల్లులు, రాగి జావా కాచిన గ్యాస్ బిల్లులు, గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట సందర్భంలో జరుగుతున్న ప్రమాదాలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తుంబురు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నరసింహ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండెపంగు మల్లేష్, వంట కార్మికులు కంది నందిని, మల్లీశ్వరి, కళ్యాణి, సునీత, లక్ష్మీబాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటే ప్రజాస్వామ్యానికి పునాది

నవతెలంగాణ-ఖమ్మం

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది, సమాజంలో ప్రతి పౌరుడు సక్రమంగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన పౌర బాధ్యతను విద్యార్థులు గుర్తుంచుకోవాలని ప్రముఖ కవి, కాళోజీ అవార్డు గ్రహీత, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సీతారాం అన్నారు. శనివారం ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బిజిఎన్‌ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్.శాస్త్రి అధ్యక్షతన ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్ – పొలిటికల్ సైన్స్-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా "భారతీయ ప్రజాస్వామ్యం-పౌరులబాధ్యత"అనే అంశంపై ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఓటు హక్కును బాధ్యతతో, పారదర్శకంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.ధనమూర్తి, విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.రవివర్ధన్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి పి.నరసింహారావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సునంద, ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్ కన్వీనర్ డాక్టర్ వేణుమాధవ్, అధ్యాపకులు, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ పిచ్చయ్య అప్పారావు, బకష్, ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రాంతి జూనియర్ కళాశాలలో...

వైరాటౌన్ : స్థానిక క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి విద్యా సంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంయోగిత, ఎన్ఎస్ఎస్ పిఓ లింగారావు, ప్రిన్సిపల్ కృష్ణారావు, అధ్యాపకులు వేణు, నాగలక్ష్మి, నరేంద్ర, చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఓటు ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొణిజర్ల : మండల కేంద్రంలో జాతీయ ఓటర్ దినోత్సవ ర్యాలీ విద్యార్థులతో కలిసి అధికారులు శనివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మాజీ ప్రజాప్రతినిధులు అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రోజారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధిర : 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం మధిరలో సివిల్ కోర్ట్ జడ్జ్ కార్తీక్ రెడ్డి, తాహసిల్దార్ రాళ్ల బండి రాంబాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎండిఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీనిధి డిగ్రీ కాలేజ్ నుండి ట్యాంక్బండ్ మీదగా వైఎస్‌ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, బీఎల్ఓ, ఆర్‌పీలు, విద్యార్థులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ పివి రామకృష్ణ అన్నారు. శుక్రవారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా తిరుమలాయపాలెం మండల వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై అధికారులు సిబ్బంది హై స్కూల్ విద్యార్థులు కస్తూర్బాయ్ పాఠశాల, కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్, స్థానిక ఎస్సై కూచిపూడి జగదీష్, డిప్యూటీ తాసిల్దార్ కనకం నరసింహారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, ఎంపీఓ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోసూరు వీరయ్యకు నివాళి

నవతెలంగాణ-తల్లాడ

బాలపేట మాజీ సర్పంచ్ కోసూరు వెంకట నరసింహారావు తండ్రి కోసూరి వీరయ్య ఇటీవల మృతి చెందారు. ఆయన దర్శన కర్మ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని వీరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో దుగ్గిదేవర వెంకటలాల్, దిరిశాల దాసు రావు, జొన్నలగడ్డ కిరణ్, బద్దం కోటిరెడ్డి, ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్

నవతెలంగాణ-మధిర

మధిర మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ ఖమ్మం వారు చేస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సుమారు 60 వేల రూపాయల విలువైన పాఠశాల నేమ్ బోర్డు, సూచిక బోర్డు, సీసీ కెమెరాలను శనివారం ప్రభాకర్ ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదులో సాఫ్ట్వేర్ జాబ్ చేస్తూనే ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం మధిర మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు వివిధ రకాల సౌకర్యాలను అందజేస్తున్న సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు పోతుకూచి కళ్యాణ చక్రవర్తికి, ఫౌండేషన్ సభ్యులకు మండల విద్యాశాఖ తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ పాఠశాల విద్య విద్యార్థి భవిష్యత్తుకు పునాది, కావున అన్ని సౌకర్యాలు సమకూరినట్లయితే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని రంగాలలో రాణిస్తూ ఉన్నత స్థాయికి చేరుకుంటారని, ఆదిశగా సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కొరకు సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి, పాఠశాల ఉపాధ్యాయులు దీవి సాయి కృష్ణమాచార్యులు, సంక్రాంతి శ్రీనివాసరావు ,కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, లావుడ్య రవికుమార్, ఎం వర ప్రసాద్, పగిడిపల్లి ఇస్సాక్, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని రామచంద్రపురం ఎమ్మెల్యే నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. రేగళ్ల రామారావు, నునావత్ వెంకటేశ్వర్లు, తోట రామారావు, కత్తి శివ, చేను సీతారాములు, పులి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న మాక్ పోలింగ్

- ఉత్సాహంగా పాల్గొన్న గ్లోబల్ రెయిన్ బో విద్యార్థులు
- ఓటింగ్ పై అవగాహన కోసమే ఈ కార్యక్రమం
- పాఠశాల కరస్పాండెంట్ ఎర్షాద్ అహ్మద్

నవతెలంగాణ-కూసుమంచి



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్య విలువలు, సహకారం, సమాజం పట్ల బాధ్యత మొదలైన విలువలు పట్ల అవగాహన కల్పించేందుకు కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్‌బో పాఠశాలలో శనివారం నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకుంది. విద్యార్థులంతా ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉదయం 9గంట లనుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పోలింగ్ నిర్వ హించారు. మొత్తం ప్రక్రియను నిజమైన ఎన్నికల లాగే నిర్వహించారు. సాధారణ ఎన్నికల మాదిరిగా ఓటర్ లిస్ట్ ప్రకటించి, తరగతి ఆయా సెక్షన్లకు సంబంధించిన బ్యాలెట్ పేపర్ ముద్రించడం, పోలింగ్ ఏజెంట్ల ఏర్పాటు, పోలింగ్ అధికారి, అసిస్టెంట్ పోలింగ్ అధికారుల నియామకంతో సాధారణ ఎన్నికలకు ఏ మాత్రం తీసిపోకుండా ఎన్నిక నిర్వహించారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో తీసుకునే జాగ్రత్తలు, ఏర్పాట్లు, సిబ్బంది మొత్తం ప్రక్రియ కొనసాగించి ఎలక్షన్ కొనసాగించడంతో సాధారణ ఎన్నికలలో పోలింగ్ పై పూర్తి అవగాహన కలిగినట్లయింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా విద్యార్థులతో నామినేషన్ లు దాఖలు చేయడం, ఉపసంహరణ నిర్వహించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, పోలింగ్ అధికారులుగా విద్యార్థులు విధులు నిర్వహించారు. రెండు రోజుల పాటు ప్రచారం నిర్వహించారు. ఎన్నికల అధికారులు నామినేషన్లు పరిశీలించారు. పోటీలో నిలిచిన విద్యార్థులకు గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులంతా ఓటు వేశారు. ఈ మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులు ఓటరుగా, అభ్యర్థులుగా మారి ప్రచారం నిర్వహించే విధానాన్ని వివరించారు. దీని ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ప్రజాస్వామ్యంపై అవగాహన కలిగి నట్లైంది. విద్యార్థులు బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయడం చాలా బాగుందని తెలియజేశారు . మధ్యాహ్న కౌటింగ్ నిర్వహించారు. స్కూల్ లీడర్ గా కల్యాణి,గర్ల్స్ లీడర్ గా శ్రావణి గెలుపొందారు. విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాడెంట్ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ.. ఓటు రాజ్యాంగం కల్పించినటువంటి హక్కు అని భవిష్యత్తులో ఓటును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఓటును మించిన ఆయుధం లేదు.. నేను కచ్చితంగా ఓటు వేస్తాను

- జాతీయ ఓటర్ల దినోత్సవాన 'మిస్ట్' విద్యార్థుల ప్రతిజ్ఞ

నవతెలంగాణ-సత్తుపల్లి

ఓటును మించిన ఆయుధం ఏదీ లేదని.. నేను కచ్చితంగా ఓటు వేస్తానని సత్తుపల్లి మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాలలో (అటానమస్) శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సత్తుపల్లి డిప్యూటీ తహసీల్దారు శివకుమార్ ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో డీటీ శివకుమార్ విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. ఓటుహక్కుకు మించి ఏదీ లేదని 18 యేళ్లు వచ్చిన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఓటుహక్కు ప్రాధాన్యతపై కళాశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీలో అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను డిప్యూటీ తహసీల్దారు శివకుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ రామచంద్రరావు, ఎన్ఎస్-ఎస్ కో-ఆర్డినేటర్ కె. రామకృష్ణారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణలో మాదిగల జనాభా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జిల్లాల వారీగా వర్గీకరణ చేపట్టాలని మాదిగ జేఏసి వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తి రవి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో మాదిగ జేఏసీ, ఎస్సీ ఉప కులాల సంఘ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిడమర్తి రవి మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పాత చింతకాయ పచ్చడి లాగా 1994 లో ఉన్న డిమాండ్‌కు మూడు దశాబ్దాల కాలం తర్వాత డిమాండ్‌కు ఎంతో వ్యత్యాసం ఉందని విమర్శించారు. మాదిగ జేఏసీ డిమాండ్ ప్రకారం తెలంగాణ మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జిల్లాల వారిగా వర్గీకరణ జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. 30 ఏళ్ల ఉద్యమంలో మాదిగలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఫిబ్రవరి 2న హైదరాబాద్ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థి యువగర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకులు మట్టి గురుమూర్తి, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్, డక్కలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్నే రామారావు, బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షులు మోటం సైదులు, తెలంగాణ మాదిగ పోరాట సంఘం ఎల్ వెంకటేశ్వర్లు, చర్మకారుల అధ్యక్షురాలు ఇటికల లత, వడ్డెర సంఘం నాయకులు బత్తుల నగేష్, రాయల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అన్నదానం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూని యర్ కళాశాలలో బుచ్చిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ ఎర్రమల శ్రీనివాసరెడ్డి కుమారుడు కీర్తిశేషులు రాజశేఖర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు రెంటల రవికుమార్, సీనియర్ అధ్యాపకులు రామారావు, తిరుపతిరెడ్డి, అధ్యాపక అధ్యాప కేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ జిల్లా జట్టుకు పెనుబల్లి క్రీడాకారులు

నవతెలంగాణ-పెనుబల్లి

అండర్ 17 బాలుర క్రికెట్ జిల్లా జట్టు ఎంపికలో పెనుబల్లి మండలం వీఎం బంజరకు చెందిన చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఖమ్మంలో శనివారం జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ జట్టుకు బంజర్‌లోని వివిధ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఖమ్మం రెసిడెన్స్ స్కూల్‌కు చెందిన ఎంఎస్ఎస్ చందు, పెనుబల్లి అరుణోదయ స్కూల్‌కు చెందిన రామ్ చరణ్ సాయి, ముజాహిద్ (రమేష్ స్పై, స్కూల్, ఎస్.కె లక్ష్మి వెంకట్ కుమార్ (మోడల్ స్కూల్), ఎం. మౌనిష్ (గౌట్ కాలేజీ) ఎంపికైన వారిలో ఉన్నారు. హైదరాబాద్‌లో జరిగే టిడిసిఏయు-17లో పాల్గొనేందుకు అవకాశం లభించిందని సీనియర్ ప్లేయర్, మారుతి షెడ్ ఉప్పుశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

సాగులో నష్టాలు.. అప్పుల భారం భరించలేక ఓ రైతు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని వర్తమాన్నూర్ గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వర్తమన్నూర్ గ్రామానికి చెందిన రైతు మైల నర్సయ్య(59) తనకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేసేవాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. ఇప్పటికే పంటలు సరిగా పండక.. పెట్టుబడులు కూడా ఎల్లక అప్పులుండగా.. కుమార్తె వివాహానికి మరికొంత అప్పు చేశాడు. పంటలు సరిగ్గా పండక చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై పొలంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఉపాధ్యాయుడు

- బాలికల దినోత్సవం రోజే ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- ఉపాధ్యాయునిపై సస్పెన్షన్ వేటు

నవతెలంగాణ-బల్మూరు

కోపంలో సహనం కోల్పోయిన ఉపాధ్యాయుడు విద్యార్థినిని చెప్పుతో కొట్టాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు సీరియస్ అయ్యారు. సదరు ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. తరగతి గదిలో శుక్రవారం రిపబ్లిక్ డేకు సంబంధించి రిహార్సల్స్ జరుగుతుండగా.. క్లాస్ తీసుకుంటానని ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆ సమయంలో విద్యార్థులు నవ్వారన్న కోపంతో "నన్ను చూసి నవ్వుతారా" అంటూ ఉపాధ్యాయుడు విద్యార్థిని పైకి చెప్పు విసిరాడు. 9వ తరగతి చదువుతున్న బాధిత విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో శనివారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయున్ని నిలదీశారు. దాంతో వారికి సదరు ఉపాధ్యాయుడు క్షమాపణ చెప్పారు. బాలికల దినోత్సవం రోజే బాలికలపై దాడి చేసిన ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరారు. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, యువకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి సస్పెన్షన్

విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినిని చెప్పుతో కొట్టిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి సీరియస్ అయ్యారు. ఉపాధ్యాయుడిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్‌కు ఫోన్ ద్వారా మౌఖిక ఆదేశాలు జారీ చెయ్యగా, బల్మూరు మండల విద్యాధికారి నివేదిక ఆధారంగా సదరు ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

'దుందుభి'లో ఇసుక తరలింపుపై రైతుల నిరసన

- అక్కడే నడిగడ్డ రైతుల వంటావార్పు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"ప్రభుత్వం నీళ్లు ఇవ్వక పోయినా.. తామే స్వయంగా దుందుభి నది వాగులో ఫిల్టర్ పాయింట్ల ద్వారా బోరుబావులను తవ్వి సాగునీటిని పంట పొలాలకు మళ్లించుకున్నాం.. ఉమ్మడి జిల్లా కరువుతో విలయతాండవం చేస్తున్నా మాకు ఇక్కడ సాగునీరు లభించింది. తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు. ఇప్పుడు అధికారులు ఇబ్బడిముబ్బడిగా ఇసుక తరలింపుకు అనుమతులు ఇస్తుండటంతో సాగునీటి కష్టాలు వచ్చేలా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి" అంటూ నడిగడ్డ రైతులు నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నడిగడ్డ శివారులోని రామగిరి మూలమలుపు వంటావార్పు చేశారు.

ఈ సందర్భంగా బర్ల మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇసుక తరలింపుకు విధానపరమైన నిర్ణయంపై అడిగితే అధికారులు సమాధానం చెప్పడం లేదన్నారు. నిబంధనల మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఇసుకను తరలించాల్సి ఉన్నా రాత్రింభవళ్లు ఇసుకను తోడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలాన్ ఉంటేనే ఇసుక తరలించాల్సి ఉండగా.. ఇసుక వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపుల నుంచి ఇసుక తరలింపుకు టిప్పర్లు వాడుతున్నారని చెప్పారు. దీని వెనుక పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. తమ పంట పొలాలకు సాగునీటి కోసం ఇసుక తరలింపును అడ్డుకుంటా మని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బీరం జగత్ రెడ్డి, బర్ల కాశిరెడ్డి, బర్ల రామచంద్రారెడ్డి, యాకోబ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థపరులు వర్గీకరణను అడ్డుకుంటున్నారు

- శాంతియుతంగా రిజర్వేషన్ సాధించుకుందాం
- లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలతో మన ఆవేదనను చాటుదాం :ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-సిద్దిపేట

సమాజంలో అన్ని వర్గాలు, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, కోర్టులో ఎస్సీ వర్గీకరణ అవసరమని చెబుతుంటే, మాలలు మాత్రం స్వార్థంతో వర్గీకరణను అడ్డుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే మాదిగల సాంస్కృతిక ప్రదర్శన లక్షల డప్పులు.. వేల గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శనివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వద్దని లగడపాటి అంటే.. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ వద్దని వెంకటస్వామి కుటుంబం కోరుతోందని ఆరోపించారు. ఆనాడు చంద్రబాబు నాయుడు వర్గీకరణకు అనుకూలంగా ఉంటే, మన జాతి మద్దతు ఇచ్చిందని, తరువాత వర్గీకరణ జరిగిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సుప్రీంకోర్టు తీర్పు అని చెప్పి వర్గీకరణను నిలిపివేసిందన్నారు. ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, నరేంద్ర మోడీ వర్గీకరణకు మద్దతు ఇవ్వడంతో ఆయన వద్దకు మనం పోవాల్సి వచ్చిందని, వారికి మద్దతు ఇచ్చామన్నారు.

కానీ నాటి నుంచి కాంగ్రెస్ పార్టీలో మాలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో వారు వర్గీకరణను అడ్డుకుంటున్నారని విమర్శించారు. మల్లు, వెంకటస్వామి కుటుంబాలు అడ్డు పడుతున్నాయన్నారు. లక్ష డప్పుల ద్వారా మన ఆవేదనను ప్రపంచానికి తెలియజేస్తామంటే, వారు లక్ష బరిసెలు, కర్రలు అంటున్నారని, మనం శాంతియుతంగా అంటే, వారు తొడలు కొడుతున్నారని విమర్శించారు. శాంతియుతంగా వర్గీకరణను సాధించుకుందామన్నారు. తన ఎదుగుదలలో మాదిగల పాత్ర ఎంతో ఉందని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. నేడు కొంతమందికి భయపడి వర్గీకరణను ఆలస్యం చేస్తున్నారని, అందుకే తాను మరోసారి రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని అన్నారు. తనకు అనేక పార్టీలు పదవులు ఇస్తామని ప్రకటించినా, భవిష్యత్ తరాలకు మూలమైన వర్గీకరణ కోసమే తాను ఈ నల్ల కండువాను విడిచిపెట్టలేదని చెప్పారు. ఫిబ్రవరి 7న ప్రతి ఇంటి నుంచి ఒక డప్పు రావాలని, మన ఆవేదనను ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముంద్రాతి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, నాయకులు పరశురాములు, శ్రీనివాస్, యాదగిరి, శేఖర్, రమేష్, భాస్కర్, ప్రకాష్, యాదగిరి, రాములు, రాజు, పవన్ కళ్యాణ్, ప్రసాద్, కనకరాజు పాల్గొన్నారు.

బ్యాంకులను ప్రయివేటీకరించొద్దు

- లేని పక్షంలో పోరాటాలు, సమ్మెలు : కేంద్రానికి ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం
- పెట్టుబడిదారీ విధానం పెరిగితే దేశానికి ప్రమాదం: ప్రొఫెసర్ బాబు మాథ్యూస్
- ఏపీటీబీఈఎఫ్ 30వ త్రైవార్షిక మహాసభ ప్రారంభం



ప్రస్తుత బడ్జెట్లో కేంద్రం హామీ ఇవ్వాలి

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశంలో జాతీయ బ్యాంకులను ప్రయివేటీకరించబోమని 2025-26 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని అఖిల భారత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ప్రధాన కార్యదర్శి సిహెచ్. వెంకటాచలం డిమాండ్ చేశారు. బ్యాంకుల ప్రయివేటీకరణ, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను పాలకులు వీడకుంటే పోరాటాలు, సమ్మెలు చేయడానికి బ్యాంకింగ్ ఉద్యోగులు వెనుకాడ బోరని హెచ్చరించారు. హైదరాబాద్ కాచిగూడలోని కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావు హాల్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీటీబీఈఎఫ్) రెండ్రోజుల 30వ త్రైవార్షిక మహాసభను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రయివేటీకరించడ మంటే ప్రజలు పొదుపు చేసిన దాదాపు రూ.280 లక్షల కోట్ల ప్రజాధనాన్ని ప్రయివేటీకరించడమేనన్నారు. జాతీయ బ్యాంకులు సరిగ్గా పని చేయకపోతే లక్షల కోట్ల లాభాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం వచ్చినా భారత దేశం ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకుని నిలబడ గలిగిందంటే అది.. ప్రభుత్వరంగ బ్యాంకుల వల్లనేనన్నారు. బ్యాంకుల సేవలు, అవసరాలు, ఖాతాదారుల సంఖ్యకు అనుగుణంగా క్లరికల్, కిందిస్థాయి సిబ్బందిని నియమిం చాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల పనితీరును సమీక్షించే చర్యలకు పాల్పడితే సమ్మె తప్పదని హెచ్చరించారు.

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (బెంగళూరు) ప్రొఫెసర్ బాబు మాథ్యూస్ మాట్లాడుతూ.. ఏకీకృత పెట్టుబడి దారీ విధానం మరింత పెరిగితే దేశానికి, ప్రజలకు అత్యంత ప్రమాదమని చెప్పారు. లేబర్ కోడ్ పూర్తిస్థాయిలో అమలు చేస్తే భవిష్యత్‌లో సమ్మెలు చేసే పరిస్థితే ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడీబీఐ లాంటి బ్యాంకుల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు ఇచ్చి ఉత్పాదక రంగంలో ఉద్యోగాల ను, ఉపాధి అవకాశాలను పెంపొందించి నిరుద్యోగాన్ని తొలగించే చర్యలను ప్రభుత్వం చేపట్టడం లేదని విమర్శించారు. ఆలిండియా ప్రొగ్రెసివ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ యుగల్ కిషోర్ రాయలు మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియా, స్టీల్ అథారిటీ లాంటి సంస్థల్లో వీఆర్ఎస్ వల్ల దాదాపు ప్రయివేటీకరణ జరిగిపోయాయ న్నారు. పది లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి పోరాడిన ఫలితంగా బ్యాంకుల ప్రయివేటీకరణ ఆగిపోయిందని, ఇదే స్ఫూర్తి ఇతర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కార్మికులు ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఏపీటీబీఈఎఫ్ ప్రధాన కార్యదర్శి, ఏఐబీఈఏ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు స్వాగతోపన్యాసం చేశారు. ఏపీటీబీఈఎఫ్ అధ్యక్షులు టి.రవీంద్ర నాథ్ మహాసభకు అధ్యక్షత వహించగా, ఏఐబీఈఏ జాతీయ సంయుక్త కార్యదర్శి వంక ఉదయ్ కుమార్ ఏపీటీబీఈఎఫ్ సంయుక్త కార్యదర్శి పివి.కృష్ణారావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, కమీషన్ల చాటున 'గంగుల' రాజకీయం

- కరీంనగర్ ఎమ్మెల్యేపై మేయర్ సునీల్‌రావు సంచలన వ్యాఖ్యలు
- కేంద్ర మంత్రి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిక
- మేయరే అవినీతి తిమింగలం : బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- ఎక్కడ అధికారం ఉంటే అక్కడికెళ్లే చరిత్ర సునీల్‌రావుది.. : ఎమ్మెల్యే గంగుల



నవతెలంగాణ -కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'నా జోలికొస్తే గంగుల కమలాకర్ అవినీతి, అక్రమాల బండారం బయటపెడతా. కరీంనగర్‌లో చోటుచేసుకున్న ప్రతి స్కాం వెనుక ఎమ్మెల్యేనే ఉన్నారు. ఏ టెండర్ వచ్చినా అందులో ఎంత కమీషన్ వస్తుందన్నదే ఆలోచనే. బినామీలతో అన్ని రకాల కాంట్రాక్టు పనులు చేయిస్తూ దోచుకున్నారు' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై మేయర్ వై.సునీల్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచే మేయర్‌గా పని చేసిన ఆయన శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఏ షరతూ లేకుండానే బీజేపీలో చేరుతున్నానని, సామాన్య కార్యకర్తగానే పని చేస్తానని అన్నారు. ఇదే సమయంలో ఇన్నాళ్లూ తాను ఉన్న బీఆర్ఎస్ పార్టీలోని స్థానిక ఎమ్మెల్యే టార్గెట్‌గా సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మేయర్ పదవి రావడానికి ప్రధాన కారణం వినోద్ కుమార్ అని, అడ్డుకున్నది మాత్రం గంగుల కమలాకరేనని ఆరోపించారు. అవమానాలు దిగమింగుకుని బీఆర్ఎస్‌లో ఐదేండ్లు పని చేశానన్నారు. స్మార్ట్ సిటీ నిధులు బండి సంజయ్ తెచ్చారని వాస్తవాలు చెబితే గంగులకు ఎందుకు కోపం అంటూ ప్రశ్నించారు. గంగులకు, బండి సంజయ్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందంటూ వ్యాఖ్యానించారు. ఏనాడూ తనకు ఫలానా పని కావాలని కూడా అడగని క్లీన్ హిస్టరీ ఉన్న సంజయ్ వెంట నడించేందుకే సిద్ధమై బీజేపీలో చేరానంటూ చెప్పుకొచ్చారు.

మేయరే అవినీతి తిమింగలం : బీఆర్ఎస్ కార్పొరేటర్లు

ఐదేండ్లు మంచివాడిగా నటిస్తూ వచ్చిన మేయర్ సునీల్‌రావు తన పదవీకాలంలో రూ.కోట్లు కూడబెట్టుకున్నారని, ఆయనే అతిపెద్ద అవినీతి తిమింగలం అని బీఆర్ఎస్ కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షులు హరిశంకర్ సహా పలువురు కార్పొరేటర్లు శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సునీల్‌రావు బీజేపీలోకి వెళ్తున్నాడని ఐదు నెలల కిందటే చెప్పామని, ఆయన ద్రోహం, రాజకీయ వ్యభిచారం, వెన్నుపోటు, అవినీతి రాజకీయాల అస్త్రాలతోనే పని చేశారని విమర్శించారు. అధికార పార్టీలో ఉండాలన్న తపనతోనే బీజేపీలో చేరాడన్నారు. గతంలో కాంగ్రెస్ ఉన్నప్పుడు చేసిన వెన్నుపోటు రాజకీయాలతోనే ఆ పార్టీ వాళ్లు దగ్గరికి రానియ్య లేదని, అందుకే ప్రత్యామ్నాయంగా ఎంపీ సంజయ్ పంచన చేరి బీజేపీలోకి వెళ్లాడని అన్నారు. సునీల్‌రావును మేయర్‌గా బోయినపల్లి వినోద్ కుమార్ చేస్తే.. ఐదేండ్లు ఎమ్మెల్యే గంగులనే సహాయ సహకారాలు అందించిన విషయం మరిచావా? అంటూ ప్రశ్నించారు.

ఎక్కడ అధికారం ఉంటే అక్కడికెళ్లే చరిత్ర సునీల్‌రావుది.. ఎమ్మెల్యే గంగుల కమలాకర్

రెండున్నర దశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉన్న సునీల్‌రావు ఆ పార్టీ అధికారం కోల్పోగానే.. అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌లోకి దొడ్డిదారిన వచ్చాడు. అప్పుడే ఆయన గురించి పార్టీ పెద్దలకు చెప్పాను. ఆయన మేయర్‌గా చేసిన కాలంలో చాలా ఫిర్యాదులు వచ్చాయి. అప్పుడు మేము పెద్దగా దృష్టి సారించలేదు. ఇప్పుడు వాటన్నింటిపై విచారణ చేసేందుకు దృష్టిసారిస్తాం' అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మేయర్ వ్యాఖ్యలపై స్పందించారు. గౌరవంగా పార్టీని వీడి వెళ్లిపోవాలిగానీ, అనవసరంగా తనపై ఆరోపణలు చేస్తే మైలేజ్ రాదని హితవు పలికారు. తన సహకారం లేదని, అవినీతి చేశాడని చెబుతున్న ఆయన.. తమ పార్టీలో ఉన్నన్ని రోజులూ తన పేరే జపించిన విషయం తెలియదా? అంటూ ప్రశ్నించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి వాళ్లు వెళ్లిపోవడం వల్ల బీఆర్ఎస్‌కు పట్టిన కొన్ని శనీశ్వరులను వదిలించుకున్నట్టే అవుతుందని అన్నారు.

సోదరికి కేసీఆర్ నివాళి

- మేడ్చల్ జిల్లా పూడూరులో అంత్యక్రియలు
- హాజరైన కేటీఆర్, హరీశ్‌రావు, కవిత



నవతెలంగాణ- మేడ్చల్

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోదరి చీటి సకలమ్మ(82) శుక్రవారం రాత్రి కన్నుమూసిన సంగతి తెలిసిందే. శనివారం మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామంలోని ఆమె కుమారుడి నివాసంలో మృత దేహానికి సీఎం కేసీఆర్ నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులను ఓదార్చారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. అనంతరం పూడూరు శ్మశానవాటికలో సకలమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దేవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్ రెడ్డి, బాల్క సుమన్, కార్పొరేషన్ మాజీ చైర్మెన్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్ యాదవ్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, భాస్కర్ యాదవ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సకలమ్మ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌కు ఆమె 5వ సోదరి. సకలమ్మ స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర. ఆమె భర్త హన్మంతరావు కొన్నేండ్ల కిందటే మృతిచెందారు. వారికి ముగ్గురు కుమారులు సంతానం.

అంబేద్కర్ వల్లే ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-జనగామ

భారతదేశంలో ప్రతి పౌరునికీ ఓటు హక్కు కల్పించింది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం ఓటర్ల దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో వందే మాతరం స్టూడెంట్ ఫెడరేషన్, జిల్లా ఉద్యమకారుల ఆధ్వర్యంలో మంగళంపల్లి రాజు అధ్యక్షతన జనగామ చౌరస్తాలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి బక్కి వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలందరూ కుల, మతాలకతీతం గా ఓటు వేయడానికి అంబేద్కరే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు విజయ్, పానుగంటి ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు సువార్త, వీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నల్ల రాహుల్, నాయకులు వేంపటి అజయ్, సల్ల మహేష్, యాదగిరి, నరేష్ పాల్గొన్నారు.

రోడ్డెక్కిన వేరుశనగ రైతులు

మద్దతు ధర ప్రకటించాలని ఆందోళన

- వ్యాపారస్తులు సిండికేట్ అయి ధర తగ్గిస్తున్నారని ఆవేదన
- వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డు వద్ద ఘటన



నవతెలంగాణ-పరిగి

పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ వేరుశనగ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ యార్డు వద్ద శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చుట్టుపక్కల ప్రాంతాల రైతులు, ఇతర జిల్లాల నుంచి రైతులు శుక్రవారం ఉదయం పరిగి మార్కెట్‌కు వేరుశనగ పంటను తీసుకొచ్చారు. శుక్రవారం ఈనాం వెబ్‌సైట్ మొరాయించడంతో అధికారులు ట్రేడింగ్ నిర్వహించలేదు. శనివారం మధ్యాహ్నం ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించగా రూ.4,400 నుంచి రూ.5,800 ధర పలికింది. దాంతో మద్దతు ధర రావడం లేదని రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డులోని దుకాణ సముదాయాలన్నీ మూయించి ఆందోళన వ్యక్తం చేశారు. ధర తగ్గడంపై అధికారులను నిలదీయగా సరైన సమాధానం చెప్పక పోవడంతో రైతులు రోడ్డెక్కారు. హైదరాబాద్-బీజాపూర్ హైవేపై బైటాయించి నిరసన తెలిపారు. వేరుశనగ క్వింటాలుకు రూ.6,783 ధర ఉంటే ఇక్కడ రూ.4 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పరిగి మార్కెట్ యార్డులో ట్రేడర్లంతా సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారని రైతులు ఆరోపించారు. అధికారులు వచ్చి హామీ ఇస్తేనే తప్ప అక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించి కూర్చు న్నారు. అధికారులు రైతులకు నచ్చజెప్పి మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. మద్దతు ధరపై మార్కెట్ కార్యదర్శిని నిలదీశారు. గందరగోళం ఏర్పడటంతో రైతులు మరోసారి రోడ్డు పై బైటాయించారు. దాంతో మార్కెట్ కార్యదర్శి ఇంతకుముందు జరిగిన ట్రేడింగ్‌ని క్యాన్సల్ చేసి, మరోసారి ట్రేడింగ్ నిర్వహిస్తామని చెప్పారు. లేదా ఉన్నతాధికారులతో మాట్లాడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేలా చూస్తానని చెప్పడంతో రైతులు శాంతించారు. వేరుశనగ పంటకు మద్దతు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు.

ఎలక్ట్రికల్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం

- సుమారు రూ. కోటి ఆస్తి నష్టం
- రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఎలక్ట్రికల్ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించి, సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోడ ప్రాంతంలోని హైదర్‌గూడలో గతేడాది ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభమైంది. శనివారం ఉదయం షోరూం యజమానులు పూజ చేసి బయటకు రాగానే లోపల ఒక్కసారిగా పొగలు, మంటలు వచ్చాయి. క్షణాల్లో అక్కడ ఉన్న ఎలక్ట్రికల్ బైకులు పేలయాయి. అందులో పని చేస్తున్న వారు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సుమారు గంటపాటు కష్టపడి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చింది. ఎలక్ట్రికల్ బైకులు ఒకదాని తర్వాత ఒకటి పేలడంతో ఆ ప్రాంతం మొత్తం దట్టమైన పొగ వ్యాపించింది. 45 ఎలక్ట్రికల్ బైకులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు కోటి రూపాయలు ఆస్తి నష్టం సంభవించిందని యజమానులు చెప్పారు. ఈ ఘటనకు షార్ట్ సర్క్యూట్ కారణమా, లేదా ఎలక్ట్రికల్ బ్యాటరీ సమస్యనా.. అని పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

- చనాక-కోరాట బ్యారేజీ పనులను ప్రారంభించాలి : మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తామని హామినిచ్చిందని, కానీ ఇప్పుడు ఊసెత్తడం లేదని మాజీ మంత్రి, రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయన కమిటీ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేసేందుకు ఆదిలాబాద్‌కు వచ్చిన కమిటీ సభ్యులతో కలిసి ఆయన శనివారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చనాక-కోరాట బ్యారేజీ నిర్మాణాన్ని పూర్తి చేసిందని, మెయిన్ కెనాల్ కూడా పూర్తయిందని, మిగతా పనులను కాంగ్రెస్ సర్కారు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై తాపత్రయం లేదని విమర్శించారు. ప్రభుత్వ పట్టింపు లేనితనం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు, ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకుండా కుంటి సాకులు చెబుతోందన్నారు. చనకా- కోర్ట ప్రాజెక్టు పూర్తిపై బీజేపీ ఎమ్మెల్యేలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, మాజీ మంత్రులు జోగు రామన్న, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే సమస్యలెందుకు!?

బ్యారేజీపై కాంట్రాక్టర్లకు కాళేశ్వరం కమిషన్ ప్రశ్న



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాజెక్టుల పనులు ప్రారంభించే ముందు అన్ని అంశాలను పూర్తిస్థాయిలో సరిచూసుకోవాల్సిన బాధ్యత నిర్మాణసంస్థలపై లేదా అని కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. టెండర్ల వ్యవహారం అసమగ్రంగా ఉన్నప్పుడు వాటి గురించి ప్రభుత్వాన్ని ఎందుకు సంప్రదించలేదని అడిగారు. ముందేజాగ్రత్తలు తీసుకుని ఉంటే నష్టం జరిగేది కాదని వ్యాఖ్యానించారు. అన్నారం బ్యారేజీని నిర్మించిన ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులు నాగ మల్లిఖార్జునరావు, శేఖర్‌దాస్ కాళేశ్వరం కమిషన్ ఎదుట శనివారం విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలుచేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. పనులకు సంబంధించిన ఒప్పందాలు, అందులోని అంశాలు, పనుల ప్రారంభం, ఆలస్యానికి గల కారణాలు, తలెత్తిన సమస్యలు, తీసుకున్న చర్యలు తదితర అంశాలపై వారిని కమిషన్ చైర్మెన్ ప్రశ్నించారు.

బ్యారేజీ ప్రతిపాదిత లోకేషన్ మార్చడం, భూమి అప్పగింతలో ఆలస్యం జరగడంతోనే పనుల ప్రారంభానికి కొంత సమయం పట్టిందని ఆఫ్కాన్స్ ప్రతినిధులు వివరించారు. సైట్‌కు వెళ్లేందుకు మార్గంకూడా లేకపోవడంతో ఏడాదిపాటు ప్రయివేటు వ్యక్తుల నుంచి భూములు లీజుకు తీసుకున్నట్టు తెలిపారు. ముఖ్యమైన పనులు చేసే క్రమంలో అన్ని అంశాలను పూర్తిస్థాయిలో చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. కేవలం కాంట్రాక్టు, డబ్బులు వస్తున్నాయి కదా అని మాత్రమే చూసుకుంటే ఎలా అని కమిషన్ ప్రశ్నించిందని చెప్పారు. వందేండ్లు ఉండాల్సిన బ్యారేజీలో ఏడాదికే సమస్యలు ఎందుకు వచ్చాయని కమిషన్ అడిగింది. ఈపీసీ ఒప్పందం అయి ఉంటే సర్వే సహా అన్ని అంశాలను తామే చూసుకునే వాళ్లమని ఆఫ్కాన్స్ ప్రతినిధులు చెప్పారు. ప్రొటెక్షన్ వర్క్స్ విషయమై నీటిపారుదల శాఖతో సంప్రదింపులు చేసినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ, ధవళేశ్వరం బ్యారేజీ తరహా ప్రొటెక్షన్ వర్క్స్ గురించి చర్చించినట్టు పేర్కొన్నారు. సీసీ బ్లాకులు దెబ్బతిన్న తర్వాత కన్సల్టెన్సీతో అధ్యయనం చేయించామనీ, ఆ సిఫారసులపై నీటి పారుదలశాఖ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అన్నారం ఆనకట్టకు ఎలాంటి పగుళ్లు రాలేదనీ, ఒకసారి సీపేజీ సమస్య వస్తే వెంటనే గ్రౌటింగ్ చేసి అరికట్టినట్టు ఆఫ్కాన్స్ ప్రతినిధులు కమిషన్‌కు తెలియజేశారు.



భారత రాజ్యాంగానికి 75 ఏండ్లు. రాజ్యాంగాన్ని దేశానికి శక్తివంతమైన దారి దీపిక అనొచ్చేమో! దేశ కాలమాన పరిస్థితులు బట్టి ఎప్పటికప్పుడు అధునాతనం అవుతున్న రాజ్యాంగ ప్రధాన ఉద్దేశం దేశాన్ని గణతంత్ర, ప్రజాస్వామ్య రాజ్యంగా మార్చడం. రాజ్యాంగం ఉనికిలోకి వచ్చి మార్గం చూపుతున్న విధంగా మహిళల నడక సాగుతున్నదా? ఆమె జీవితం ఆత్మగౌరవంతో సాగుతున్నదా? విద్య, ఆరోగ్య, రాజకీయ రంగాల్లో సమ భాగస్వామ్యం పొందుతున్నదా? సామాజిక న్యాయం, ఆర్థిక న్యాయం అందుకుంటున్నదా? రాజ్యాంగ శిల్పులు ఊహించిన విధంగా ప్రజలలో మహిళను భాగంగా చూస్తున్నారా? అసలు రాజ్యాంగం మహిళలకు ఏమిచ్చింది? క్లుప్తంగా చర్చిద్దాం.



రాజ్యాంగం ఆమెకేమిచ్చింది?

భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ మహిళల స్థితిగతులపై ఆలోచించి మహిళల సాధికారత కోసం కృషి చేశారు. ఆయన దృష్టిలో మహిళలు కేవలం గృహిణులు కాదు. సమాజంలో సమాన భాగస్వాములు. అందువల్లనే భారత రాజ్యాంగంలో మహిళలకు సమానత్వం, గౌరవం కల్పించడానికి అనేక ఏర్పాట్లు చేశారు. తద్వారా మహిళల సాధికారత సాధ్యమవుతుందని భావించారు.

అందులో ముఖ్యమైనవి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వం, ఆర్టికల్ 15 వివక్ష లేని హక్కు, ఆర్టికల్ 16 మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు లభించేలా రాజ్యాంగం నిర్దేశించింది. ఆర్టికల్ 39 సి మహిళా ఉద్యోగినులు దోపిడీకి గురికాకుండా కాపాడటం, ఆర్టికల్ 39(ఎ) మహిళలకు సమానంగా వేతనం, ఆర్టికల్ 42 ఉచిత ప్రసూతి సెలవులు ఇవ్వాలని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. అంబేద్కర్ మహిళల కోసం చేసిన కృషి వల్లనే మహిళల స్థాయిని పెంచే విడాకులు వంటి హక్కులు కల్పించే హిందుకోడ్ బిల్లు వచ్చింది. అనేక సామాజిక అన్యాయాలకు, అసమానతలను నిర్మూలిస్తూ కొన్ని సంస్కరణలకు కారణమైంది. మహిళల విద్యను ప్రోత్సహించింది. హిందూ వివాహ చట్టం 1955, హిందూ వారసత్వ చట్టం - 1956, వరకట్న నిషేధ చట్టం-1961, కుటుంబ న్యాయస్థానాల చట్టం 1984, మహిళల అసభ్య ప్రదర్శన నిషేధ చట్టం -1986, 2005 మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం, లైంగిక వేధింపుల చట్టం 2013 వంటి సదుపాయాలున్నాయి. పంచాయితీ రాజ్, నగరపాలక సంస్థల్లో మహిళలకు 50 % రిజర్వేషన్లు ఉన్నాయి. మహిళల హక్కుల రక్షణ, భద్రత సంబంధించిన అంశాల పరిరక్షణకు జాతీయ మహిళా కమిషన్ కృషి చేస్తుంది.



మనకున్న చట్టాలు కొంత వరకు సహాయపడిన్నాయి. కానీ అనుకున్న ఫలితాలు సాధించగలుగుతున్నామా? లేదు, మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు అనేక సవాళ్ల ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న దాడులు

ఉద్యోగ అవకాశాలు, వేతనాలు, సామాజిక గుర్తింపు వంటి అనేక విషయాల్లో లింగవివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళలపై గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి సుడిగుండాల్లో చిక్కి విలవిలలాడుతూనే ఉన్నారు. ఉదాహరణగా బిల్కిస్ బానో కేసు తీసుకుందాం. 2002లో గుజరాత్ అల్లర్లలో గర్భవతిగా ఉన్న బిల్కిస్ బానో, ఆమె కుటుంబ సభ్యులపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్యలు సంచలనం కలిగించిన విషయం అందరికి తెలిసిందే. ఆమె ఎన్నో ఏండ్లు న్యాయం కోసం పోరాడింది. నిందితులకు శిక్ష పడింది. కానీ ఏం లాభం? గుట్టుచప్పుడు కాకుండా క్షమాభిక్ష పేరుతో హంతకులైన నేరస్థులను గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసింది. అంతేకాదు పూలదండలతో ఆహ్వానం పలికింది. దీంతో బిల్కిస్ బానో, మానవ హక్కుల సంస్థలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయం రద్దయింది. ఈ కేసు దేశ మహిళల భద్రత, న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకానిచ్చింది. ఈ మధ్య కాలంలో ఎన్ని సవాళ్లు, ఎన్ని అవమానాలు, ఎంత యాతన? దానికి బాధ్యులెవరు? దేశంలో మహిళల మాన ప్రాణాలకు రక్షించాల్సిన ఆ రాష్ట్ర ప్రభుత్వం నేరస్థుల పక్షాన నిలబడటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం కాదా?



చైతన్యం కావాలి

ప్రస్తుతం కోట్లాది పోరాడి సాధించుకున్న మహిళల హక్కులు కోల్పోయే తిరోగమన దిశగా అడుగులు పడుతున్నాయి. జన జీవనంలోకి చొచ్చుకొచ్చి నియంత్రిస్తున్న మతం కోరలు చాచి వికటాట్టహాసం చేస్తున్నది. మహిళల శ్రేయస్సుకు ముప్పు కలిగించే మతం కోరలు పీకి, భారతీయ మహిళ రాజ్యాంగం తనకు కల్పించిన హక్కులు, చట్టాలు అందుకోవాలి. సమాజంలో అన్ని రకాల వివక్షతలు పోయి సమస్థానం, గౌరవమర్యాదలు అందుకొని ఉన్నతంగా ఎదిగే రోజు రావాలి. ఇది జరగాలంటే రాజ్యాంగ పరమైన హక్కులతో పాటు ప్రజల్లో అవగాహన, చైతన్యం రావాలి. అందుకు పౌర సంస్థల, ఉద్యమ సంస్థల కృషి మరింత అవసరం.

మహిళలు ఇంటికే పరిమితమా..?

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం నానాటికీ దిగజారిపోతున్నది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కోరుతూ ముప్పై ఏండ్లకు పైగా పోరాటం చేయాల్సి వచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల ముందు సెప్టెంబర్ 28, 2023లో బిల్లు వచ్చినప్పటికీ అమలు కాలేదు. మహిళలు సమాజంలో తమ స్థితి మెరుగుపడటం కోసం, తమ హక్కుల కోసం పోరాడి కొన్ని చట్టాలు సాధించుకున్నారు. కానీ మహిళల స్థితిగతుల్లో రావలసిన మార్పు రాకపోవడానికి కారణం ఏంటి? మహిళలను కేవలం గృహిణులుగానే చూసే సామాజిక దృక్పథం కొనసాగుతూనే ఉంది. అందుకు ఎల్ డ టి చైర్ పర్సన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు మంచి ఉదాహరణ. వారాంతపు సెలవు ఎందుకు? ఇంట్లో పెళ్ళాం ముఖం ఎంత సేపని చూస్తారు? అని అతని వ్యాఖ్య. ఉద్యోగులంటే పురుషులేనా? మహిళలు కాదా? మహిళలు చేసే ఉద్యోగానికి విలువ లేదా? మహిళ గృహిణిగా మాత్రమే ఉండాలా? ఏమిటీ ధోరణి? ఎందుకిలా మాట్లాడుతున్నారు? మన సమాజం పురుషస్వామ్య సమాజం. మహిళల్ని గృహిణులుగా మాత్రమే చూసే దృక్పథం ఇప్పటికి బలంగా ఉంది.

ఇవే కారణాలు...


సామాజిక సాంస్కృతిక విలువలు అంటే ఆచారాలు, సంప్రదాయాలు మహిళల అభివృద్ధికి అడ్డంగా నిలిస్తున్నాయి. అందువల్లే చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగే బిల్లు చట్టం రావడానికి ముప్పై ఏండ్లకు పైనే పట్టింది. ఇక చేసుకున్న చట్టాల అమలులో ఉన్న లొసుగులు, లోపాలు, పోలీసులు న్యాయస్థానాలు మహిళల ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించక పోవడం, నిందితులకు తగిన శిక్షలు పడకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా లేకపోవడం వల్ల పురుషులపై ఆధారపడి పోరాడే శక్తి కోల్పోతుంది. ముఖ్యంగా మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు కాకపోవడానికి, జెండర్ అసమానతలు తొలగక పోవడానికి కులం, మతం పితృస్వామ్యం వంటి సామాజిక సాంస్కృతిక కారణాల పాత్ర ప్రధానమైనది.

స్వేచ్ఛను కట్టడి చేస్తున్నాయి

మన దేశంలో ఉన్న అన్ని మత గ్రంథాల్లో పురుషుల కంటే మహిళలు తక్కువ అన్న భావన కనిపిస్తుంది. పురుషులకు సేవ చేయడమే మహిళ కర్తవ్యం అని నమ్మే మత సాంప్రదాయాలు, కుల కట్టుబాట్లు మహిళా స్వేచ్ఛను కట్టడి చేస్తున్నాయి. మహిళలను సమాజానికి దూరం చేస్తున్నాయి. కులగౌరవం కాపాడాలనే పేరుతో మహిళల చదువు, ఉద్యోగాలకు అనుమతించకుండా బాల్యవివాహాలు చేస్తున్నారు. కులం తప్పి మరో కులం/మతం వారిని పెండ్లి చేసుకుంటే పరువు హత్యలకు పాల్పడటం, మత నాయకులు, కుల పెద్దలు మహిళల హక్కులు వ్యతిరేకిస్తూ తీర్పు చెప్పడం, ప్రచారం చేయడం వంటివన్నీ రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడిచేవే.

సమాజం సవ్యంగా సాగుతుందా?

పితృస్వామిక భారతీయ సమాజంలో పురుషులదే నిర్ణయాధికారం. మహిళ గృహిణి మాత్రమే. విద్య, ఆరోగ్య, ఆస్తి హక్కులు అంతంత మాత్రమే. ఒకరిద్దరు కంపెనీ సిఇఓలను లేదా నిర్ణయాధికారంలో ఉన్న మహిళలను చూపించి అది మహిళాభివృద్ధి, లింగ సమానత్వం అనుకుంటే పొరపాటే. మహిళలకు తగిన గుర్తింపు, సమాన అవకాశాలు, ఆర్థిక సమానత్వం లేని వ్యవస్థలో, మహిళలకు రక్షణలేని, మానవ విలువలు అడుగంటుతున్న సమాజం సవ్యంగా సాగుతుందా? సాగదు. మరింత వెనుకబడిపోతుంది. స్త్రీని సమాజాభివృద్ధిలో భాగస్వామిగా చేసిన సమాజం ముందుకు పోతుంది.



- వి. శాంతి ప్రబోధ

పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం



న్యూఢిల్లీ : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా 2025 ఏడాదికి గానూ కేంద్రం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించినవారిని ఈ ప్రతిష్టాత్మక అవార్డులకు ఎంపిక చేసింది. ఏడుగురిని పద్మ విభూషణ్, 19 మందిని పద్మ భూషణ్, 113 మందిని పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. పద్మ అవార్డుల్లో ఏడుగురు తెలుగువారున్నారు. వీరిలో తెలంగాణ నుంచి ప్రఖ్యాత వైద్యులు దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి.. పద్మ విభూషణ్‌కు ఎంపికయ్యారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ వరించింది. ఇక ఏపీ నుంచి కళల విభాగంలో సినీనటుడు బాలకృష్ణ పద్మభూషణ్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన టీడీపీ హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. బ్రెజిల్‌కు చెందిన వేదాంత గురు జోనస్ మాశెట్టి, కువైట్‌కు చెందిన షేకా ఏజే అల్ సబాహ్, నేపాల్‌కు చెందిన నరేన్ గురుంగ్‌లు పద్మశ్రీ అవార్డులకు ఎంపికైనవారిలో ఉన్నారు.

ప్రతి ఏటా రిపబ్లిక్ డే సందర్భంగా పద్మ అవార్డులను ప్రకటిస్తారు. పద్మ అవార్డులను పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అనే మూడు విభాగాల్లో కేంద్రం అందిస్తుంది. కళల, సమాజ సేవ, ప్రజా సంబంధాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, వాణిజ్యం, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలతో పాటు వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందించినవారిని ఈ అవార్డులకు ఎంపిక చేస్తారు.

పద్మ విభూషణ్ వీరికే

దువ్వూరి నాగేశ్వర్ రెడ్డి (వైద్యం) - తెలంగాణ
జస్టిస్ జగదీశ్ ఖేహర్ (రిటైర్డ్) (ప్రజా వ్యవహారాలు) - చండీగఢ్
కుముదిని రజనీకాంత్ లాఖియా (కళలు) - గుజరాత్
లక్ష్మీనారాయణ సుబ్రమణియం (కళలు) - కర్నాటక
ఎం.టి.వి.వాసుదేవన్ నాయర్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) - కేరళ
ఓసాము సుజుకీ (మరణానంతరం) (వాణిజ్యం, పరిశ్రమలు) - జపాన్
శారదా సిన్హా (కళలు) - బీహార్

పద్మభూషణ్ వీరికే..

నందమూరి బాలకృష్ణ (కళలు) - ఆంధ్రప్రదేశ్
ఎ.సూర్యప్రకాశ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) - కర్నాటక
అనంత్ నాగ్ (కళలు) - కర్నాటక
బిబేక్ దెబ్రాయ్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) - ఎన్‌సీటీ ఢిల్లీ
జతిన్ గోస్వామి (కళలు) - అసోం
జోస్ చాకో పెరియప్పురం (వైద్యం) - కేరళ
కైలాశ్ నాథ్ దీక్షిత్ (ఇతర- ఆర్కియాలజీ) - ఎన్‌సీటీ ఢిల్లీ
మనోహర్ జోషి (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) - మహారాష్ట్ర
నల్లి కుప్పుస్వామి చెట్టి (వాణిజ్యం, పరిశ్రమలు) - తమిళనాడు
పీఆర్ శ్రీజేశ్ (క్రీడలు) - కేరళ
పంకజ్ పటేల్ (వాణిజ్యం, పరిశ్రమలు) - గుజరాత్
పంకజ్ ఉదాస్ (మరణానంతరం) (కళలు) - మహారాష్ట్ర
రామ్‌బహదుర్ రాయ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) - ఉత్తర్‌ప్రదేశ్
సాధ్వీ రీతంభర (సామాజిక సేవ) - ఉత్తర్‌ప్రదేశ్
ఎస్.అజిత్ కుమార్ (కళలు) - తమిళనాడు
శేఖర్ కపూర్ (కళలు) - మహారాష్ట్ర
శోభన చంద్రకుమార్ (కళలు) - తమిళనాడు
సుశీల్ కుమార్ మోడీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) - బీహార్
వినోద్ ధామ్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) - అమెరికా

పద్మశ్రీ అవార్డులు

మందకృష్ణ మాదిగ (ప్రజావ్యవహారాలు) - తెలంగాణ
కె.ఎల్ కృష్ణ (సాహిత్యం, విద్య) - ఆంధ్రప్రదేశ్
మాడుగుల నాగఫణి శర్మ (కళలు) - ఆంధ్రప్రదేశ్
మిర్యాల అప్పారావు(మరణానంతరం) (కళలు)- ఆంధ్రప్రదేశ్
వదిరాజ్ రాఘవేంద్రచార్య పంచముఖి (సాహిత్యం, విద్య) - ఆంధ్రప్రదేశ్
జోనస్ మాశెట్టి (వేదాంత గురు) - బ్రెజిల్
హర్వీందర్‌సింగ్ (పారాలింపియన్ గోల్డ్‌మెడల్ విన్నర్) - హర్యానా
భీమ్ సింగ్ భవేష్ (సోషల్‌వర్క్) - బీహార్
పి.దక్షిణా మూర్తి (డోలు విద్వాంసుడు)- పుదుచ్చేరి
ఎల్.హంగ్‌థింగ్ (వ్యవసాయం-పండ్లు)- నాగాలాండ్
బేరు సింగ్ చౌహాన్ (జానపద గాయకుడు) - మధ్యప్రదేశ్
షేఖా ఎ.జె. అల్ సబాహ్ (యోగా)- కువైట్
నరేన్ గురుంగ్ (జానపద గాయకుడు) - నేపాల్
హరిమన్ శర్మ (యాపిల్ సాగుదారు) - హిమాచల్ ప్రదేశ్
జుమ్దే యోమ్‌గామ్ గామ్లిన్ (సామాజిక కార్యకర్త)- అరుణాచల్‌ప్రదేశ్
విలాస్ దాంగ్రే (హోమియోపతి వైద్యుడు) - మహారాష్ట్ర
వెంకప్ప అంబాజీ సుగటేకర్ (జానపద గాయకుడు) - కర్నాటక
నిర్మలా దేవి (చేతి వృత్తులు) - బీహార్
జోయ్నచరణ్ బతారీ (థింసా కళాకారుడు)- అసోం
సురేశ్ సోనీ (సోషల్‌వర్క్- పేదల వైద్యుడు)- గుజరాత్
రాధా బహిన్ భట్ (సామాజిక కార్యకర్త)- ఉత్తరాఖండ్
పాండి రామ్ మాండవి (కళాకారుడు) - ఛత్తీస్‌గఢ్
లిబియా లోబో సర్దేశాయ్ (స్వాతంత్ర్య సమరయోధురాలు) - గోవా
గోకుల్ చంద్ర దాస్ (కళలు)- పశ్చిమ బెంగాల్
సాల్లీ హెూల్కర్ (చేనేత)- మధ్యప్రదేశ్
మారుతీ భుజరంగ్‌రావు చిటమ్‌పల్లి (సాంస్కృతికం, విద్య)- మహారాష్ట్ర
బతూల్ బేగమ్ (జానపద కళాకారిణి) - రాజస్థాన్
వేలు ఆసన్ (డప్పు వాద్యకారుడు) - తమిళనాడు
భీమవ్వ దొడ్డబాలప్ప శిల్లేక్యాతర (తోలుబొమ్మలాట) - కర్నాటక
పర్మార్ లావ్జీభాయ్ నాగ్జీభాయ్ (చేనేత)- గుజరాత్
విజయలక్ష్మి దేశ్‌మానే (వైద్యం)- కర్నాటక
చైత్రం దేవ్‌చంద్ పవార్ (పర్యావరణ పరిరక్షణ)- మహారాష్ట్ర
జగదీశ్ జోషిలా (సాహిత్యం)- మధ్యప్రదేశ్
నీర్జా భట్లా (గైనకాలజీ) - ఢిల్లీ
హ్యూ కొల్లీన్ గాంట్జర్ (సాహిత్యం, విద్య - ట్రావెల్) - ఉత్తరాఖండ్

31న ఉస్మానియా ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

నలువైపులా రహదారులు ఉండాలనీ, దానికోసం అవసరమైనచోట్ల ఇతర మార్గాలను కలిపేలా అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, సహాయకులు, పరామర్శకు వచ్చే వారి వాహనాలు నిలిపేందుకు వీలుగా అండర్‌గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. డార్మిటరీ, ఫైర్‌స్టేషన్, క్యాంటిన్, మూత్రశాలలు, ఎస్టీపీలు నిర్మించాలని ఆదేశించారు. మరణించిన వారి పిల్లలు విదేశాల్లో స్థిరపడుతుండటంతో వారు వచ్చేందుకు రెండు, మూడు రోజులు పడుతోందనీ, అప్పటి వరకు మృతదేహాలను భద్రపర్చేందుకు ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. అవయవాల మార్పిడి, అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా హెలీ అంబులెన్స్‌లు వినియోగిస్తున్నందున హెలీప్యాడ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉండాలనీ, ఏదో కోల్పోతున్న భావన ఉండరాదని అన్నారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చీనాబ్ బ్రిడ్జిపై వందేభారత్

(మొదటిపేజీ తరువాయి)

వందే భారత్ రైలు పరుగులు తీసింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక వందేభారత్ టికెట్ ధర విషయానికి వస్తే.. ఢిల్లీ నుంచి కాశ్మీర్‌కు రూ.1,500 నుంచి రూ.2,100గా నిర్ణయించినట్లు తెలుస్తున్నది. రైలు మార్గమధ్యలో జమ్మూ, శ్రీమాతా వైష్ణోదేవి కత్రాలో స్టాప్స్ ఉండనున్నట్లు సమాచారం.

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఐలయ్య మృతి

నవతెలంగాణ-కొత్తగూడెం

పేదల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమ కెరటం, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని అయిలయ్య(75) మృతిచెందారు. కొత్తగూ డెం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుం టున్న సందర్భంలో ఒక్కసారిగా బీపీ తగ్గి, గుండెపోటు రావడంతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచా రు. అనంతరం ఆయన నివాసం సుజాతనగర్ మం డల కేంద్రానికి తరలించారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయనకు కుమారుడు లెనిన్, కుమార్తె జ్యోతి ఉన్నారు. ఇద్దరికి ఆదర్శ వివాహాలు చేశారు. భార్య కాసాని లక్ష్మి 2017లో సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలందిస్తూ అకాల మరణంచెందారు. కాసాని మృతి పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు తీవ్ర సంతాపం సానుభూతి తెలిపా రు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు అంత్యక్రియలు

ఆదివారం ఉదయం 10 గంటలకు సుజాతనగర్ మండల కేంద్రంలో సంతాప సభ అనంతరం అంత్యక్రియలు జరుగుతాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. అంత్యక్రియలో అన్ని వర్గాల ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కాసాని ప్రజా పోరాట నాయకులు :
మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు, సుజాతనగర్, కొత్తగూడెం ప్రాంతాల ప్రజల పక్షాన నాలుగున్నర దశాబ్దాల పాటు కాసాని ఐలయ్య తను నమ్మిన సిద్ధాంతం కోసం దీక్ష, పట్టుదలతో నిలబడ్డారు. రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చినా, ఇబ్బందులు తలెత్తినా ఎర్రజెండా పక్కన నిలబడిన నాయకులు ఐలయ్య. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ తుదిశ్వాస వరకు ప్రజల మధ్యనే జీవించారు. ప్రజా ఉద్యమాన్ని కాపాడటమే ఆయనకు ఇచ్చే నివాళి.

వైవిధ్యతను ఆచరిస్తేనే సమానత్వం

న్యూఢిల్లీ : స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏండ్లు పూర్తి చేసుకుని అజాదీ కా అమృత మహోత్సవ్ కాలంలో వున్న మన దేశం విశిష్టమైన గొప్పతనాన్ని, వైవిధ్యభరితమైన సంస్కృతిని చాటిచెబుతూ మనం ఈ పండుగను జరుపుకుంటున్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ 75వ గణతంత్ర దినోత్సవం ఎంతో ప్రత్యేకమైనదని, విశిష్టమైనదని వ్యాఖ్యానించారు. భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె శనివారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భారతదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ పశ్చిమ దేశాల్లోని ప్రజాస్వామ్య భావన కన్నా చాలా ప్రాచీనమైనదని అందుకే భారత్‌ను ప్రజాస్వామ్య మాతృకగా పిలుస్తారని ఆమె కొనియాడారు. అనేక ప్రతికూలతలను, అడ్డంకులను, సవాళ్ళను దాటుకుంటూ సాగిన 75ఏండ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో వివరించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆమె ప్రముఖంగా పేర్కొన్నారు. ఆర్థిక, సైన్స్, అంతర్జాతీయ సంబంధాలు సహా పలు రంగాల్లో భారత్ సాధించిన పలు విజయాలను ఈ సందర్భంగా ఆమె వివరించారు. మన మౌలిక విలువలు, సిద్ధాంతాలు, సూత్రాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి వుందన్నారు. ప్రజాస్వామ్యం అంటేనే వైవిధ్యభరితమైన సంస్కృతీ సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచారాలని అన్నారు. ఈ వైవిధ్యతను మనం ఆచరిస్తేనే సమానత్వం సిద్ధిస్తుందన్నారు. లింగ సమానత్వం దిశగా కూడా మనం పురోగతి సాధించామన్నారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించిందన్నారు. నారీ శక్తి వందన్ అభియాన్ మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన సాధనంగా మారుతుందన్నారు.

ఆత్మనిర్భర్ కోసం రైతుల కృషి

గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన 75ఏండ్ల తర్వాత కూడా దేశంలోని పలు ప్రాంతాలు దారిద్ర్యంలో వున్నాయని, ఆకలి బాధలను ఎదుర్కొంటున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మన విశ్వాసం చెక్కు చెదరలేదన్నారు. ఆ పరిస్థితులను అధిగమించేందుకు మనం అనేక చర్యలు, తీర్మానాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఆహార ధాన్యాలు, ఇతర పంటల విషయంలో మన దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు మన రైతాంగం చెమటోడ్చి నిరంతరంగా శ్రమించిందని అన్నారు. మన కార్మికులు కఠోర శ్రమతో మన తయారీ రంగాన్ని, మౌలిక వసతులను మరింత మెరుగైన రీతిలో వుండేలా తీర్చిదిద్దారన్నారు. ఈ రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో మనం చొరవలు తీసుకుంటున్నామన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీల అభివృద్ధికి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా పథకాలు రూపొందించిందన్నారు. ప్రాథమిక అవసరాలను ఒక హక్కుగా మార్చడం ద్వారా సంక్షేమం అన్న భావననే ప్రభుత్వం పునర్నిర్వచించిందన్నారు. సాహసోపేతమైన, దార్శనికత, ఆర్థిక బలంతో రాబోయే కాలంలో కూడా మన పురోగతి ఇదే వేగంతో కొనసాగుతుందన్నారు.

పటిష్టమైన ఆర్థిక వ్యవస్థతో వచ్చిన ఆత్మ విశ్వాసంతో మనం ముందుకు వెళుతున్నామన్నారు. ఇటీవలి కాలంలో ప్రధాన దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ జిడిపి వృద్ధిరేటు కొనసాగుతోందన్నారు. సమాజంలోని బలహీన వర్గాల వారికి ఉచిత ఆహారం అందించే పథకాలను కరోనా మహమ్మారి కాలంలో అమలు చేశామని, ఆ తర్వాత కూడా ప్రభుత్వం ఆ పథకాల పరిధిని పెంచి, అమలును కొనసాగిస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రస్తుత అమృత కాలంలో కనివినీ ఎరుగని సాంకేతిక మార్పులు ఎదురవుతున్నాయని, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి అధునాతన సాంకేతిక చొరవలు పతాక శీర్షికల నుండి మన రోజువారీ జీవితాల్లోకి వచ్చేశాయని ఆమె పేర్కొనానరు. రాబోయే భవిష్యత్తులో ఆందోళన చెందే అంశాలు, అవకాశాలు సృష్టించే రంగాలు కూడా అనేకం వున్నాయన్నారు. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకుంటే వారు సరికొత్త సరిహద్దులను అన్వేషిస్తూ ముందుకు సాగిపోతున్నారన్నారు. వారి మార్గంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగిస్తూ వారికి మార్గం సుగమం చేయడమే మన ముందున్న కర్తవ్యమని అన్నారు. వారి విశ్వాసమే రేపటి భారతాన్ని నిర్మిస్తుందని ఆమె ఆకాంక్షించారు. యువత మనస్సులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులే మన జాతి నిర్మాతలను ఆమె అభిప్రాయపడ్డారు. మౌనంగా పనిచేసుకుంటూ దేశానికి మరింత మెరుగైన భవితవ్యాన్ని అందించేందుకు ఇతోధికమైన సేవలందించే మన రైతాంగం, కార్మికులకు కచ్చితంగా మనందరం కృతజ్ఞులమై వుండాలని రాష్ట్రపతి పేర్కొన్నారు. చివరగా ఇటువంటి పర్వదినాన మనసాయుధ బలగాలకు, పోలీసులు, పారా మిలటరీ బలగాలకు భారత్ అభివాదం చేస్తోందన్నారు. వారి ధైర్యసాహసాలే లేకపోతే ఈనాడు మనం లేమని వ్యాఖ్యానించారు. చివరగా మనందరం మనం కృషి చేయగలిగే రంగాల్లో కృషి చేస్తూ, దేశానికి ఇతోధికంగా సేవలందిస్తూ, నిబద్ధతతో వ్యవహరిస్తూ లక్ష్యాల సాధన దిశగా సాగాలని కోరారు.

విభజించు..పాలించు

ఇదే కాషాయపరివార్ విధానం
జనం మదిలో రాజ్యాంగం... బీజేపీ మనసులో మనువాదం

సంగారెడ్డి నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధులు

దేశవ్యాప్తంగా ఆదివారం 75వ రాజ్యాంగ దినోత్సవం జరుగుతుంది. స్వాతంత్ర్య పోరాట ఫలితంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం జనవరి 26న అమల్లోకి వచ్చింది. ప్రజలందరి మదిలో రాజ్యాంగం ఉంది. కానీ బీజేపీ నాయకుల మనసులో రాజ్యాంగం లేదు. మనువాదం ఉన్నది. మనువాదానికి అనుగుణంగానే పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగానే పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్‌ను అవమానిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మాట్లాడారు. ఆయన మనసులో అదానీ-గాడ్సే ఉన్నారు. అమిత్‌షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత లేదు. మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలి.'అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో నాలుగు రోజులపాటు జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఐబీ కార్యాలయం నుంచి వేలాది మందితో భారీ ప్రజాప్రదర్శనను నిర్వహించారు. అనంతరం పీఎస్‌ఆర్ గ్రౌండ్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ఆహ్వానసంఘం చైర్మెన్ చుక్క రాములు అధ్యక్షతన జరిగిన బహిరంగసభకు ముఖ్యఅతిథిగా బృందాకరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రియమైన సోదర, సోదరీమణులారా పార్టీ మహాసభల నేపథ్యంలో అందరికీ లాల్‌సలాం అంటూ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు. ఈ మహాసభ ప్రజాప్రదర్శన, బహిరంగసభలో సీతారాం ఏచూరి లేరనీ, ఆయన మరణం పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని అన్నారు. తెలంగాణ ఉద్యమంతో ఆయనకు దగ్గరి సంబంధముందన్నారు. ఏచూరి స్ఫూర్తితో ఎర్రజెండాను, ఉద్యమాలను ముందుకుతీసుకెళ్లేందుకు శపథం తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. నిజాం నవాబు, బ్రిటీష్, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. కార్మికులే ఈ మహాసభలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దేశంలో కార్మికులు, రైతులు దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతున్నదని విమర్శించారు. కానీ కార్పొరేట్లకు మాత్రం రూ.మూడు లక్షల కోట్లు రాయితీలిచ్చిందని వివరించారు. మోడీ సర్కార్ పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కార్మిక సంఘాలన్నీ వాటికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని అన్నారు. వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, కనీస వేతనాలు అందడం లేదని చెప్పారు. ఎనిమిది గంటల పనివిధానం కాకుండా పది గంటలు, 12 గంటల పనివిధానం అమలవుతున్నదని విమర్శించారు. అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు అనేక సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. సామాన్యులపైకి బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్‌ను తెస్తే కమ్యూనిస్టులు అడ్డుకుంటారని చెప్పారు. పేదలు, రైతులు, కార్మికులపై జులుం ప్రదర్శిస్తే సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. రాజ్యాంగం, సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం, ఫెడరలిజంపై విశ్వాసం లేని వారు కేంద్రంలో పాలకులుగా ఉన్నారని విమర్శించారు. హిందూ ముస్లిం, ఆదివాసీ ముస్లింలను విభజిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ప్రజలను విభజించు పాలించు బ్రిటీష్ విధానాన్ని అనుసరిస్తున్నారని చెప్పారు. ప్రజల మధ్య కులం, మతం పేరుతో చిచ్చు పెట్టి రెచ్చగొడుతున్నారనీ, ఇది దేశానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మానికి, ప్రజల మత విశ్వాసాలకు, హిందూత్వ భావజాలానికి సంబంధమే లేదన్నారు. మతాన్ని ఆయుధంగా రాజకీయాలకు వాడుకోవడం సరైంది కాదని చెప్పారు. దీన్ని వ్యతిరేకించడం కోసమే ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. ఇండియా కూటమి అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండాలని సూచించారు. స్వార్థం కోసం, కుటుంబం కోసం కాకుండా సమాజ మార్పుకోసం సీపీఐ(ఎం) పోరాడుతుందని ఆమె చెప్పారు. ఎర్రజెండాను ముందుకెళ్లాలనీ, మతోన్మాద శక్తులను వెనక్కి కొట్టాలని అన్నారు. దోపిడీ లేని వ్యవస్థ కోసం పోరాటం చేయాలన్నారు.



మతోన్మాదులారా ఖబడ్దార్ : తమ్మినేని

(మొదటిపేజీ తరువాయి)

చూడ్డమేనని చెప్పారు. మతోన్మాదాన్ని తిప్పికొడతామని అన్నారు. ఖబడ్దార్ మతోన్మాదులారా... బీజేపీ కుయుక్తులను అడ్డుకుంటామని చెప్పారు. పార్టీ నాలుగో మహాసభలో చర్చించి సమరశీల పోరాటాలను నిర్వహిస్తామన్నారు. సకల జనులు బీజేపీ ప్రమాదాన్ని గుర్తించి అడ్డుకోవాలని కోరారు. బీజేపీకి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, టీడీపీని కలుపుకుని పోతామని చెప్పారు. అందరినీ ఒకతాటిమీదకు, ఒక వేదికమీదకు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఇచ్చిన వాగ్ధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేస్తే సమర్థిస్తామనీ, విస్మరిస్తే పోరాటం చేస్తామని చెప్పారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, మహిళలకు రూ.2,500 అమలు ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలు ఓట్లు వచ్చినపుడు ఒక మాట, తర్వాత ఇంకోమాట మారుస్తున్నాయని అన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, లగచర్ల, దామగుండం వంటి సమస్యలపై అన్ని పార్టీలనూ పిలిచి మాట్లాడారా?అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుంటే ప్రశ్నిస్తామనీ, ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే అడ్డుకుంటామని అన్నారు. కలిసొచ్చే శక్తులను కలుపుకుని పనిచేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర మహాసభల్లో చర్చించి ప్రజా ఉద్యమాలకు పూనుకుంటామని చెప్పారు.

ఎర్రజెండా కోసం మేమున్నామని సహకరించడం స్ఫూర్తిదాయం : చుక్క రాములు



మహాసభలను జయప్రదం చేయడానికి పారిశ్రామిక కార్మికవర్గం రెండు నెలల నుంచి కష్టపడుతున్నదనీ, ఎర్రజెండా కోసం మేమున్నామనీ పారి శ్రామిక కార్మికులు, అసంఘటిత కార్మికులు, స్కీం వర్కర్లు, వ్యవసాయ కూలీలు, రైతులు, పేదలు అన్ని విధాలా సహకరించడం స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మెన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు కొనియాడారు. జహీరాబాద్‌లో నిమ్జ్ కోసం 12,500 ఎకరాలను గుంజుకుంటే బాధితుల పక్షాన పోరాడింది సీపీఐ(ఎం) మాత్రమేననీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఒక్కరు కూడా ముందుకు రాలేదని వివరించారు. సంగారెడ్డి జిల్లాలోని అనేక పరిశ్రమల్లో మెరుగైన వేతన ఒప్పందాలు జరిగే పోరాటాలు చేయడంలోనూ, విజయం సాధించడంలోనూ ఎర్రజెండా పాత్ర కీలకమని నొక్కి చెప్పారు. కార్మికులంతా ఒక్కతాటిపై ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

దమ్ముంటే అందరికీ అన్ని సౌకర్యాలు కల్పించండి : జూలకంటి రంగారెడ్డి



ఒకే దేశం ఒకే ఎన్నిక..ఒకే దేశం..ఒకే పన్ను..ఒకే దేశం.. ఒకే ఆహారం.. నినాదాలను మాని దమ్ముంటే దేశంలో అందరీ అన్ని సౌకర్యాలు కల్పించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. దేశంలో అందరికీ వైద్య, విద్యా సౌకర్యాలను కల్పించాలని కోరారు. దేశంలో 80 కోట్ల మందికి తాము ఉచితంగా రేషన్ ఇస్తున్నామని చెప్పడానికి పాలకులు సిగ్గుపడాలన్నారు. దేశంలో రాజకీయాలు వ్యాపారమయం అయ్యాయనీ, బూర్జువా పార్టీలు ప్రయివేటు కంపెనీల లిమిటెడ్‌లుగా మారాయని విమర్శించారు. పాలకులు సంపన్నుల కోసం పనిచేస్తూ పేదలపై పన్నులు, భారాలు, అప్పులు మోపుతున్న తీరును ఎండగట్టారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మహాసభలో చర్చించి సమరశీల పోరాటాలకు రూపకల్పన చేస్తామని చెప్పారు.

ప్రభుత్వాలకు ఎర్రజెండా అంటే భయం : చెరుపల్లి సీతారాములు



ప్రజల పక్షాన కొట్లాడే ఎర్రజెండా పార్టీ నాయ కులంటే పాలకపార్టీలకు భయమనీ, ప్రజల పక్షాన పోరాడుతున్న ఎంతో మంది నాయకులను చంపే శాయని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు చెప్పారు. దోపిడీదారులకు వ్యతిరేకంగా నికరంగా పోరాడుతున్నది ఎర్రజెండానే అన్నారు. సీపీఐ(ఎం) పార్టీకి ఓట్లు, సీట్లు అటుఇటైనా పేదల కోసం నిలబడి పోరాడుతుందని నొక్కి చెప్పారు. రాష్ట్రానికి, దేశానికి పెట్టుబడులు అంటూ మోడీ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబు విదేశాల్లో తిరుగుతున్నారనీ, వారు తిరిగేది ప్రజల కోసం కాదు..తమకు దక్కాల్సిన మూటల కోసమని విమర్శించారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే ఎక్కడ పోయిందో అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి సర్కారు కులగణన, దరఖాస్తుల స్వీకరణతో కాలం వెళ్లబుచ్చుతున్నదని వివరించారు. మోడీ సర్కారు మతం, కులం చుట్టూ ప్రజలను తిప్పుతుంటే..రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దరఖాస్తుల చుట్టూ తిప్పుతున్నదని విమర్శించారు.

పేదలకు భూములివ్వకుండా పెద్దలకిచ్చే యత్నం : జి.నాగయ్య



రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందనీ, దాన్ని పేదలకు పంచకుండా పారిశ్రామి కవేత్తలకు కేటాయించే ప్రయ త్నంలో రాష్ట్ర సర్కారు ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య విమర్శిం చారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి సొంత ఇండ్లు లేవనీ, వారికి ఇండ్ల జాగాలు ఇచ్చేందుకు పాలకులకు చేయి రావడం లేదని చెప్పారు. అసైన్డ్ భూమి ఎకరం ఇస్తే 400 గజాలిచ్చి అమ్ముకునే హక్కు కల్పిస్తామని చెబుతూ పేదలను భూముల నుంచి దూరం చేసే యత్నంలో పాలకులు ఉన్నారని చెప్పారు. 69 కేంద్రాల్లో ఇండ్ల జాగాల కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు.

పోరాటాల గడ్డ ఎర్రజెండా వెలుగుల కోసం చూస్తోంది : ఎస్.వీరయ్య



తెలంగాణ పోరాటాల గడ్డ అనీ, ఎర్రజెండా వెలుగుల కోసం ఎదురుచూస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు హామీనిచ్చిన ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు మినహా ఏదీ అమలు కావడం లేదని విమర్శించారు. కనీస వేతనాల కోసం కార్మికుల పక్షాన కొట్లాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వమేమో 10 వేలు, 12 వేలు చాలని జీవోలు విడుదల చేస్తున్నదనీ, ప్రధాని మోడీనేమో రోజువారీ కూలి రూ.178 ఇస్తే సరిపోతుందని అంటున్నారని విమర్శించారు. ఆ వేతనంతో ఒక్క బీజేపీ నేతగానీ, నాయకులుగానీ బతికి చూపించాలని సవాల్ విసిరారు. 8 గంటల పనివిధానాన్ని తీసేసి రెండు షిఫ్టు విధానం(12 గంటల పనివిధానం) తేవడం ప్రమాదకరమన్నారు. విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. సింగరేణిని క్రమంగా ప్రయివేటీకరిస్తుంటే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు గమ్ముగా ఉండటాన్ని తప్పుబట్టారు. పేరు ఆర్టీసీ..బస్సులు ప్రయివేటువేంటి అని రేవంత్‌సర్కార్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర హక్కుల కోసం కొట్లాడాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్‌కుమార్, బి వెంకట్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి, పోతినేని సుదర్శన్, డిజి నరసింహారావు, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి సాగర్, పి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన ఎర్ర సముద్రం
కదం తొక్కిన రెడ్ ఆర్మీ



- దద్దరిల్లిన ప్రజా ప్రదర్శన
- కోలాట, దప్పుల దర్వులాట...విచిత్ర వేషాధారణ
- ఎర్ర తోరణమై సాగిన కార్మిక, శ్రామిక జనం
- జనంతో కలిసి సాగిన సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు
- ప్రదర్శనలో బృందాకరత్, బీవీ రాఘవులు, కేంద్ర, రాష్ట్ర నాయకులు
- ఐబీ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు ఎర్ర ప్రవాహం
- అమరుల స్మారకంగా మూడు జ్యోతులు అందజేత

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మిక, కర్షక లోకం ఎర్ర ప్రవాహమై సాగింది. రెడ్ ఆర్మీ కదం తొక్కడంతో ఎర్ర సముద్రంలా ఉప్పొంగింది. డప్పులదర్వులు, కోలాటా నృత్యాలు ధూంధాం చేశాయి. విచిత్ర వేషాధారణలు ఆలోచింపజేసి ఆకట్టుకున్నాయి. చీమల దండై కదిలిన ఎర్రసైన్యం కవాతుతో సంగారెడ్డి పట్టణం దద్దరిల్లింది. రెడ్ షర్ట్స్, ఎర్రచీరలు ధరించి... ఎర్రజెండాను భుజాన ఎత్తిపట్టి "అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా' అంటూ పాట పాడుతూ ఆటలాడుతూ సాగిన ప్రజా ప్రదర్శన అబ్బురపరిచింది. ఈ నెల 25-28 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి, కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో (గోకుల్ గార్డెన్) జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల్లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ ప్రజా ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఐబీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా సాగారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది సీపీఐ(ఎం) కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, పేదలు, మహిళలు పెద్దఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఐబీ నుంచి ప్రారంభమైన ప్రజా ప్రదర్శన బహిరంగ సభాస్థలికి చేరుకుంది. ప్రదర్శన ముందు భాగాన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, బీవీ రాఘవులు, కేంద్రకమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, టి.సాగర్, అబ్బాస్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఇతర ముఖ్య నాయకులు ముందు భాగాన సాగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై బృందాకరత్ ప్రజలకు అభివాదం చేశారు.

దప్పుల దర్వులు...కోలాటాల నృత్యాలు

సీపీఐ(ఎం) ప్రజా ప్రదర్శనలో డప్పు కళాకారులు చిందేస్తూ దరువేశారు. ప్రదర్శన అగ్రభాగాన సాగిన డప్పు కళాకారులు ఎర్రజెండా పాటల ఊపులో ఆడిపాడారు. ఎర్ర దుస్తులు ధరించి ప్రత్యేక శిక్షణ పొందిన కళాకారులు ప్రదర్శనకు ఊపుతెచ్చారు. మహిళా కళాకారులు కోలాటాల నృత్యాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రెండూ మూడు కోలాట దళాలు ఎర్రజెండా పాటలపై కోలాట దర్వులేస్తూ ఆడాయి. అదే విధంగా ప్రదర్శనలో విచిత్ర వేషాధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలే కాకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాలు, మతోన్మాద పోకడల్ని ఎత్తిచూపుతూ వేసిన వేషాలు ఆలోచింపజేశాయి. రాజ్యాంగానికి ముప్పు వాటిల్లిన నేపథ్యంలో సీపీఐ(ఎం) రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించింది. ప్రదర్శనలో రాజ్యాంగం చేతబట్టిన ఇద్దరు కళాకారులు అంబేద్కర్ వేషాధారణతో ప్రదర్శనలో ముందు నడిచారు. అదే విధంగా బీజేపీ దేవుళ్ల జపం చేస్తూ మతాన్ని రాజకీయాలకు వాడుతున్న దృశ్యం కూడా మతసామరస్యం కోరుకునే వాళ్లను ఆలోచింపజేసింది. సరళీకృత విధానాల వల్ల పేదలు మరింత పేదలవుతున్న తీరు.. హిందూ, ముస్లీం, క్రిష్టయన్ వేషాధారణలో మత సామరస్యాన్ని కోరే సందేశానిచ్చారు. మతోన్మాద భూతం, రైతులు, కనీస వేతనాల్లేని కార్మికులు, హింసకు గురవుతున్న మహిళల వంటి వేషాధారణలు ప్రదర్శనలో ప్రత్యేకంగా నిలిచాయి.

కదం తొక్కిన కార్మిక వర్గం

ప్రజా ప్రదర్శనలో కార్మిక వర్గం కదం తొక్కింది. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న సంగారెడ్డిలో సీపీఐ(ఎం) కార్మిక వర్గం గట్టి పునాది కలిగి ఉన్నది. అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి కార్మికులకు మెరుగైన వేతనాలు సాధించి పెట్టింది. అందుకే సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల ప్రదర్శనలో ఎర్రజెండాలు చేతబూని కదం తొక్కుతూ కదిలారు. అసంఘటిత రంగంలోని హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. భూ నిర్వాసితులు, రైతులు, గ్రామీణ, పట్టణ పేదలు, ఇండ్ల స్థలాల పోరాటంలో పాల్గొన్న పేదలు అత్యధికంగా ర్యాలీకి తరలివచ్చారు.





కార్పొరేట్లే వాళ్ల దోస్తులు : బీవీ రాఘవులు



(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నదనీ, కార్పొరేట్ల కోసం చట్టాలు మారుస్తూ పోతున్నదని విమర్శించారు. దేశంలోని మార్కెటింగ్ వ్యవస్థను అంబానీ, అదానీలకు కట్టబెట్టే పనిలో మోడీ సర్కారు ఉందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, టీడీపీ, వైసీపీలు సంపన్నుల కోసం పనిచేసే పార్టీలని చెప్పారు. మోడీ ప్రభుత్వం వచ్చాక అంబానీ ఆస్తి లక్ష కోట్ల రూపాయల నుంచి రూ.8 లక్షల కోట్లకు, అదానీ ఆస్తి రూ.40 వేల కోట్ల నుంచి రూ.7.5 లక్షల కోట్లకు పెరిగిన తీరును వివరించారు. ట్రంప్ గెలిచాక డిన్నర్ పార్టీకి మన దేశం నుంచి అంబానీని మాత్రమే పిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. పెట్టుబడిదారులకు ఎర్రజెండా ప్రాధాన్యత తెలుసుననీ, అందుకే పాలకులతో నిరంతరం అణచివేయిస్తూ అరెస్టులు చేయిస్తున్నారని చెప్పారు. మోడీ సర్కారు ప్రశ్నిస్తే జైలుకు పంపిస్తున్నదనీ, పౌర హక్కుల కోసం నిలదీస్తే చంపేస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని మోడీ సర్కారు హరిస్తున్నదని తీరును వివరించారు. ప్రజాస్వామ్యం ఉంటేనే కష్టజీవులకు హక్కులుంటాయని నొక్కి చెప్పారు. అందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబితే మోడీ సర్కారు దాన్ని భగ్నం చేస్తున్నదని విమర్శించారు. కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. వేతన హక్కును కల్పించాలనీ, 60 ఏండ్లు దాటిన కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరికీ ఇల్లు, విద్య, వైద్య సౌకర్యాల కల్పన హక్కు ఉండాలని నొక్కి చెప్పారు. ఈ హక్కుల కోసం కొట్లాడేది ఎర్రజెండా మాత్రమేననీ, ఇతర పార్టీలకు అది చెప్పే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. ఒకేదేశం..ఒకే ఎన్నిక వస్తే ముందు అంతరించిపోయే పార్టీలు బీఆర్‌ఎస్, టీడీపీ, వైసీపీ అనీ, ఆ తర్వాత కాంగ్రెస్ అంతమైపోతుందని చెప్పారు. ఇదంతా ఏకపార్టీగా బీజేపీ మిగిలే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్నీ, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కపౌరునిపైగా ఉందని నొక్కి చెప్పారు.

అమరుల స్ఫూర్తి కొనసాగింపుగా..

ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుల స్ఫూర్తికి కొనసాగింపుగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల నుంచి స్మారకజ్యోతులతో సీపీఐ(ఎం) శ్రేణులు ర్యాలీగా వచ్చారు. సూర్యాపేట జిల్లా నుంచి తీసుకొచ్చిన మల్లు స్వరాజ్యం స్మారకజ్యోతిని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్‌కు అందజేశారు. భైరాన్‌పల్లి నుంచి సీపీఐ(ఎం) శ్రేణులు తీసుకొచ్చిన అమరవీరుల స్మారకజ్యోతిని పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులుకు అందజేశారు. కేవల్ కిషన్ స్మారకంగా మెదక్ జిల్లా శ్రేణులు తీసుకొచ్చిన అమరవీరుల స్మారకజ్యోతిని కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములుకు అందజేశారు. 'అమరుల ఆశయాలను కొనసాగిద్దాం..' అంటూ ప్రతినబూనారు.



హైదరాబాద్ చేరుకున్న ప్రకాశ్‌కరత్

- సీపీఐ(ఎం) నాయకుల ఘన స్వాగతం

సంగారెడ్డిలో కొనసాగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభల్లో పాల్గొనేందుకు ఆ పార్టీ సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ శనివారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం అడివయ్య, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు.











Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886